అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సోమవారం 05-08-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 217
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
14 పేజీలు వెల : 6.50



14లో

చక్‌దే ఇండియా
ఒలింపిక్ సెమీస్‌లో హాకీ ఇండియా



పత్రికా రంగంలో ఓ పోరాట పతాక
ప్రత్యామ్నాయ జర్నలిజానికి ప్రతీక
దీనికి ప్రజలే విలేకరులు

"నవతెలంగాణ తొమ్మిదవ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా సిబ్బందికి, యాజమాన్యానికి, ముఖ్యంగా పాఠకులకు అభినందనలు.. శుభాకాంక్షలు.. ఇలా నవతెలంగాణ మరెన్నో వసంతాలు జరుపుకోవాలి. ప్రజల సేవకు పునరంకితమవుతూ నిత్యనూతనం కావాలి. నవతెలంగాణ ఏర్పడిన నాటి నుంచి నేను చూస్తున్నాను. అది ప్రజల పత్రికగా, ప్రత్యామ్నాయ జర్నలిజానికి ప్రతీకగా సాగుతోంది. ఇవ్వాళ మనకు తెలుసు. పత్రికలు పెద్ద వ్యాపారంగా మారిపోయాయి. పత్రికలకు రాజకీయ పార్టీలకు ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలు కనబడుతున్నాయి. అనేక రకాల వ్యాపార ప్రయోజనాలు, వాణిజ్య ప్రయోజనాలు పత్రికల కంటెంట్‌ను నిర్దేశిస్తున్న సందర్భంలో మనం ఈ రోజు ఉన్నాం. ఇలాంటి సమయంలో నోరు లేని పేదల పక్షాన, కార్మికుల పక్షాన, కర్షకుల పక్షాన, కష్టజీవుల పక్షాన ఏ పత్రిక ఎంత మేరకు నిలబడుతుందనేది ఒక ప్రశ్న. పెట్టుబడికి-శ్రమకు మధ్య జరిగే నిరంతర ఘర్షణలో మెయిన్ స్ట్రీమ్‌గా చెప్పబడే అత్యధిక పత్రికలు పెట్టుబడివైపే నిలబడతాయని మన అనుభవం రుజువు చేస్తున్నది. ఇటీవల మద్యం కవరేజి చూస్తే మనకర్థమవుతుంది. బడ్జెట్‌లో ప్రజలు, ముఖ్యంగా కష్టజీవుల ప్రయోజనాల గురించి ఎన్ని పత్రికల్లో ఎన్ని విశ్లేషణలు, ఎన్ని కథనాలు వచ్చాయో చూడండి. అందుకే ఎంత బలమైన మీడియా ఉన్నా ప్రజల మీడియా, ప్రత్యామ్నాయ మీడియా అవసరం ఎప్పుడూ ఉంటుంది. వీటికి వనరులు ఉండకపోవచ్చు. వేల కొలది జీతాలిచ్చి కలం నిపుణులను పెట్టుకోలేకపోవచ్చు. పెద్ద మార్కెటింగ్ నెట్‌వర్క్ ఉండకపోవచ్చు. కానీ సమాజంలో ఏ రకమైన శక్తుల ప్రలోభాలకు, ప్రభావాలకు లోను కాకుండా ప్రజల పక్షాన రాజీలేని పోరాటం చేసే సామర్థ్యం మాత్రం ఉంటుంది. ఇందుకు నిలువెత్తు నిదర్శనం నవతెలంగాణం. వేలాది, లక్షలాది మంది ప్రజల్ని రిప్రజెంట్ చేస్తున్న నవతెలంగాణ లాంటి పత్రికలకు ఆ ప్రజలే విలేకరులుగా మారుతారు. దీన్ని క్రౌడ్ సోర్సింగ్ అంటారు. ప్రజలే విలేకరులుగా మారి వార్తలు చేరవేస్తుంటారు. అందువల్ల ప్రత్యామ్నాయ పత్రికగా, ప్రత్యామ్నాయ జర్నలిజంగా, ప్రజల జర్నలిజంగా నవతెలంగాణ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాను"

- ప్రొఫెసర్ కె. నాగేశ్వర్

భగ్గుగనులు



"భూమి పొరల్లో మాగాణి.. తెలంగాణ వెలుగుల జనని.. శ్రామిక జన సంజీవిని.. మన సింగరేణి.." దశాబ్దాల చరితగల సింగరేణి కీర్తిని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చీకటిమయం చేస్తోంది. ఒక్కోగనిని వేలం వేస్తూ ప్రయివేటీకరణకు వంత పాడుతోంది. ఈ నేపథ్యంలో సింగరేణి పరిరక్షణ యాత్రకు సీపీఐ(ఎం) జులై 29న బెల్లంపల్లి నుంచి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని కోల్‌బెల్ట్ ప్రాంతాల మీదుగా సాగుతున్న ఈ బస్సు యాత్ర బొగ్గు గనుల పుట్టినిల్లయిన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సోమవారం ముగుస్తుంది. ఈ నేపథ్యంలో సింగరేణిని కేంద్రం ఎలా బలిపెడుతుందో.. లక్షలాది కార్మిక కుటుంబాలను ఎలా మసిచేయనుందో.. వివరిస్తూ 'నవతెలంగాణ' ప్రత్యేక కథనం..

కార్మికుల జీవితాలతో ఆటలాడుతున్న కేంద్రం
- వేలం పేరుతో ఒక్కో గని ప్రయివేటు పరం
- పరిరక్షణకై సాగుతున్న సీపీఐ(ఎం) యాత్ర
- నేడు పెనుబల్లి-సత్తుపల్లిలో ర్యాలీ.. కొత్తగూడెంలో ముగింపు సభ

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

సింగరేణిది శతాబ్దానికి పైబడిన చరిత్ర. 1774లో పశ్చిమబెంగాల్‌లో దామోదర నది పశ్చిమ ఒడ్డున రాణిగంజ్ కోల్‌ఫీల్డ్‌లో ఈస్టిండియా కంపెనీ బొగ్గు తవ్వకాలు ప్రారంభించింది. 1871లో ఇల్లెందు- సింగరేణి ప్రాంతంలో బొగ్గు నిక్షేపాలను కనుగొన్నారు. 1920 డిసెంబర్ 23న సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ప్రభుత్వరంగ కంపెనీగా రిజిస్టర్ అయింది. 1956లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నియంత్రణలో ప్రభుత్వ కంపెనీగా మారింది. 1971 వరకు భారతదేశంలో బొగ్గు గనులు ప్రయివేటు వారి చేతుల్లోనే ఉన్నా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం నైజాం కాలం నుంచి సింగరేణి ఆధీనంలోనే ఉన్నాయి. దీనిలో నూరేండ్లకు పైబడిన కార్మిక పోరాటాలు ఓ విడదీయలేని భాగం. ఏడు లక్షలకు పైగా ఉన్న కోల్ ఇండియా కార్మికవర్గానికి ఉద్యమాలు కొత్తకాదు. కార్మిక హక్కుల సాధన కోసం చేసిన పోరాటాలు అన్నీఇన్నీ కాదు. సింగరేణిని కాపాడుకునేందుకు ఎన్నో ఉద్యమాలు.. ఎన్నో ప్రాణత్యాగాలు చేసిన చరిత్ర కార్మిక లోకానిది. రూపానికి నల్లగా ఉన్నా లోకానికి వెలుగులనిచ్చే బొగ్గు గనుల కోసం ఎందరో అమరులైన విషయం మనకు తెలిసిందే. కానీ నేటి కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వేలం పాటల ద్వారా గనులను ప్రయివేటీకరిస్తూ సింగరేణి ఉనికినే ప్రశ్నార్థకంగా మార్చాలనే కుట్ర చేస్తోంది. మోడీ ప్రభుత్వం వచ్చాక ఒకనాడు లక్షకు పైగా ఉన్న కార్మికులు నేడు 45వేలకు తగ్గారు. 50కి మించి ఉన్న భూగర్భ గనులు 20కి పడిపోయాయి. మరోవైపు నాలుగు ఉన్న ఓపెన్ కాస్టులను 20కి పైగా పెంచుతూ ప్రయివేటీకరణను కేంద్రం వేగవంతం చేస్తోంది.

వేలం పేరుతో కబళించే యత్నం..

దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం 60 బొగ్గు ...6లో



బొగ్గు బ్లాకులు లేకుంటే సింగరేణి మనుగడ కష్టం
సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య 5లో..



ప్రజలే సింగరేణిని కాపాడుకోవాలి 13లో..
ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లి కేంద్రంపై రాష్ట్ర సర్కారు ఒత్తిడి తేవాలి : సీఐటీయూ



అమెరికాలో సీఎం రేవంత్ రెడ్డి..
న్యూయార్క్ విమానాశ్రయంలో తెలుగు ప్రజల నుంచి ఘనస్వాగతం



న్యూయార్క్ : తెలంగాణ ఆర్థికాభివృద్ధికి, ఉద్యోగ ఉపాధి కల్పనకు దోహదపడే పెట్టుబడులు తీసుకురావడం, వ్యూహాత్మక భాగస్వామ్యాలు చేసుకోవడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన ప్రారంభమైంది. న్యూయార్క్ ఎయిర్ పోర్టులో సీఎం రేవంత్ రెడ్డి బృందానికి తెలుగు ప్రజలు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు, పూలమాలలు, శాలువాలు కప్పుతూ స్వాగతం పలికారు. అయితే.. అమెరికాతో పాటు దక్షిణ కొరియాలోనూ రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు.

పెట్టుబడుల కోసం ప్రయత్నించండి
సీఎం బృందానికి మాజీమంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



పెట్టుబడుల ఆకర్షణ కోసం అమెరికా, దక్షిణ కొరియా దేశాల్లో పర్యటించేందుకు వెళ్ళిన ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కూడిన తెలంగాణ ప్రతినిధి బృందానికి భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి ...13లో

దళిత మహిళపై కర్కశత్వం
షాద్‌నగర్‌లో థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులు
- దెబ్బలు తట్టుకోలేక దాహమని అడిగితే నీళ్లు తాపి మరీ టార్చర్
- దొంగతనం చేసిందనే అనుమానంతో అదుపులోకి
- ఆలస్యంగా వెలుగుచూసిన వైనం
- విచారణకు పోలీసు ఉన్నతాధికారుల ఆదేశం
- వాస్తవాలు తేలితే చర్యలు తీసుకుంటాం : శంషాబాద్ డీసీపీ రాజేష్
- బాధితురాలిని ఆస్పత్రిలో పరామర్శించిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ బృందం



నవతెలంగాణ-షాద్‌నగర్

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో అమానుషం చోటుచేసుకుంది. జై భీమ్ సినిమా తరహాలో దళిత మహిళపై పోలీసులు థర్డ్ డిగ్రీ ఉపయోగించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బంగారం దొంగతనం చేసిందనే అనుమానంతో ఓ దళిత మహిళను అదుపులోకి ...13లో


రైతుగా మారిన మెదక్ జిల్లా కలెక్టర్
పొలంలో నాట్లు వేసిన కలెక్టర్ దంపతులు



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్


మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదివారం రైతుగా మారారు. ఔరంగాబాద్‌లోని కలెక్టర్ క్యాంప్ ఆఫీస్‌కు ఆనుకుని ఉన్న గొల్ల నారాయణ పొలంలో వరి నారు పీకి, నాట్లు వేశారు రాహుల్ రాజ్ దంపతులు, వారి ఇద్దరి పిల్లలు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నారు మడి నుంచి పంట అమ్మకం వరకు ప్రతీ దశలో రైతుకు అండగా ఉంటూ అవసరమైన సలహాలు, సూచనలు అందజేసి రైతు లాభదాయక సాగు చేసే దిశగా అధికారులు పని చేయాలని ఆదేశించారు. వరి నాట్లు వేస్తున్న రైతుల పొలాలను పరిశీలించి, సాగు పద్ధతులను, పంటలో వచ్చే లాభం, సాగులో ఎదురవుతున్న ఇబ్బందులు తదితరాంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

వక్ఫ్ ఆస్తులపై కేంద్రం కన్ను
బోర్డు అధికారాలను పరిమితం చేయాలని యోచన
- చట్ట సవరణలకు క్యాబినెట్ ఆమోదం
- వచ్చే వారం పార్లమెంటులో బిల్లు



న్యూఢిల్లీ : వక్ఫ్ ఆస్తులపై నరేంద్ర మోడీ ప్రభుత్వం కన్నేసింది. వాటిపై వక్ఫ్ బోర్డ్‌కు ఉన్న అధికారాలను పరిమితం చేయాలని భావిస్తోంది. ఇందుకోసం వక్ఫ్ బోర్డ్ చట్టానికి సవరణలు చేయాలని యోచిస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం కేంద్ర క్యాబినెట్ శుక్రవారం 40 సవరణలకు ఆమోదం తెలిపింది. ఏదైనా ఆస్తిని 'వక్ఫ్ ఆస్తి'గా పరిగణించేందుకు బోర్డుకు ఉన్న అధికారాలను కుదించాలన్న ...13లో

గుజరాత్‌లో న్యాయ్ యాత్ర
9న మోర్బీ నుంచి ప్రారంభం
- రాహుల్, ఖర్గేలు పాల్గొనే అవకాశం
- రాష్ట్రంలో చోటు చేసుకున్న ఘటనలను వెలుగులోకి తీసుకురావటమే ముఖ్యోద్దేశం : కాంగ్రెస్



అహ్మదాబాద్: గుజరాత్ కాంగ్రెస్ ఈనెల 9న నిరసన యాత్ర 'న్యాయ్ పాదయాత్ర'ను ప్రారంభించనున్నది. ఈ యాత్రకు కాంగ్రెస్ సేవాదళ్ చీఫ్ లాల్జీ దేశాయ్, గుజరాత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శక్తిసిన్హ్ గోహిల్, కాంగ్రెస్ ఎమ్మెల్యే జిగ్నేష్ మేవానీ నాయకత్వం వహిస్తారు. లోక్‌సభలో ...13లో

ఆరేండ్ల నుంచి ఆరు కి.మీ కట్టలే..!
ఎలివేటెడ్ కారిడార్ ఫ్లైఓవర్ పనుల జాప్యంపై మంత్రి కోమటిరెడ్డి ఆగ్రహం
- కేటీఆర్ ఇంగ్లీషులో మాట్లాడటమే కానీ అభివృద్ధి చేయలే..
- వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్రంలో 175 అసెంబ్లీ స్థానాలు
- అందులో 135 మేమే గెలుస్తాం
- ముఖ్యమంత్రి మళ్ళీ రేవంత్ రెడ్డే..
- ఎలివేటెడ్ కారిడార్ పనుల పరిశీలన సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్

ఆరేండ్ల నుంచి ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనుల్లో తీవ్రమైన జాప్యం జరుగుతుందని, వరంగల్, నల్లగొండ జిల్లాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. గత పాలకుల అలసత్వం కారణంగానే ఎలివేటెడ్ కారిడార్ పనులు పూర్తి కాలేదని తెలిపారు. ఆదివారం మేడ్చల్ జిల్లాలోని ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ ఫ్లై ఓవర్ పనులను స్థానిక ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్నీ తానై నడిపిన మాజీ మంత్రి కేటీఆర్ ఇంగ్లీషులో మాట్లాడటం, సెల్ఫీలు తీసుకోవడం తప్ప.. ఏనాడూ హైదరాబాద్ అభివృద్ధిపై దృష్టి సాధించలేదని విమర్శించారు. గతంలో ఈ ప్రాంత ఎంపీగా గెలిచిన రేవంత్‌రెడ్డి ఎలివేటర్ కారిడార్ నిర్మాణ పనుల్లో జరుగుతున్న జాప్యంపై అనేక సార్లు పార్లమెంటులో ప్రశ్నించారని గుర్తుచేశారు. ఈ మధ్య కాలంలో స్వయంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ఫ్లై ఓవర్ సమస్యను వివరించామని తెలిపారు. నూతన టెండర్లతో పనులు చేసేందుకు అవకాశం ఇచ్చారని, అయితే వ్యయం రూ.200 నుంచి రూ.300 కోట్ల వరకు పెరిగే అవకాశం ఉందని చెప్పారు. మరో పది రోజుల్లో పనులు ప్రారంభించాలని అధికారులకు ...13లో

కేంద్ర బడ్జెట్ దళిత వ్యతిరేకం
అరకొర నిధులు కేటాయింపు.. 8న బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఆందోళన
- 16.2 శాతం కేటాయించాలి..కానీ 11 శాతం మించలేదు
- ప్రయివేట్ రంగంలోనూ రిజర్వేషన్ల కల్పనకు బిల్లు ప్రవేశపెట్టాలి
- షెడ్యూల్డ్ కులాల సబ్ ప్లాన్‌ని జాతీయ స్థాయిలో అమలు చేయాలి : దళిత హక్కుల కోసం సమన్వయ కమిటీ



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర బడ్జెట్ దళిత వ్యతిరేక బడ్జెట్ అని, దీనికి వ్యతిరేకంగా ఈ నెల 8న దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని దళిత హక్కుల కోసం సమన్వయ కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆదివారం ఆ కమిటీ నేతలు మల్లేపల్లి లక్ష్మయ్య, ఎంపీ రాధాకృష్ణన్, బి వెంకట్, వి.ఎస్. నిర్మల్, దిరేంద్ర ఝా, రామచంద్ర డోమ్, పల్లికల్, ఎస్ సాయి బాలాజీ, గుల్జార్ సింగ్ గోరియా, విక్రమ్ సింగ్, కమెల్ సింగ్, బీనా సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. దళిత సమాజాన్ని ఈ బడ్జెట్ పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. బడ్జెట్ కేటాయింపులు, వ్యయాలను పెంచాలని, షెడ్యూల్డ్ కులాల సబ్‌ప్లాన్ (ఎస్‌సీఎస్‌పీ)ని జాతీయ స్థాయిలో అమలు చేయాలన్నారు. ప్రయివేటు రంగంలో దళితులకు రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో బిల్లును ...13లో

ఎన్నటికీ తలవంచరు: సునీతా కేజ్రీవాల్

ఢిల్లీ : ఢిల్లీలో అభివృద్ధి కార్యక్రమాలు చేసినందువల్లనే తన భర్త జైలు పాలయ్యారని..అయినా వాళ్ల ముందు ఎన్నటికీ తలవంచరని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సతీమణి సునీతా కేజ్రీవాల్ ఆరోపించారు. త్వరలో శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో హర్యానాలోని సోహ్నాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె కేంద్రంలోని బీజేపీపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

కథ సుఖాంతం

చిన్నారి కిడ్నాప్ కేసును ఛేదించిన అబిడ్స్ పోలీసులు

- పదేండ్ల లోపు అమ్మాయిలే అతని టార్గెట్
- రంగారెడ్డి జిల్లా ఇముల్ నర్వలో నిందితుడి అరెస్టు : సెంట్రల్ జోన్ డీసీపీ ఆకాంక్ష్ యాదవ్



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

హైదరాబాద్‌లోని అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం కలకలం రేపిన చిన్నారి కిడ్నాప్ కేసును స్థానిక పోలీసులు ఛేధించారు. కిడ్నాప్‌కు గురైన బాలిక రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం ఇమ్ముల్ గ్రామంలో ప్రత్యక్షమైంది. కిడ్నాపర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని అబిడ్స్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. దీనికి సంబంధించిన వివరాలను ఆదివారం సెంట్రల్ డీసీపీ ఆకాంక్ష్ యాదవ్ మీడియాకు వెల్లడించారు. బేగంబజార్ ఛత్రి ప్రాంతానికి చెందిన ప్రియాంక అనే మహిళ తన సోదరుని కుమార్తె ప్రగతి(6) తో కలిసి శనివారం సాయంత్రం తన తల్లి ఉంటున్న గాంధీభవన్ దగ్గరలోని కట్టెల మండికి వచ్చింది. చిన్నారి బాలిక, ప్రియాంక సోదరి కుమారుడు వృతిక్‌తో(4)తో కలిసి ఇంటి సమీపంలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద ఆడుకోడానికి వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత హృతిక్ ఒక్కడే ఇంటికి వచ్చాడు. ప్రగతి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుప్రక్కల ప్రాంతాల్లో వెతికారు. అయినా బాలిక కనిపించలేదు. దాంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు.. అబిడ్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిడ్నాప్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు.. బాలిక ఆడుకున్న ప్రాంతంలో ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. అందులో బాలిక కిడ్నాప్‌కు గురైన దృశ్యాలు రికార్డయ్యాయి. వాటి ఆధారంగా పోలీసులు 6 బృందాలుగా ఏర్పడి.. బాలిక కోసం గాలింపుచర్యలు చేపట్టారు.

బీహార్‌కు చెందిన మహమ్మద్ బిలాల్ అన్సారి(32) రోజు కూలీగా పనిచేస్తున్నారు. కాగా, అగంతకుడు చాక్‌లేట్ ఇస్తామని చెప్పి.. బాలికను ఆటోలో ఎక్కించుకొని అఫ్జల్‌గంజ్ వరకు వెళ్లాడు. అక్కడ నుంచి ఆర్టీసి బస్సులో జేపీ దర్గా, అక్కడి నుంచి కొత్తూరు మండలం ఇమ్ముల్ నారా గ్రామానికి తీసుకెళ్లాడు. అనంతరం బాలిక తండ్రికి ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేశాడు. కాగా, అక్కడ వారిని చూసిన స్థానిక యువకుడు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించాడు. అప్రమత్తమైన ఆబిడ్స్ పోలీసులు.. కొత్తూరు పోలీసుల సహకారంతో ఆదివారం ఉదయం నిందితుడిని అరెస్టు చేసి, అబిడ్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం బాలికను వైద్య పరీక్షల నిమిత్తం భరోసా సెంటర్‌కు పంపించారు. కాగా, నిందితుడిపై మరో 3 కిడ్నాప్ కేసులు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. గత నెల 17వ తేదీన కొత్తూరులో ఓ బాలికను కిడ్నాప్ చేసి తప్పించుకొని తిరుగుతున్నట్టు పోలీసులు తెలిపారు. కేసును ఛేధించిన అబిడ్స్ ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్ రెడ్డి, డీఐ నరసింహ, ఏడుకొండలు, ఎస్‌ఐలు గౌరేందర్, సుధాకర్, సుమన్‌ను సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్‌ను డీసీపీ అభినందించారు.

పగలూ, రాత్రి తేడా లేకుండా..సహాయక చర్యలు

కేరళలో నిర్విరామంగా 1000 మంది పైగా అధికారుల సేవలు



తిరువనంతపురం : వాయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడిన ప్రాంతం వద్ద పగలు, రాత్రి తేడా లేకుండా 1000 మంది పైగా ప్రభుత్వ ఉద్యోగులు సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి పినరయి విజయన్ కార్యాలయం ఆదివారం వెల్లడించింది. 24 గంటలూ కార్యక్రమాలను పర్యవేక్షించడం కోసం కల్పేట్ట వద్ద సివిల్ స్టేషన్, చూర్‌మల వద్ద తాత్కాలిక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ప్రభుత్వ సిబ్బందిని 15 బృందాల కింద విభజించి గాలింపు, సహాయక చర్యలను సమన్వయం చేస్తున్నారు.

అలాగే సహాయక సామాగ్రి సేకరణ, పంపిణీని నిర్వహిస్తున్నారు. కౌన్సిలింగ్, పునరావాస కేంద్రాలు, సాంకేతిక బృందాల నిర్వహణ, చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితి, బాధితుల, ఇంకా ఆచూకీ తెలియని వారి సమచారం, వ్యర్థాల తొలగింపు, డేటా నిర్వహణ వంటి ప్రక్రియలు నిర్వహిస్తున్నారు. అలాగే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బృందాలు వెలికితీసిన మృతదేహాలకు సంబంధించిన విషయాలను నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. అంటే మృతదేహాల గుర్తింపు, కుటుంబ సభ్యులకు అప్పగించడం, క్లెయిమ్ చేయని మృతదేహాలను దహనం చేయడం, శవపరీక్షలకు సంబంధించిన విషయాలను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది. విపత్తు నిర్వహణ, రెస్క్యూ కార్యకలాపాలను నిర్వహించే ప్రభుత్వ విభాగాలు రాష్ట్ర ప్రభుత్వానికి రోజువారీ నివేదికలను అందచేస్తున్నట్లు కార్యాలయం తెలిపింది.

కొనసాగుతున్న సహాయక చర్యలు

కొండ చరియలు విరిగిపడిన ప్రాంతాల్లో సహాయక చర్యలు ఆరో రోజు అయిన ఆదివారం కూడా కొనసాగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహాయక బలగాలతో పాటు 1700 మంది రిజిస్టర్డ్ వలంటీర్లు 188 గ్రూపులుగా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగతిస్తున్నారు. పరంపర, నిలంబూర్‌లో మరో రెండు మృతదేహాలను సహాయక సిబ్బంది వెలికి తీశారు. నిలంబూరులో ఏడు శరీర భాగాలు, సూచిపరలో ఒక శరీర భాగం లభించాయి. మెప్పాడి వద్ద గుర్తు తెలియని 8 మంది



మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. ఇప్పటి వరకు లభించిన శరీర భాగాలను, మృతదేహాలను గుర్తించేందుకు డిఎన్ఏ పరీక్షల కోసం రక్తనమూనాల సేకరిస్తున్నారు. వయనాడ్ జిల్లాలో 77 సహాయ శిబిరాల్లో ప్రస్తుతం 8246 మంది ఉన్నారు. కాగా కొండచరియులు విరిగిపడిన ప్రమాదంలో 357 మంది చనిపోయివుంటారని అనధికారిక అంచనా. అయితే ఆదివారం నాటికి 219 మంది మరణించినట్లు అధికారికంగా నిర్ధారణ అయ్యింది. 135 మృతదేహాలను వారి బంధువులకు అందించారు. 122 శరీర భాగాలును గుర్తించాల్సివుంది.

ట్రక్ డ్రైవర్ అర్జున్ కుటుంబానికి విజయన్ పరామర్శ

కర్నాటకలోని ఉత్తర కన్నడ జిల్లాలో షిరూర్‌కు సమీపంలో కొండచరియలు విరిగిపడిన ప్రమాదంలో గల్లంతైన ట్రక్ డ్రైవర్ అర్జున్ కోసం గాలింపు చర్యలు చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆదివారం హామీ ఇచ్చారు. కోజికోడ్‌లోని కన్నడిక్కల్‌లో అర్జున్ కుటుంబాన్ని ముఖ్యమంత్రి విజయన్ పరామర్శించారు. ప్రస్తుతం



వయనాడ్‌లో ఆపదలో ఉన్న బాధిత కుటుంబాలకు ఇస్తున్న ప్రాధాన్యతనే ఈ కుటుంబానికి ఇస్తామని తెలిపారు. సహాయక చర్యలు వేగంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని విజయన్ హామీ ఇచ్చినట్లు అర్జున్ సోదరి అంజూ విలేకరులకు తెలిపారు. గత జులై 16న షిరూర్‌కు సమీపంలో కొండచరియలు విరిగిపడ్డంతో ట్రక్ డ్రైవర్ అర్జున్ ట్రక్‌తో సహా గంగావళి నదిలో గల్లంతైన సంగతి విదితమే.

ముస్లిం రిజర్వేషన్లకు 30 ఏండ్లు

- 25న పెద్ద ఎత్తున వేడుకలు : డీసీసీ అధ్యక్షులు మహమూద్ వలీ ఉల్లా సమీర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన ముస్లిం రిజర్వేషన్లకు 30 ఏండ్లు గడిచిన సందర్భంగా ఈ నెల 25న రాష్ట్రంలో భారీ ఎత్తున వేడుకలను నిర్వహించనున్నట్టు హైదరాబాద్ డీసీసీ అధ్యక్షులు మహమూద్ వలీ ఉల్లా సమీర్ వెల్లడించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఇతర రాష్ట్రా లకు చెందిన కాంగ్రెస్ నాయకులు, ముస్లిం పెద్దలు పాల్గొం టారని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అప్పటి ముఖ్య మంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి జీవో నెంబర్ 30 తెచ్చారనీ, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జీవోనెంబర్ 33 ద్వారా ఆనాటి ప్రభు త్వాలు రిజర్వేషన్లను అమలు చేయడం ద్వారా కొన్ని లక్షల మంది పేద ముస్లింలకు లబ్ది చేకూరిందని వివరించారు.

బీ అలర్ట్

దేశంలో పెరుగుతున్న డెంగ్యూ కేసులు

- రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని కోరిన కేంద్రం



న్యూఢిల్లీ : దేశంలో విపరీతంగా పెరుగుతున్న డెంగ్యూ కేసులు తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ మేరకు అప్రమత్తంగా ఉండాలంటూ కేంద్రం రాష్ట్రాలను కోరింది. ముఖ్యంగా, కర్నాటక, కేరళ, తమిళనాడులో డెంగ్యూ కేసులు భారీగా పెరుగుతు న్నందున కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఉన్నత స్థాయి అంతర్-మంత్రిత్వ సమీక్ష సమావేశాన్ని నిర్వహించింది. డెంగ్యూ వ్యాప్తిని నిరోధించటానికి రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని కోరింది. డెంగ్యూ కేసులు అత్యధికంగా నమోదవుతున్న తొమ్మిది రాష్ట్రాలు, 18 మునిసిపాలిటీలతో సమావేశం జరిగింది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే భారత్‌లో డెంగ్యూ కేసులు ఈ సంవత్సరం 50 శాతం పెరిగాయి. ఢిల్లీ, కర్నాటక, తమిళనాడు, తెలంగాణ లతో సహా తొమ్మిది అధిక ప్రభావిత రాష్ట్రాల్లో డెంగ్యూ పరిస్థితి, సంసిద్ధత స్థితిపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశానికి అధ్యక్షత వహించిన కేంద్ర ఆరోగ్య కార్యదర్శి అపూర్వ చంద్ర హాట్ స్పాట్‌లను గుర్తించాలనీ, వెక్టర్ నిఘాను పెంచాలనీ, నివారణ చర్యలు చేపట్టడం కోసం డెంగ్యూ కేసుల జియోట్యాగింగ్, ఆస్పత్రి సంసిద్ధతను నిర్ధారించటం వంటి సూచనలు చేశారు.

హైబ్రిడ్ మోడ్‌పై సమావేశానికి హాజరైన ఇతర రాష్ట్రాల అధికారులు గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్, యూపీ, పశ్చిమ బెంగాల్‌ల నుంచి ఉన్నారు. అలాగే, అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, హైదరాబాద్, ముంబయితో సహా 18 మున్సిపల్ కార్పొరేషన్లు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నాయి. గడచిన నాలుగేండ్లలో కేసులు ఏటా పెరుగుతున్నాయని అపూర్వ చంద్ర ఉద్ఘాటించారు. 2022లో మొత్తం 2.33 లక్షల కేసులు, 303 మరణాలు నమోదయ్యాయి. 2023లో దేశంలో మొత్తం 2.89 లక్షల కేసులు, 485 డెంగ్యూ మరణాలు రిజిస్టరయ్యాయి.

కొన్ని సంవత్సరాలుగా పట్టణ ప్రాంతాలు మొత్తం కేసులలో 55-58 శాతం వాటా కలిగి ఉన్నాయి. అయితే, 2023లో ఇది దాదాపు 68 శాతానికి పెరిగింది. గత నాలుగు సంవత్సరాలుగా కేసుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, డెంగ్యూ మరణాల రేటు 1996లో 3.3 శాతం నుంచి 2023లో 0.17 శాతానికి తగ్గిందని కేంద్ర ఆరోగ్య కార్యదర్శి తెలిపారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం

అడ్డూ అదుపూ లేని కోచింగ్ కేంద్రాల వ్యాపారం

- తప్పుడు ప్రకటలతో యువతకు గాలం
- కుప్పకూలుతున్న ప్రభుత్వ విద్యావ్యవస్థ
- చైనా నుంచి గుణపాఠాలు నేర్వరా?



మోడీ ప్రభుత్వం ఉద్యోగాలివ్వకుండా.. నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటమాడుతోంది. ఉన్న ఖాళీలను భర్తీ చేయకపోవటంతో... అప్పోసప్పో చేసి సివిల్స్‌కు ప్రిపేర్ అవుదామని నిరుద్యోగ యువత కలలు కంటోంది. కేంద్రంలోని బీజేపీ సర్కార్ నిర్లక్ష్యం.. ఖజానా నింపుకోవటమే పరమావధిగా వ్యవహరిస్తుండటంతో.. కోచింగ్ కేంద్రాలు కుప్పలు తెప్పలుగా వెలుస్తున్నాయి. తప్పుడు ప్రకటనలతో గాలం వేస్తున్నా.. ప్రభుత్వాలు పట్టించుకోవటంలేదు. మరోవైపు ప్రభుత్వ విద్యావ్యవస్థ కుప్పకూలుతుంటే.. ప్రయివేట్ విద్యావ్యవస్థ వేళ్లూనుకునేలా సహకరిస్తోంది. భారత్ ఎందుకని చైనా నుంచి గుణపాఠాలు నేర్చుకోదని పలువురు విద్యావేత్తలు, సామాజిక విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.

న్యూఢిల్లీ : పశ్చిమ ఢిల్లీలోని రావూస్ ఐఏఎస్ అకాడమీ బేస్‌మెంట్‌లో ముగ్గురు ఉద్యోగార్థులు వరద నీటిలో చిక్కుకొని ప్రాణాలు కోల్పోయిన ఉదంతం అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది. దుర్ఘటన జరిగిన ఓల్డ్ రాజీందర్ నగర్ ప్రాంతంలో యూపీఎస్సీ పరీక్షలకు శిక్షణ ఇచ్చే అనేక సంస్థలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. షరా మామూలుగానే....ఈ దుర్ఘటనపై విచారణను ఢిల్లీ హైకోర్టు సీబీఐకి అప్పగించింది. బేస్‌మెంట్‌లో కోచింగ్ కేంద్రాలు నడుపుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న అనేక శిక్షణా సంస్థలను ఢిల్లీ ప్రభుత్వం మూసేసింది. విద్యా వ్యాపారాన్ని నియంత్రించేందుకు ఓ చట్టాన్ని తీసుకొస్తానని ప్రకటించింది. కొందరు యజమానులు, సీనియర్ మేనేజ్‌మెంట్ సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. వరద నీరు ప్రవహిస్తున్న వీధిలో వాహనాన్ని నడిపి, ఆ నీరు కోచింగ్ కేంద్రం బేస్‌మెంట్‌లో చేరడానికి కారణమైన డ్రైవర్, యజమానిని కూడా అరెస్ట్ చేశారు.

కొన్ని కోచింగ్ కేంద్రాల యజమానులు, సీనియర్ ఉపాధ్యాయులు ఎంపిక చేసుకున్న మీడియా సంస్థల ముందుకు వచ్చి మొసలి కన్నీరు కార్చారు. ఆ మీడియా సంస్థలకు, కోచింగ్ కేంద్రాలకు మధ్య ఆర్థిక, వ్యాపార సంబంధాలు ఉన్న విషయం బహిరంగ రహస్యమే. వాటి కారణంగా అవి పరస్పరం ప్రయోజనం పొందుతున్నాయి. అందుకేనేమో ఆ సమావేశంలో పాత్రికేయులు కొన్ని కీలకమైన ప్రశ్నలు సంధించలేకపోయారు. ఉద్యోగార్థుల నుంచి ఎంత వసూలు చేస్తారు? మీరు రూపొందించే రీల్స్ ద్వారా ఇన్‌స్టాగ్రామ్‌లో ఎంత పేరు గడిస్తున్నారు? ఇలాంటి సురక్షితం కాని, అపరిశుభ్రత తాండవిస్తున్న ప్రదేశంలో ఇప్పటికీ తరగతులు ఎలా నిర్వహిస్తున్నారు? వంటి ప్రశ్నలు ఎన్నో ఉత్పన్నమవుతున్నా పాత్రికేయుల నోటి నుంచి ఒక్కటి కూడా రాలేదు.

ఈ కేంద్రాల్లో శిక్షణ పొందిన వారిలో ఫెయిల్యూర్ రేటు 99.8 శాతం ఉంటోంది. అయినప్పటికీ మిమ్మల్ని విజయ తీరాలకు చేరుస్తామని విద్యార్థులను ప్రలోభ పెడతారు. వారి వద్ద నుంచి పెద్ద మొత్తంలో డబ్బు గుంజుతారు. కానీ అందులో స్వల్ప మొత్తాన్ని కూడా మౌలిక సదుపాయాల కల్పనకు, రక్షణ చర్యలకు ఖర్చు చేయరు. ఇది మన వ్యవస్థలో ఉన్న పెద్ద లోపం. విద్యను వ్యాపారంగా మార్చి డబ్బులు దండుకుంటారు. యూనివర్సిటీలు, కళాశాలలు, పాఠశాలలు నడిపినా ఇంత డబ్బు రాదు. యువతకు విద్యను అందించి పట్టభద్రులను చేయడం కంటే ఉద్యోగాలు పొందేందుకు వారికి కోచింగ్ ఇవ్వడం ద్వారానే కోట్లాది రూపాయలు ఆర్జించవచ్చు. ఇదే నేటి మన విద్యా వ్యవస్థ దుస్థితి.

పెరుగుతున్న జీఎస్టీ వసూళ్లు

కోచింగ్ వ్యాపారం ఎంత పెద్దదో, అది ఎంత వేగవంతంగా వృద్ధి చెందుతోందో తెలుసుకోవాలంటే ఆ కేంద్రం విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న జీఎస్టీని పరిశీలిస్తే సరిపోతుంది. 2019-20లో వసూలు చేసిన 18 శాతం జీఎస్టీ మొత్తం రూ.2,240 కోట్లు. ఐదేండ్ల తర్వాత అది ఇప్పటికే 150 శాతం పెరిగి రూ.5,517 కోట్లకు చేరింది. 2029 నాటికి జీఎస్టీ వసూళ్లు రూ.15,000 కోట్లకు చేరతాయని అంచనా.

స్టార్‌డమ్‌తో వ్యాపారం

కోచింగ్ వ్యాపారం ఎంత శక్తివంతమైనదో తెలుసుకోవాలంటే దేశంలోని బడా వార్తా పత్రికల మొదటి పేజీలను చూసినా చాలు. వ్యాపార ప్రకటనల కోసం కోచింగ్ కేంద్రాలు భారీగా నిధులు కేటాయిస్తుంటాయి. పోనీ వాటిలో విద్యార్థుల విజయ గాథలు ఉంటాయా అంటే అదీ లేదు. తమ కేంద్రంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల అనుభవం, గొప్పతనాన్ని కీర్తిస్తుంటాయి. ప్రతి అధ్యాపకుడిని ఓ పెద్ద స్టార్‌గా చిత్రీకరిస్తారు. ఆయన పేరు తర్వాత సార్ అని పేర్కొనడం మరచిపోరు. మహిళా అధ్యాపకురాలైతే (అరుదుగానే ఉంటారు) పేరు చివర మేడమ్ అని తగిలిస్తారు. సినీ పరిశ్రమను మినహాయిస్తే మన దేశంలో వ్యక్తుల బ్రాండ్ ఇమేజ్‌ని పెంచేది ఈ కోచింగ్ వ్యాపారంలోనే. ఎందుకంటే ఈ వ్యాపారం విజయవంతం కావాలంటే కోచింగ్ కేంద్రాల వ్యవస్థాపకులు, అధ్యాపకులు విధిగా సూపర్ స్టార్‌డమ్‌ను పొంది ఉండాలి.

ప్రకటనల మాయాజాలం

ఇదంతా తెలిసి కూడా ఉద్యోగార్థులు కోచింగ్ కేంద్రాలకు ఎందుకు ఎగబడుతున్నారు? ఉద్యోగాలకు ఎంపికైన వారి ఫొటోలు పత్రికల మొదటి పేజీల్లో వచ్చే వ్యాపార ప్రకటనల్లో దర్శనమిస్తుంటాయి. ఫొటోలు వేయడానికి అంగీకరించినందుకు కొందరు విద్యార్థులకు డబ్బు కూడా ముట్టజెబుతారు. ఇది ఓ రకంగా లంచం లాంటిదే. అంటే కెరీర్‌లో ఇది వారి మొట్టమొదటి సంపాదన అన్న మాట. వసూలైన జీఎస్టీని బట్టి చూస్తే కోచింగ్ కేంద్రాల వ్యాపారం రూ.30,650 కోట్లు దాటేసింది. ఒకవైపు ప్రభుత్వ విద్యా వ్యవస్థ కుప్పకూలుతుంటే మరోవైపు ప్రైవేటు విద్యా వ్యాపారం దినదినాభివృద్ధి చెందుతోంది.

చైనాలో ఏం చేశారు?

చైనా అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుంటే మనకు ఈ దుస్థితి వచ్చి ఉండేదే కాదు. 2021లో దేశాధ్యక్షుడు జిన్‌పింగ్ రాత్రికి రాత్రే దేశంలోని ట్యూషన్, కోచింగ్ వ్యవస్థను నామరూపాలు లేకుండా చేశారు. ఈ వ్యవస్థ కుటుంబాల ఆర్థిక పరిస్థితిని చిన్నాభిన్నం చేస్తోందని, అసమానతలు సృష్టిస్తోందని, కుటుంబాల సమయాన్ని వృథా చేస్తోందని, విద్యార్థుల స్వేచ్ఛను హరిస్తోందని చైనా ప్రభుత్వం భావించింది. మన యూపీఎస్సీతో సమానమైన పరీక్షలకు కోచింగ్ ఇస్తున్న కేంద్రాలన్నింటినీ మూసివేశారు. ఆ దేశంలో లాభాల కోసం ట్యూషన్ చెప్పడం నిషిద్ధం. ఐపీఓ లిస్టింగులు, షేర్ల అమ్మకాలు ఉండవు. ఆన్‌లైన్ లెర్నింగ్‌పై పరిమితులు విధించారు. విలీనాలు, సేకరణలు, విదేశీ భాగస్వామ్యాల ఊసే లేదు. చైనాకు చెందిన ఎడ్‌టెక్ కంపెనీలు స్టాక్ మార్కెట్‌లో ఒక్కసారిగా ట్రిలియన్ డాలర్లు నష్టపోయాయి. 2008లో సంభవించిన అంతర్జాతీయ ఆర్థిక కుదుపుల కారణంగా జరిగిన నష్టం కంటే ఇది అధికం. బిలియనీర్లు అయిన లారీ చెన్, మైకెల్ యూ, జాంగ్ బాంగ్‌క్సిన్‌లు తమ సంపదలో 50 నుండి 90 శాతం కోల్పోయారు. దీనంతటికీ ఎడ్‌టెక్‌యే కారణం.

మన దేశంలో కూడా సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఏదో ఒకటి చేయాల్సిన అవసరం ఉంది. కుప్పకూలిన విద్యా వ్యవస్థ స్థానంలో పుట్టుకొచ్చిన కోచింగ్, ట్యూషన్ తరహా వ్యవస్థ ద్వారా పెద్ద ఎత్తున లాభాలు దండుకుంటున్న సంస్థలు, వ్యక్తుల దూకుడుకు కళ్లెం వేయాల్సి ఉంది. అలాంటి వ్యవస్థను నామరూపాలు లేకుండా నిర్మూలిస్తేనే ప్రభుత్వ విద్యా వ్యవస్థ మళ్లీ గాడిన పడుతుంది.

కోచింగ్ సెంటర్ లిఫ్ట్‌లో ఇరుక్కుని..

యూపీ లక్నోలో 45 నిమిషాలసేపు ఉక్కిరిబిక్కిరైన విద్యార్థులు



లక్నో : ఢిల్లీ కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్‌లోకి వరద నీరు చేరి ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. దీంతో కోచింగ్ సెంటర్లలో భద్రతా ప్రమాణాలపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో.. ఓ ఐఏఎస్ కోచింగ్ సెంటర్ లిఫ్ట్‌లో 45 నిమిషాల పాటు విద్యార్థులు ఇరుక్కున్న ఘటన యూపీలోని లక్నోలో జరిగింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లక్నోలోని గోమతి నగర్‌లో ఉన్న ఓ ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌లో విద్యార్థులు లిఫ్ట్‌లో కిందకు దిగుతుండగా, అది ఒక్కసారిగా ఆగిపోయింది. ఎంతకూ లిఫ్ట్ తెరుచుకోకపోవడంతో వారు భయాందోళనకు గురయ్యారు. కోచింగ్ సెంటర్ యాజమాన్యానికి కాల్ చేసినా వారు స్పందించపోవడంతో శోభా సింగ్ అనే విద్యార్థిని తన భర్తకు ఫోన్ చేసి విషయం చెప్పారు. దీంతో అతడు వెంటనే కోచింగ్‌సెంటర్‌కు చేరుకొని వెంటనే లిఫ్ట్‌లోని సమస్యను పరిష్కరించాలని యాజమాన్యాన్ని కోరాడు. వారు స్పందించక పోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు.

ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు లిఫ్ట్ ఆపరేటర్ సహాయంతో లోపాన్ని సరిచేసి విద్యార్థులను కాపాడారు. లిఫ్ట్‌కు సంబంధించిన మాస్టర్ కీ సెక్యూరిటీ గార్డు వద్ద లేకపోవడంతో జాప్యం జరిగినట్టుగా యాజమాన్యం వెల్లడించింది. ఇలాంటి నిర్లక్ష్యాల వల్ల యువత ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నదన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

కాశ్మీర్‌లో కుండపోత

జాతీయ రహదారి మూసివేత



శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లోని గండెర్‌బాల్ జిల్లాలో కుండపోత వర్షాలు కురిసాయి. ఈ వర్షాల కారణంగా సంభవించిన భారీ వరదలకు ధ్వంసమైన శ్రీనగర్-లేహ్ జాతీయ రహదారి మూసివేస్తున్నట్లు అధికారులు ఆదివారం తెలిపారు. 'గండెర్‌బాల్ జిల్లాలో కచేర్వాన్ వద్ద రహదారి ధ్వంసమైన కారణంగా తదుపరి నోటీసు ఇచ్చే వరకూ శ్రీనగర్-లేహ్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిపివేస్తున్నాం' అని ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌కు చెందిన అధికారులు తెలిపారు. కుండపోతగా వర్షాల కారణంగానే రహదారి ధ్వంసమయిందని చెప్పారు. ఈ వర్షాలకు నివాసగృహాలతో సహ అనేక భవనాలు దెబ్బతిన్నాయని ఒక పోలీసు అధికారి తెలిపారు. అవసరమైన వారికి సహాయం అందించడం కోసం అధికారులు క్షేత్రస్థాయిలో సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కాగా, ఈ జాతీయ రహదారి మూసివేయడంతో లడఖ్ కేంద్రపాలిత ప్రాంతానికి, కాశ్మీర్ లోయకు మధ్య సంబంధాలు తెగిపోయాయి. అలాగే, అమర్‌నాథ్ యాత్ర కోసం ఏర్పాటు చేసిన బల్తాల్ బేస్ క్యాంప్ కూడా అందుబాటులో లేకుండా పోయింది.

మధ్యప్రదేశ్‌లో విషాదం

- గోడ కూలి తొమ్మిదిమంది చిన్నారులు మృతి
- గోడపక్కనే టెంట్ కింద మట్టితో శివలింగాలు చేసుకుంటుండగా ఘటన



సాగర్ : మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో ఆదివారం భారీ విషాదం చోటు చేసుకుంది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఒక పాత ఇంటి యొక్క గోడ కూలి తొమ్మిది మంది చిన్నారులు మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు. రాష్ట్రంలో శనివారం రేవా, నార్సింగ్‌పూర్ జిల్లాల్లో రెండు వేరువేరు ఘటనలో గోడ కూలి ఆరుగురు చిన్నారులు మరణించిన విషాదం మర్చిపోక ముందే ఒక రోజు తరువాత ఈ ప్రమాదం జరిగింది. రేహ్లి అసెంబ్లీ నియోజకవర్గంలోని సనోధ పోలీస్ స్టేషన్ పరిధిలో షాపూర్ గ్రామంలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు ఈ దారుణ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో మతపరమైన కార్యక్రమం జరుగుతోంది. ఈ సందర్భంగా గోడ పక్కనే వేసుకున్న టెంట్‌లో చిన్నారులు మట్టితో శివలింగాలు తయారు చేస్తుండగా ఈ ఘటన జరిగింది. మృతి చెందిన వారంతా 10 నుంచి 15 ఏళ్ల లోపు వారని పోలీసులు తెలిపారు. గాయపడిన ఇద్దరు స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. ఈ సంఘటన జరిగిన తరువాత పాత ఇంటిని బుల్డోజర్‌తో అధికారులు కూల్చివేశారు. ఈ ప్రమాదంపై విచారణ కొనసాగుతోం దని, ఘటనకు బాధ్యులైన వారిపై త్వరలో ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని స్థానిక సబ్- డివిజనల్ పోలీసు అధికారి ప్రకాశ్ మిశ్రా తెలిపారు.

కాగా, ఈ ఘటనపై ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాల ఒకొక్కరికి రూ.4 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే తీవ్రంగా స్పందించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఎక్స్‌లో పోస్టు చేశారు.

అయోధ్యలో సామూహిక లైంగికదాడిపై దుమారం

బాధితులకు రక్షణ కల్పించాలన్న ఎస్పీ అధినేత అఖిలేశ్

లక్నో : అయోధ్యలో సామూహిక లైంగికదాడి ఘటనపై రాజకీయం వేడెక్కింది. బాధితురాలికి రక్షణ కల్పించాలని ఎస్పీ అధ్యక్షులు అఖిలేశ్ యాదవ్ కోర్టుకు ఆదివారం విజ్ఞప్తి చేశారు. ఈ కేసు 'సున్నితత్వం' పరిగణనలోకి తీసుకుని రక్షణ కల్పించాలని, ఈ కేసును రాజకీయం చేయడానికి కొంతమంది వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని వారిని విజయవంతం కానివ్వకూడదని అఖిలేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో ట్వీట్ చేశారు. అలాగే, బాధితురాలికి ప్రభుత్వం ఉత్తమ వైద్య సహాయం అందించాలని, బాలిక జీవితాన్ని రక్షించడం ప్రభుత్వ బాధ్యత అని కూడా అఖిలేశ్ పేర్కొన్నారు.

ఏం జరిగింది..?

అయోధ్య జిల్లాలోని భదర్సా నగర్‌లో మైనర్ బాలికపై మోయిద్ ఖాన్, రాజుఖాన్ అనే ఇద్దరు వ్యక్తులు లైంగికదాడికి పాల్పడంతో ఆమె గర్భం దాల్చింది. ఇద్దర్ని గత నెలలో పోలీసులు అరెస్టు చేశారు. అయితే ఈ కేసులో నిందితులు ఇద్దరికి డీఎన్ఏ పరీక్ష చేయాలని అఖిలేశ్ శనివారం డిమాండ్ చేయడంతో వివాదం రేగుతోంది. ఇలాంటి కేసుల్లో ఎస్పీ పాలనలో ఎంతమంది నిందితులకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించారని మాజీ సీఎం అఖిలేశ్‌ను బీఎస్పీ అధినేత్రి మయావతి ప్రశ్నించారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

- విద్య ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణకు కేంద్రం ఆజ్యం : రైతు నాయకులు, ఎంపీ అమ్రారామ్
- అట్టహాసంగా ఎస్టీఎఫ్ఐ కేంద్ర కార్యాలయ ప్రారంభోత్సవం



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పార్లమెంటు సభ్యులు, ప్రముఖ రైతు నాయకులు అమ్రారామ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఢిల్లీ శివారు ఫరీదాబాద్‌లో స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ) కేంద్ర కార్యాలయం 'టీచర్స్ భవన్'ను ప్రారంభించారు. అనంతరం ఎస్టీఎఫ్ఐ అధ్యక్షులు హరిక్రిష్ణన్ అధ్యక్షతన నిర్వహించిన విద్యా సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్టీఎఫ్ఐ ఏర్పడి 25 ఏండ్లైన సందర్భంగా రజతోత్సవ వేళ నూతన భవనం ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈ భవనం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టే పోరాటాలకు కేంద్రంగా మారాలన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేండ్లలో మోడీ నినాదం "సబ్ కా వికాస్" కేవలం దేశంలోని ఇద్దరి వికాసానికి మాత్రమే దోహదపడిందని ఎద్దేవా చేశారు .కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేయడం తప్ప, రైతులు, కార్మికులు, మధ్యతరగతి ఉద్యోగులు, మహిళలు, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కాదన్నారు. ఉద్యోగులకు ఇబ్బందికరంగా మారిన సీపీఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేందుకు పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్ఈపీ-2020 పేరుతో విద్యా విధానాన్ని పూర్తిగా కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే ప్రయత్నం జరుగుతున్నదన్నారు. దీనిని ప్రతిఘటించేందుకు ఎస్టీఎఫ్ఐ దేశవ్యాప్త ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు.

చాలా రాష్ట్రాల్లో వేలాది పాఠశాలలు మూతపడుతున్నాయని గుర్తు చేశారు. రెగ్యులర్ నియామకాలు తగ్గించి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమిస్తూ, వారికి కనీస వేతనాలు ఇవ్వటం లేదని దుయ్యబట్టారు.

రాజ్యాంగం నిర్దేశించిన స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, లౌకిక విలువలు, సామాజిక న్యాయం గురించి విద్యార్థులకు బోధించాలన్నారు. ఉపాధ్యాయులు గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, వ్యవసాయ కార్మికులతో సత్సంబంధాలు కలిగి ఉండాలని, తద్వారా ప్రభుత్వ పాఠశాలల రక్షణ కోసం ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ప్రముఖ విద్యా వేత్త, జాయింట్ ఫోరం ఫర్ మూవ్‌మెంట్ ఆన్ ఎడ్యుకేషన్ (జెఎఫ్ఎంఈ) సమన్వయకర్త డి.ఎస్. లోబియాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యకు దూరమవుతున్న 6.2 కోట్ల మంది బడిఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు ఎటువంటి కృషీ చేయడం లేదన్నారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నదని, ఈ దేశంలోని చాలా రాష్ట్రాల్లో సగం పాఠశాలల్లో సగటున 10 మంది విద్యార్థుల కంటే తక్కువ నమోదు ఉండడం ఇందుకు ఉదాహరణ అని వివరించారు.

జెఎఫ్ఎంఈ చైర్ పర్సన్ నందిత నారాయణన్ మాట్లాడుతూ విద్య ప్రభుత్వ రంగంలోనే ఉండాలన్నారు. దూరవిద్య, ఆన్‌లైన్ విద్యలు సరైన విద్యా విధానం కాదన్నారు. విద్యారంగంలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ వ్యవస్థలు పెరగడం మంచి పరిణామం కాదన్నారు. విద్యారంగం మొత్తాన్ని డిజిటలీకరణ చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంచుకునే ప్రయత్నాన్ని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆన్‌లైన్ పద్ధతిలో విద్యాబోధన కార్పొరేట్ పాఠశాలలకు ఉపయోగం తప్ప, గ్రామీణ ప్రాంతాల్లో బడుగు బలహీన వర్గాలకు అందని ద్రాక్షగా ఉందన్నారు. అటువంటి వారికి నాణ్యమైన విద్యను అందించేందుకు పోరాటం చేయాలన్నారు. ప్రత్యక్ష విద్యాబోధన విద్యార్థి, ఉపాధ్యాయ, అధ్యాపకుల మధ్య అవినాభావ సంబంధం బలోపేతానికి ఉపయోగపడుతుందన్నారు. ఉపాధ్యాయులతో స్ఫూర్తి పొంది వారి జీవితాన్ని తీర్చి దిద్దుకునే అవకాశాన్ని ఆన్‌లైన్, దూర విద్య ద్వారా పొందలేరని వివరించారు.

విద్యా రంగ పునర్నిర్మాణం కోసం ఐక్య ఉద్యమాలు : మయూక్ బిశ్వాస్

ఎస్ఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి మయాంక్ బిశ్వాస్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 34 శాతం ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేవని, 44 శాతం పాఠశాలల్లో విద్యుదీకరణ జరగలేదని వివరించారు. విద్యకు జీడీపీలో ఆరు శాతం నిధులను కేటాయించడానికి ఉద్యమించాలన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశవ్యాప్తంగా చాలా రాష్ట్రాల్లో వేలాది పాఠశాలలు మూతపడ్డాయన్నారు. విద్యార్థులకు అక్షయపాత్ర ద్వారా అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతాలేమిగా ఉందన్నారు. కనీసం గుడ్డు కూడా పెట్టడం లేదని, దీని వల్ల సమతుల ఆహారం ఎలా అందుతుందని ప్రశ్నించారు. ఇటువంటి వారిని ప్రోత్సహించడం సరి కాదన్నారు. విద్యా రంగ పునర్నిర్మాణం కోసం ఐక్య ఉద్యమాలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.

జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రొఫెసర్ మౌషుమి బసు, ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్. పుణ్యవతి, కార్యదర్శి ప్రొఫెసర్ అర్చనా ప్రసాద్‌లు మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికగా కేంద్రం మూఢనమ్మకాలను విస్తృతంగా ప్రచారం చేస్తోందన్నారు. ఎన్ఈపీ- 2020 విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచే విధంగా లేదని విమర్శించారు. విద్యార్థుల శాస్త్రీయ దృక్పథాన్ని పెంచే విధంగా ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. లింగ సమానత్వం సాధించే పోరాటంలో, మహిళలు ముందుండాలన్నారు.

ఎస్టీఎఫ్ఐ నూతన భవన ప్రారంభోత్సవం, విద్యాసదస్సులో ఎస్టీఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సి.ఎన్. భారతి, తెలంగాణ ఉపాధ్యక్షులు చావా రవి, ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, అరుణకుమారి, కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్, రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజి శ్రీనివాసరావు, సహాధ్యక్షులు కె సురేష్ కుమార్, కుసుమ కుమారి, నాయకులు లక్ష్మీ రాజా, గోపీమూర్తి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ నుంచి కేంద్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్. దుర్గా భవాని, ఫెడరేషన్ జనరల్ కౌన్సిల్ సభ్యులు కె. జంగయ్య, వైద్య శాంతి కుమారి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో తాజా హింసాకాండలో 100 మంది మృతి

డజన్ల సంఖ్యలో క్షతగాత్రులు



ఢాకా : బంగ్లాదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కోటాపై తలెత్తిన నిరసనలు, ఆందోళనలు విస్తృత ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమంగా రూపుదాల్చాయి. ప్రధాని హసీనా ప్రభుత్వ గద్దె దిగాలని విద్యార్థి ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. తాజాగా తలెత్తిన హింసాకాండలో 100మందికి పైగా మరణించగా, డజన్ల సంఖ్యలో గాయపడ్డారు. ఇటీవలి వారాల్లో 11వేల మందికి పైగా అరెస్టు చేశారు. వేలాదిగా వున్న ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలు, గ్రెనేడ్లను ప్రయోగించారు. రాజధాని ఢాకా, ఉత్తర ప్రాంత జిల్లాల్లో ఆదివారం హింసాత్మక సంఘటనలు చోటు చేసుకున్నాయి. తూర్పు, పశ్చిమ, దక్షిణ ప్రాంతాల్లో కూడా ఇదే రకమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే సమాచార సంబంధాలపై నిషేధం అమల్లో వుంది. ఆదివారం సాయంత్రం నుంచి కర్ఫ్యూను కూడా విధించారు. నిరవధికంగా ఈ కర్ఫ్యూ అమల్లో వుంటుందని తెలిపారు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు సాధారణ శలవు దినాలుగా ప్రభుత్వం ప్రకటించింది. ప్రజా భద్రతకు హామీ కల్పించే నిమిత్తం ఈ చర్యలు తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా పరిస్థితులు చాలా సున్నితంగా, ప్రమాదకరంగా వున్నాయని మీడియా వార్తలు పేర్కొన్నాయి. ప్రభుత్వం గద్దె దిగేవరకు తాము ఆందోళనలు విరమించేది లేదని విద్యార్థులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం దేశంలో చోటు చేసుకుంటున్న పరిణామాలపై ప్రజలు తీవ్రంగా ఆందోళన చేస్తున్నారని, కొన్ని చోట్ల పాలక అవామీ లీగ్ పార్టీ మద్దతుదారులు, నిరసనకారుల మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయని మీడియా వార్తలు పేర్కొన్నాయి. సహాయ నిరాకరణ ఉద్యమానికి ఆందోళనకారులు పిలుపిచ్చారు. పన్నులు, బిల్లులేవీ చెల్లించవద్దని ప్రజలను కోరారు. ఆందోళనలు, హింస ఉధృతమవడంతో రిజర్వేషన్ కోటాను 5 శాతానికి తగ్గిస్తూ సుప్రీం కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.


జీవన తాత్త్విక నిధి జాలాది పాట

అది 1943 ప్రాంతం.. రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా దేశంలో ఊరూవాడ ఉద్యమిస్తున్న కాలం... విజయవాడ ప్రకాశం బ్యారేజ్ తీరంలో ఒక పదకొండేళ్ళ కుర్రాడు మాసిన బట్టలతో బాల భిక్షగాడిలా చిత్తుకాగితాలు ఏరుకుంటున్నట్లు నటిస్తూ, రహస్య సమాచారం సేకరించి అజ్ఞాత వాసంలోని స్వాతంత్ర్య సమరయోధులకు చేరవేసేవాడు.

వందేమాతరం అంటేనే ఒళ్ళంతా హూనం జేసి, మహిళలు, పసిపిల్లలని చూడకుండా బ్రిటీష్ ఆర్మీ సాగించే హింసాకాండను చూసిన ఆ కుర్రాడి కళ్ళు ప్రతీకారాగ్నితో ఎరుపెక్కాయి. అందుకే ఫుట్‌బాల్ జట్టులో చేరి బ్రిటీష్ సైనికులతో, వారి పిల్లలతో తలపడి ఆగ్రహంతో ఆటలాడారు. ఆటలో ఫుట్‌బాల్‌ను తన్నే నెపంతో తెల్ల సైనికుల గుండెలపై కసిదీరా కాలుతో తన్నేవారు. ఆ దెబ్బకు తెల్ల ఆటగాళ్ళు విలవిలలాడుతుంటే ఆ కుర్రాడు మాత్రం దేశాభిమానంతో మహానందభరితుడయ్యారు.

బ్రిటీష్ వారి ఆధిపత్యాన్ని నిరసిస్తూ టెలిఫోన్ తీగలు కత్తిరించి, వారి కార్యాలయాల్లో కీలక దస్త్రాలను దగ్ధం చేసినందుకు చిన్న వయస్సులోనే అతను జైలుశిక్ష అనుభవించారు. ఆ బాలదేశభక్తుడి పేరు జాలాది రాజారావు. ఉద్యమంలో కొరియర్ బాయ్ నుండి కాలక్రమంలో కల్చరల్ వారియర్‌గా ఎదిగిన జాలాది ప్రస్థానం ఆదర్శనీయం

తెలుగు సినిమా పాటకు జీవన తాత్త్వికను అద్దిన అమేయ గేయకవి జాలాది. విలక్షణమైన జానపద బాణీలతో, అపూర్వమైన పల్లె నుడికారంతో హృదయాన్ని కుదిపి వేసే సజీవస్ఫూర్తితో, ప్రభావ శీలమైన పాటలు రాసి, వెండి తెరపై నవీన సృజన కాంతిని ప్రసరించిన కవి ఆయన. గోరంత పదాలతో కొండంత భావాలను పండించే అసాధారణ కవన నైపుణ్యం జాలాదికి మాత్రమే తెలుసు. "సూరట్టుకు జారతాది సితుక్కు సితుక్కు వాన చినుకు" అంటూ తొలిపాటతోనే అఖిలాంధ్ర సినీ ప్రేక్షకుల మనసు గెలుచుకొని, తల పండిన చలన చిత్ర పండితులను ఆశ్చర్య చకితులను గావించారు జాలాది.



'కాలంతో రాజీపడు కవిత్వం కాదు నాది/ అక్షరాన్ని అస్త్రంగా సంధించే కలం నాది' అని ప్రకటించి, తుది శ్వాస విడిచే వరకు ఈ విధంగానే రచనలు చేసి తన మాటకు కట్టుబడిన పాటల బాటసారి జాలాది. **'పుణ్య భూమి నాదేశం నమో నమామి/ ధన్య భూమి నాదేశం సదా స్మరామి'** అని దేశం కోసం అసువులు బాసిన వీరుల త్యాగాలను అనురాగంతో గానం చేసినా, **'ఈ కాలం పది కాలాలు బ్రతకాలని/ ఆ బ్రతుకు లో నీవూ నేను మిగలాలని'** అని ప్రేమైక దృష్టితో ఆకాంక్షించినా, **'అభినవ శశిరేఖవో/ ప్రియతమా శుభలేఖవో'** అని భావగీతం రాసినా **'ఎన్నియల్లో ఎన్నియల్లో ఎందాకా'** అని జానపదుల రాగార్తిని పలికించినా స్వతంత్ర వ్యక్తీకరణతో జాలాది తెలుగు పాటకు జవజీవాలను సమకూర్చారు. సినీ వేమనలా జాలాది తన 'పాట వెలది'తో అబాల గోపాలాన్ని మంత్ర ముగ్ధులను చేశారు.

అనవరతమైన జీవనచైతన్యాన్ని పాటల్లో అద్భుతంగా పలికించిన జాలాది, 1932 ఆగష్టు 9 కృష్ణాజిల్లా గుడివాడ సమీపంలోని దొండపాడు గ్రామంలో అమృతమ్మ, ఇమ్మానియేల్ దంపతులకు జన్మించాడు. తండ్రి స్వాతంత్ర సమరయోధుడు. కృష్ణాజిల్లా తొలి శాసనమండలి సభ్యుడు. అంటరాని మాల కుటుంబంలో పుట్టడం కారణంగా సహజంగానే అనేక వివక్షలు ఆయనను చుట్టుముట్టాయి. తెల్లదొరల రాజకీయ ఆధిపత్యం, నల్లదొరల కులాధిపత్యం నడుమ జాలాది బాల్యం నలిగిపోయింది. పాఠశాలకి బయట ఇసుకలో అక్షరాలు దిద్దుకొని విద్య నేర్చుకున్నాడు. దొండపాడులో ప్రాథమికవిద్య, గుడివాడ బోర్డు హైస్కూల్లో యస్.యస్.యల్సీ పూర్తి చేశాడు. తొలుత కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడై, కొంతకాలం జిల్లా రాజకీయాలవైపు దృష్టి సారించి, అక్కడ ఇమడలేక శ్రీకాకుళం ప్రాంతంలో డ్రాయింగ్‌టీచర్‌గా ఉద్యోగం చేశాడు. అక్కడ పరిస్థితులను తట్టుకోలేక ఉద్యోగానికి రాజీనామా చేసి, మళ్ళీ స్వగ్రామం వచ్చాడు. ఆరోగ్యశాఖలో ఉద్యోగి అయిన భార్య అగ్నేషమ్మ, ఇతర మిత్రుల ప్రోత్సాహంతో సినిమా రచయితగా రాణించాలని మద్రాస్ మహా నగరానికి చేరుకొన్నాడు. మోదుకూరి జాన్సన్, పి.సి.రెడ్డి ల ఆదరణతో సినీరంగ ప్రవేశంచేసి మూడున్నర దశాబ్దాలపాటు పాటల రచయితగా ప్రజల నీరాజనాలు అందుకున్నాడు. రెండు వందల చిత్రాల్లో పదిహేను వందల పాటలు రాశాడు. సినీ రంగంలో స్థిరంగా నిలబడటానికి అవసరమైన లౌక్యం లేకపోవడం వల్ల, ఉన్నదున్నట్లు మాట్లాడే నైజంవల్ల, ఆత్మ గౌరవాన్ని చంపుకొని దర్శక, నిర్మాతల చుట్టూ విధేయంగా ప్రదక్షిణాలు చేసే వీరభక్తి బొత్తిగా లేకపోవడం కారణంగా జాలాది ఎన్నో అవకాశాలను జారవిడుచుకున్నాడు. "న రత్న మన్విష్యతి మృగ్యతే హి తత్" అని కాళిదాసు అన్నట్లు రత్నం ఎవరికోసం వెతకదు, రత్నాన్ని మనం వెతుక్కుంటాం అన్నట్లుగా జాలాది జీవించాడు.


ఎనిమిదో తరగతి నుండే జాలాది కవితలు, పాటలు రాస్తూ గురువుల ప్రశంసలందుకున్నాడు. సామాజిక దుర న్యాయాన్ని ప్రశ్నించిన వేమన పద్యాలు, నీతి చంద్రికలోని నైతికత, ఈ కథల్లోని పదప్రయోగ దక్షత చిన్న వయస్సులోనే జాలాదిని ఆకర్షించాయి. ప్రారంభదశలో నాటకాలు రాసి, స్వీయ దర్శకత్వంలో ప్రదర్శించిన జాలాది ఎన్నో బహుమతులు కైవసం చేసుకున్నాడు. సినిమా కవిగా తెరంగేట్రం చేయకముందే కవిగా, రచయితగా జాలాది పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నాడు. 1951 సంవత్సరం నుండి తెలుగు స్వతంత్ర, యువజన, తదితర పత్రికల్లో జాలాది కవితలు ప్రచురణమై, పాఠక జనాదరణ పొందాయి. త్రిపురనేని మధుసూదనరావు ప్రేరణతో 'మధు' 'రాజా,' 'జా.రా' వంటి కలం పేర్లతో జాలాది అనేక రచనలు చేశాడు.

"భూమి నా భామిని/ కాలం నా కాలి చెప్పు/ కాదంటే ఈ గమనమే తప్పు" అంటూ జాలాది నూనూగు మీసాల వయసులో ధిక్కార కవిత్వం రాశాడు. **'నేను ఆదిని/ నాడు జాబాలిని/ నేడు జాలాదినని'** అంటూ తాత్త్వికచైతన్యంతో చాటిచెప్పాడు

జాలాది తత్త్వ కవి. కథకు ఆత్మ లాంటి సినిమాను మలుపు తిప్పే పాట అవసరమైనప్పుడు 'జాలాదింటికి దారేది' అని దర్శక, నిర్మాతలు ఆయన కోసం వెతికిన సందర్భాలు లేకపోలేదు. జాలాది కలంనుండి జాలువారిన ఎన్నో పాటలు ఈనాటికీ జనం గుండె గొంతుల్లో మారుమోగుతూనే ఉన్నాయి. టాలీవుడ్ కీర్తి కిరీటంలో కలికి తురాయిలా భాసిల్లుతున్నాయి. ఆ పాటలు నెమరువేసుకుంటే ఈ ఉరుకుల పరుగుల తరుణంలో మనసుకు గొప్ప ఉపశమనం కలుగుతుంది.



డా॥ కోయి కోటేశ్వరరావు,
9440480274



'ఏతమేసి తొడినా ఏరు యెండదు/ పొగిలి పొగిలి ఏడ్చినా పొంత నిండదు'(ప్రాణం ఖరీదు), **'గుమ్మాలు తొమ్మిది గుండేమో చిన్నది/ ఏదారి వచ్చావురా/ జీవ! ఏ దారి పోయ్యావురా'** (కుంతీ పుత్రుడు) లాంటి ఎన్నో పాటలు తెలుగు తత్త్వ కవిత్వానికి కొత్త ఉత్తేజాన్ని అందించాయి. **'బండెల్లి పోతుందే చెల్లెల/ బతుకు బండెల్లి పోతుందే చెల్లెల'** అనే పాటలో బతుకుకు రైలు బండికి మధ్య మనోహరమైన భావ సామ్యాన్ని ప్రబోధించాడు. 'ఇదా ప్రపంచం' సినిమాలో రైలు బండిలో భిక్షగాళ్ళు పాడు కొనే ఈ పాట ప్రగాఢమైన జాలాది భావనాశక్తికి ప్రబల తార్కాణంగా నిలుస్తుంది. **'పదుగురితో పరుగెత్తే పయనము/ కడకు నలుగురితో నడిచెల్లే దూరము/ జెండాలు రెండేనే చెల్లెలా! అవి చావుపుట్టుకలంట చెల్లలా!/ సిగ్నలిచ్చే వాడు దేవుడు, బండి దిగెల్లి పోయోడు జీవుడు'** అంటూ జీవన ప్రస్థానానికి తిరుగులేని భాష్యం చెప్పాడు.

జాలాది పాటల్లోని పల్లవులు, చరణాలు క్లుప్తసుందరంగా, తాత్త్విక బంధురంగా ఉంటాయి. లోతైన ఆలోచనలను రేకెత్తిస్తాయి. దూది పింజల్లాంటి పదాలతో పసిడి కొండల్లాంటి భావాలను పండించడంలో జాలాది సిద్ధహస్తుడు. జాలాది కవనం, పరిమాణంలో విత్తనంలా కనిపించి ప్రభావంలో మహావృక్ష స్ఫూర్తిని కలిగిస్తుంది.

'poet is the food for tenderest stomachs. the poet is indeed the right papular philosopher' అని ఫిలిప్ సిడ్నీ అన్నట్లుగా జాలాది ఒక తత్త్వవేత్తలా ప్రజావళికి పసందైన పాటల విందు చేశాడు. **'చేతి చిటికెనేళ్లు కలసి కళ్యాణమై/ కాలి బొటిన వేళ్ళు కలసి నిర్యాణమై/ నాలుగు దిక్కుల ఉయ్యాల/ నలుగురు కలిసి మొయ్యాల/ కళ్ళుతెరుసుకుంటే ఉయ్యాల /కళ్ళు మూసుకుంటే మొయ్యాల'** (ఎర్రమందారం)

'నడక సాగితే రాదారి పడవలాగితే గోదారి'/ 'చేసేది పట్టణ వాసం మెసేది పల్లెల గ్రాసం'/ 'కూత నేర్చినోళ్ళ కులం కోకిలంటరా ఆకలేసి అరిచినోళ్ళు కాకులంటరా/ 'సూర్యుడు చేసిన పాపలన్నీశూద్రుడిగా పుడుతుంటే/ న్యాయం ధర్మం కర్మం ఒడిలో కర్ణుడిగా పడి చస్తుంటే'/ 'అందరూనడిసొచ్చే త్రోవ ఒక్కటే/ చీమునెత్తురులు పారే తూము ఒక్కటే'

జాలాది పాటల్లోని పల్లవులు, చరణాలు క్లుప్తసుందరంగా, తాత్త్విక బంధురంగా ఉంటాయి. లోతైన ఆలోచనలను రేకెత్తిస్తాయి. దూది పింజల్లాంటి పదాలతో పసిడి కొండల్లాంటి భావాలను పండించడంలో జాలాది సిద్ధహస్తుడు. జాలాది కవనం, పరిమాణంలో విత్తనంలా కనిపించి ప్రభావంలో మహావృక్ష స్ఫూర్తిని కలిగిస్తుంది.

ఈ విధమైన అనంత చింతనతో, పరివర్తనానుభూతితో జాలాది పాటలు ప్రతిక్షణం వెంటాడతాయి. మనోమాలిన్యాన్ని సంపూర్ణంగా శుద్ధిచేసి, మానవాళి ఎరుకను సమగ్రం చేస్తాయి. 'వాక్యం రసాత్మకం కావ్యం' అన్న మాటకు ఈ కవి పాటలు అక్షర దర్పణంగా నిలుస్తాయి.

లోకంలో చూసింది, తెలిసింది ఉన్నదున్నట్లుగా ధైర్యంగా రాయలేని బలహీనత కొంతమంది కవుల్లో కనిపిస్తుందని, వాస్తవాన్ని కప్పిపెట్టే సృజన నైజం ఏమాత్రం మంచిదికాదని జాలాది ఆరోపించాడు. 'కార్బన్ పేపర్ చేసే కనీస ధర్మం కవి చేయగలిగితే సమాజం ఏనాడో బాగుపడేది" ఆయన ఆవేదన చెందాడు. సినిమా పాటలతో పాటు జాలాది 'విశ్వమోహిని', 'కాకులమ్మ' వంటి దీర్ఘ కావ్యాలు రాశాడని చాలామందికి తెలియదు. ఈ రెండు కావ్యాలు చదివితే జాలాది కవితా ప్రావీణ్యం తెలుస్తుంది. జాలాది సాహిత్యంపై ఆయన కుమార్తె డాక్టర్ జాలాది విజయ రచించిన 'జాబాలి క్షేత్రంలో జాలాది అక్షరం' అనే పరిశోధనా గ్రంథం చదివితే ఈ కవి వ్యక్తిత్వం మరింత బాగా అర్థమవుతుంది. తన తండ్రి పంచిన స్థిరాస్తులకు ఆశపడ కుండా, ఆయన అందించిన విలువైన సిరా ఆస్తులను విజయ లోకానికి చాటి చెబుతుంది.

సమాజంలో స్త్రీ నిర్వహించే మహోన్నత పాత్రను, త్యాగనిరతిని, పితృస్వామ్య వ్యవస్థలో ఆమె ఎదుర్కొనే దుర్భర పరిస్థితులను జాలాది శక్తిమంతంగా పాటల్లో చిత్రించాడు. 'ప్రాణం ఖరీదు' చిత్రంలోని **'ఏతమేసి తోడినా ఏరు ఎండదు/ పొగిలి పొగిలి ఏడ్చినా పొంత నిండదు'** పాట ఇందుకు నిదర్శనం. ఈ పాటలో జాలాది పాడి ఆవుకు ఆడమనిషికి తులనాత్మకభాష్యం చెప్పిన తీరు అసాధారణం. **'కుడితి నీళ్ళు పోసినా అది పాలు కుడుపుతాది/ కడుపు కోత కోసినా అది మనిషికే జన్మనిత్తాది'** అన్న ఈ కవి సందేశం అమోఘం. **'బొడ్డు పేగు తెగిపడ్డ రోజు తలుసుకో/ గొడ్డు కాదు ఆడదనే గుణం తెలుసుకో'** అని జాలాది పురుషోన్మాదులకు హితవు చెప్పాడు . సీసాకి మూత ఉంటుంది కానీ మనిషికి మాత్రం నీతి లేదేమిటని ప్రశ్నించాడు. **'చీకటి కాటేస్తే లోకం రేతిరి అవుతుంది/ రేతిరి కాటేస్తే ఆడది చీకటి అవుతుంది'** అని దారుణమైన లైంగిక వివక్షను ఎత్తి చూపాడు

జానపదుల నిత్య వ్యవహారంలో అలవోకగా వ్యక్తమయ్యే కవితా విలువలతో, పలుకుబడులతో జాలాది తన పాటలకు పుటం పెట్టుకున్నాడు. రాయవలస, వీరఘట్టం వంటి ప్రాంతాల్లో ఉద్యోగం చేసే సందర్భంలో ఉత్తరాంధ్ర ప్రజల భాషా పరిమళాలను ఆస్వాదించాడు. సహజమైన గ్రామీణుల భాషాజ్ఞానాన్ని పరిశీలించాడు. ఏసీ భోగీల్లో ప్రయాణం చేసే అవకాశమున్నప్పటికీ పాసింజర్ రైల్లోనే ఆయన పరమ సంతోషంగా ప్రయాణం చేసేవాడు. ఆ కోలాహలంలో ఉట్టిపడే అసలుసిసలైన నుడికారాన్ని సమకూర్చుకొని పాటలు రాయడం వల్ల జాలాది పండితులకు, పామరులకూ అభిమాన పాత్రుడయ్యాడు. **'రేతిరంత నిదుర కాసి కలువ పూలు నవ్వినట్టు/ రేపు మాపు ఆకాశం ఆకు వక్క ఏసినట్టు/ పడమటేపు పడకేసి సూరిగాడు దొర్లి నట్టు/ తూరుపేపు తలుపు తీసి తొంగి చూసి నవ్వినట్టు'** ఇలాంటి జాలాది భావుకత ప్రాచీన కవుల వర్ణనలకు ఏమాత్రం తీసిపోదు. ఆ వర్ణనల కంటే భిన్నమైన దేశీయ శిల్ప సౌందర్యం ఈ కవి పాటల్లో దర్శనమిస్తుంది. **'తడిసి పోయానా రేతిరి ఆడి జిమ్మడిపోను/ కుదిపి చుట్టేశాడమ్మ గాలి సచ్చినోడు'** అంటూ శృంగారాన్ని కూడా ఈ కవి సూటిగా, సుతిమెత్తగా పల్లీయ కవితాశైలిలో తన పాటల్లో చిత్రించాడు. 'ఓలమ్మ తిరనాల గిలక వగలాడి ఒయ్యారి మొలక', 'ఆముదు ముళ్ళెయ్యరా నూరేళ్ళ పడకెయ్యరా', 'ఎన్నెల్లో ఇల్లెయ్యనా చుక్కల్లో పక్కెయ్యనా' లాంటి రమణీయ వర్ణనలు, 'గాలివానగాడు', 'రాతచేతగాని బెమ్మిగాడు' వంటి ప్రయోగాలు, కన్నీళ్ళ ఉగ్గు, కష్టాల బువ్వ లాటి రూపకాలు పాటల్లో ప్రయోగించటం జాలాదికే సాధ్యం. శతక కవుల నైతిక దృష్టి ఈ కవిలో స్పష్టంగా కనిపిస్తుంది. నిర్దిష్ట మాత్రాఛందోగతిలో, సహజ సిద్ధమైన ఆలంకారిక శైలిలో సాగే జాలాది పాట ఒక్కోసారి చంద్రనిప్పుల గండ్రగొడ్డలిలా గాండ్రిస్తుంది. మరొకమారు హృదయ కాలుష్యాన్ని ప్రక్షాళన చేసే తాత్త్విక ఔషధంలా ప్రభాసిస్తుంది. జాలాది సాహిత్యం విస్తృతంగా పాఠ్యపణాళికల్లో పొందుపరచాలి. ఒక ప్రభుత్వసంస్థకు ఆయన పేరుపెట్టాలి. సర్వకాలికమైన జాలాది రచనలను పునర్ముద్రించి అందరికీ అందుబాటులోకి తీసుకు వస్తే ఈ తరానికి ఆయన సాహిత్య సంస్కారం అర్థమవుతుంది. తెలుగు సినీ వినీలాకాశంలో జాలాది ఒక అరుంధతి నక్షత్రం.

(ఆగస్టు 9 జాలాది జయంతి సందర్భంగా)

◆◆

నడక జ్ఞాపకం

నిత్యచలన కవిత్వంతో కలిసి నడిస్తే ఏకంగా పుస్తకాల్లోకి ప్రచలన ప్రయాణమే
కావ్య రహస్యాలు వింటూ మైదానంలో విహరిస్తే ఆ నడకొక సారవంతమయ్యే సారస్వత యానం
సూర్యుని కంటే ముందే మసకలో గమనం అడుగు అడుగులోనూ జీవన సంవేదనల పాఠం
సర్ర సర్ర పోతుంటే మనసొక అల్కటి మేఘం
మహాకవితో నడిస్తే మనసంతా తంగేడు పూల కాంతి
మట్టి జీవితాలను చిత్రిక పట్టే మా సంభాషణం
నాగటి సాళ్లలో అదును మీద అక్షరాలు అలికినట్లు పద్య పాదాలకు సేంద్రియ ఎరువులు వేసినట్లు
ముచ్చట్లన్నీ పచ పచ్చగా ఎదిగే లేలేత లతలు ఒకానొక వేకువ వెలుగురేఖ విచ్చుకున్నప్పుడు
ఇంగ్లండ్ నుంచి వర్డ్స్ వర్త్ దిగ్గున దిగుతాడు గ్రౌండ్ నిండా డెఫడిల్స్ పూల పరిమళమై
పాద చారులందరికీ ప్రాణవాయువు పరుస్తాడు
మరొక ప్రాతఃకాల వేళ వేల్స్ నుంచి డిలాన్ థామస్ ఉరికొచ్చి అడుగుల్లో అడిగేస్తాడు
ప్రేమా ప్రకృతి హృదయ రహస్యాలు కుప్ప పోస్తాడు
ఆ తాత్విక భావాల్లోంచి మనసు తేలికై ఉల్లాసపడుతుంది
'రాజు మరణించె నొక తార రాలిపాయే కవియు మరణించె నొక తార గగనమెక్కె'
విశ్వ కవి జాషువా పద్యాలు విడమర్చి చెప్పిన్నాడు
ఆ రాగయుక్త రాగాలు రోజంతా గుండెల్లో నిలిచె
అక్కన్నే ఓ చెట్టు కొమ్మన గబ్బిలం కనిపించె మరొక ఎర్లీ మార్నింగ్ విలియం షేక్స్పియర్‌ను
వెంటపెట్టుకొని స్టాట్ ఫర్డ్ వీధుల గుండా తిరగాడుతాం
అద్భుతమైన హ్యామ్లెట్ నాటకం సజీవంగా పాలిటెక్నిక్ మైదానంలో కండ్లకు కడుతుంది
రోజుకోసారైనా వెంటాడే సినారే జ్ఞాపకాలు విశ్వంభరుడు గుర్తుకు రాకుండా నడక కుతి తీరదు
కవిత్వమూ వ్యక్తిత్వమూ కలె గలిసిన తలంపు స్ఫూర్తి పొందటం మహనీయుల అనుభవాల నుంచే
పిల్ల తెమ్మరలు పీలుస్తూ పచార్లు చేస్తుంటే శ్రీ శ్రీ కృష్ణశాస్త్రులు తాపతాపకూ మాతోనే
మాటా మాటా కలిపి పాదాల వేగం పెంచుతారు
జీవితం చుట్టూ జలగీతం అల్లుకున్న స్ఫూర్తి నేలను ఆకాశాన్ని ఆలంబన చేస్తున్న చూపు
ప్రతిరోజూ ఒక ఉత్తేజ తరంగ దినోత్సవం మనసునిండా ఆవరించిన కవిత్వ యాత్ర
రామంతపూర్‌లో నెలరోజుల విడిది విరామం విడువలేక తిరిగి ఊరికి చేరుకున్న
సూర్యోదయ సమయాలన్నీ సాహిత్య స్నాతకోత్తర పాఠాలే
కవిత్వం కల్పించిన సోపతికి గురు ప్రణామములు

- అన్నవరం దేవేందర్, 9440763479

ప్రొ॥ మాడభూషి శ్రీధర్‌కు జయశంకర్ స్ఫూర్తి పురస్కారం

తెలంగాణ రచయితల వేదిక ఆచార్య కొత్తపల్లి జయశంకర్ స్ఫూర్తి పురస్కారం ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్‌కు ఈ నెల 6 వ తేదీ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 6 గంటలకు అందజేస్తారు. జూకంటి జగన్నాథం, జయధీర్ తిరుమల రావు, గాజోజు నాగభూషణం గౌరవ అతిథులుగా హాజరవుతారు.

– బూర్ల వేంకటేశ్వర్లు, 9491598040

ఇంద్రగంటి శ్రీకాంతశర్మ సాహితీ పురస్కారం 2024

ఇంద్రగంటి శ్రీకాంతశర్మ సాహితీ పురస్కారం 2024 సంవత్సరానికి కవి అఫ్సర్‌కి ప్రకటించారు. ఈ నెల 14 వ తేదీ సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి సమావేశమందిరంలో ప్రదానోత్సవం జరుగుతుందని ఇంద్రగంటి జానకీబాల, శీలా సుభద్రాదేవి, మోహన్‌కృష్ణ ఇంద్రగంటి తెలిపారు.

మినీ నవలల పోటీ - 2024

పాఠశాల, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మినీ నవలల పోటీ - 2024 నిర్వహిస్తున్నారు. ఏదైనా సామాజిక, పర్యావరణ పరిరక్షణ శాస్త్రీయ, మానవీయ సంబంధాల అంశంతో 30 పేజీలకు తగ్గకుండా నవలలను సెప్టెంబర్ 30 లోపు పోస్ట్ లేదా కొరియర్ ద్వారా పంపాలి. చిరునామా : ఇంనెం. 11-10-694/5, ఖమ్మం 507001. వివరాలకు : 9494773969

స్త్రీ కేంద్రీకృత కవిత్వం 'ఆకురాలు కాలం'



- నస్రీన్ ఖాన్
@ writernasreen@gmail.com

"కవిత్వం రాయడం అంటే ఖడ్గంతో సహజీవనం చేయడం" అంటారు ప్రముఖ కవి శివారెడ్డి. మాట్లాడటాన్ని తప్పుగా ధృవీకరిస్తున్న చోట, మనుగడ నియంత్రణకు గురవుతున్న చోట, అక్షరంపై నిర్బంధాల ముళ్ళు స్వైర విహారం చేస్తున్న చోట కవిత్వం రాయడం అంటే ఖడ్గంతో సహజీవనం చేయడమే కదా. స్వేచ్ఛా కాముకులు, శాంతి ప్రబోధకులు కవులు అయినప్పుడు ఏటికి ఎదురీదటమే వారి పని. ఇది ఎప్పుడూ కొత్తకాదు. ప్రగతిశీలురైన కవులు అప్పుడూ ఉన్నారు, ఇప్పుడూ ఉన్నారు. తెలుగు కవయిత్రులు ఫెమినిజం గురించి ఉధృతంగా కవితలు రాస్తూ పురుషాధిపత్యాన్ని ప్రశ్నిస్తున్న 90వ దశకంలో, వారంతా ఖడ్గంతో సహజీవనం చేసిన వారే. అదే దశకంలో చివరినాటికి ఓ ముస్లిం యువతి తెలుగు కవితా ప్రపంచంలోకి దూసుకొచ్చింది. వస్తూ వస్తూ 'ఆకురాలు కాలం' కవితా వసంతాన్ని తీసుకొచ్చింది. అందుకే పాతికేళ్ళు దాటినా నిత్యనూతనంగా ఆకుపచ్చగా పరిఢవిల్లుతుంది ఆ కవిత్వం. ఎటువంటి హడావుడి లేకుండా నిబ్బరంగా, నింపాదిగా స్థిరంగా తను వినిపించాల్సింది వినిపించింది. ఇప్పటి ఆధునిక కవితా లోకంలోనూ నిత్యస్మరణకు గురవుతున్నది ఆమె గొంతుక. ఆ గొంతుక మరెవరో కాదు. కవయిత్రి, సామాజిక కార్యకర్త, హైకోర్టు న్యాయవాది మహెజబీన్ బేగ్.

మహెజబీన్ బేగ్ కవితా రంగంలో అడుగు పెట్టే నాటికి ఫెమినిజం ఉధృతస్థాయిలో ఉంది. నక్సలైట్ ఉద్యమం, ప్రభుత్వం వారిపై తీసుకుంటున్న చర్యల జుగల్బందీ అంతే తీవ్రస్థాయిలో ఉన్నాయి. అందుకు తగినట్లుగా అప్పటి కవుల నుంచి ప్రగతిశీల కవిత్వం ఉవ్వెత్తున ఎగసిపడుతోంది. అదే సమయంలో మహెజబీన్ వచ్చినప్పటికీ తనకంటూ ప్రత్యేక వ్యక్తీకరణను కనబరిచి కవిత్వంలో తనకుతాను ఒక బెంచ్ మార్క్ సెట్ చేసుకున్నారు. ఆమె ఒలికించిన కవిత్వం సైతం ఖడ్గంతో సహజీవనం చేయడంవంటిదే. మొన్నటికి మొన్న ప్రభుత్వం నుంచే పౌరసత్వ వేధింపులు ఎదుర్కొంటున్న ప్రజలకు మద్దతుగా "ప్రశ్న దేశద్రోహమైంది... ఏం చేయను..?" అంటూ ఓ కవిత సంధించారు.

'ఆకురాలు కాలం' అనే కవితాసంపుటి 1997లో వెలువడింది. విడుదలైన తరువాత అనేకమంది విమర్శకుల ప్రశంసలు అందుకుంది. కొద్దిరోజుల్లోనే కాపీలన్నీ హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. అయితే పుస్తకంగా రావడానికి ముందే ఆమె రాసిన కవితలు వివిధ పత్రికల్లో అచ్చవడంతో, పుస్తకంగా వచ్చేనాటికే ఆమె పాఠకులకు సుపరిచితమయ్యారు. సాహిత్యాభిమానులు ఈ పుస్తకం కాపీ కోసం పాతికేళ్ళుగా ఆరా తీస్తూనే ఉన్నారంటే సమాజంలో ఆమె కవిత్వానికి ఎంతటి ఆదరణ దక్కిందో అర్థం చేసుకోవచ్చు. ఎట్టకేలకు ఈ ఏడాది రెండో ముద్రణకు పూనుకున్నారు కవయిత్రి.

పుస్తకంలో మొత్తం ఇరవైఆరు కవితలున్నాయి. అన్నీ స్త్రీ కేంద్రీకృతంగా సాగిన కవితలే. తన జీవిత భాగస్వామి ఉద్యమంలో చురుకైన పాత్ర పోషిస్తున్నప్పుడు ఒక మహిళ భావోద్వేగాలు ఏ విధంగా ఉంటాయో అనేక పార్శ్వాలలో చూపించగలిగారు కవయిత్రి. అలాగే ఆమెలోని ఫెమినిస్టును పట్టి ఇచ్చే కవితలూ ఉన్నాయి. బాలకార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, వ్యభిచారం వంటి సామాజిక సమస్యలపైనా కవితలు ఉన్నాయి. ఈ కవితలు అన్నింటిలోనూ స్త్రీ సహజమైన గుణం ప్రేమే మూలం. సాటి మనిషిని మనిషిగా చూడటం, కష్టాల్లో ఉన్న వారికి చేయూతనీయడం, ఆధిపత్యాన్ని ప్రశ్నించడం, దాష్టీకంపై తిరుగుబాటు చేయడం వంటి అనేక కోణాలు ఈ కవితల్లో ప్రస్ఫుటమవుతున్నాయి.



"అందమైన అమ్మశరీరం మీద/ దగ్ధమైన యవ్వనాన్ని చూసినదాన్ని/ వెన్నెల ప్రవహించే ఆమె హృదయం మీద/ నాన్న చేసిన గాయాలు చూసినదాన్ని" అంటారు అజ్నబీ కవితలో. ఈ కవిత తండ్రితో సంభాషిస్తున్నట్లు మొదలు పెడతారు. **"నీ కథ నా కథ ఒక్కటే/ నీ తల్లి నా తల్లి కన్నీటి భాష్యం ఒక్కటే"** అంటూ ప్రారంభించి ఆ తండ్రీ కూతుళ్ళను వేరు చేస్తున్నది 'జెండర్' అంటూ పితృస్వామిక వ్యవస్థపై తన అస్త్రాన్ని గురిపెడతారు. ఇరవై ఎనిమిది సంవత్సరాల క్రితం ఈ కవిత రాసినప్పటికీ ఆమె కలలుగన్న సమానత్వం ఇప్పటికీ సంపూర్ణంగా రాలేదన్నది ఎంత నిజమో... కొంతలో కొంత మార్పు వచ్చిందన్నదీ అంతే నిజం. పురుషాధిపత్య సమాజం ఆడపిల్లను, మగపిల్లవాడిని సమానంగా పెంచగలిగి ఉంటే **"ఈరోజు నీ వృద్ధాప్యాన్ని/ భుజాల మీద మోసే దాన్ని కదా!"** అంటారు ఓ కవితలో.

బాలకార్మిక వ్యవస్థ గురించి ఆవేదన చెందుతూ ఆమె రాసిన కవిత 'చైల్డ్ లేబర్'. ఈ కవితను రాష్ట్ర విభజనకు ముందు పదోతరగతిలో పాఠ్యాంశంగా చేర్చింది ప్రభుత్వం. ఉద్యమ నేపథ్యంలో రాసిన కవిత 'ఆకురాలు కాలం'. ఇదే శీర్షికను పుస్తకానికి టైటిల్‌గా ఎంపిక చేసారు.

మెహందీ అనే ప్రాంతంలోని వ్యభిచార కూపంలో కూరుకుపోయిన మహిళల గురించిన కవిత ఒకటి ఉంది ఈ పుస్తకంలో. **"అక్కడ/ జీవితం గాయపరిచిన పక్షులన్నీ/ పేదరికం మూటగట్టుకుని వాల్తాయి/ బాధలు గాధలు సమానత్వం పాటిస్తాయి"** అంటూ సాగే ఈ కవితలో హైదరాబాద్‌లో ఒకప్పుడు సాగిన వ్యభిచారవృత్తి గురించి, అందులో కూరుకుపోయిన ఆడవారి గురించి ఆవేదన చెందుతూ లిఖించిన కావ్యమిది.

రోజు రోజుకూ పెచ్చుమీరుతున్న సామాజిక సమస్యల్లో కులం, మతం ఒకటి. ఒకప్పుడు 'అంటరానితనం అమానుషం' అంటూ ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు ప్రభుత్వాలు తీవ్రంగా కృషి చేసేవి. పిల్లలు చదువుకునే పాఠ్య పుస్తకాలపై, రాసుకునే నోట్‌బుక్స్‌పై ఇటువంటి కొటేషన్స్ కనిపించేవి. అవి బాల్యంలోనే వారిలో తోటి మనుషుల పట్ల మర్యాదగా మెసులుకోవడం అనే అంశాన్ని నాటేవి. ఇప్పటి ప్రభుత్వాలు అందుకు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తూ వివిధ వాదాలను పెంచి పోషిస్తున్నాయి. అందుకు అనుగుణంగానే దాడులు, హత్యలు జరుగుతూ ప్రగతిపథంలో పయనించాల్సిన దేశాన్ని మరింతగా అగాథంలోకి నెట్టివేస్తున్నారు.

కులం, మతం అంశంపై మహెజబీన్ 1995లో ఎంత చక్కటి కవిత రాసారో చూడండి. **"నేను మజీద్, తను మందిర్/ మాకో యేసు ప్రభు పుట్టాడు"** అని మొదలుపెడతారు. ఇదే కవితలో **"మొగుణ్ణి దేవుళ్ళ లెక్కలోకి చేర్చకుండా/ సహచరుడిగా ప్రేమించడం/ ప్రపంచ వింతల్లో చేరిపోయింది"** అని వైవాహిక వ్యవస్థలోని మిథ్యలను కొట్టి పారేస్తారు.

భిన్న కోణాలలో సమాజంలో ప్రేమతో పాటు చైతన్యాన్ని పెంచేలా రూపు దిద్దుకున్న ఆకురాలు కాలంలోని కవిత్వమంతా ఎంతో సున్నితంగా ఉంటుంది. రాడికల్ భావజాలం ఉన్నప్పటికీ ఎక్కడా గొంతెత్తి నినదిస్తున్నట్లుగా కనిపించదు. అలాగని పాత భావజాలాన్ని మోస్తున్నట్లుగానూ ఉండదు. చెప్పాల్సిన అంశాన్ని సూటిగా, పాఠకుల మెదడులోకి ఇంకించి ఆలోచింపజేస్తున్నట్లుగా ఉంటుంది. కవిత్వం మధ్యలో ఉర్దూ షాయరీలో ఉన్నట్లుగా ఒక విరుపూ ఉంటుంది. కవిత ఎత్తుగడ నుంచి చివరి వరకూ ఎక్కడా తడబడకుండా అదే ప్రవాహాన్ని కొనసాగిస్తారామె. నిశ్చలంగా స్పష్టంగా చెప్పాల్సిన విషయాన్ని రూఢి చేసే తత్వం ఉర్దూ షాయరీలో కనిపిస్తుంది. అందుకేనేమో కవితల్లోని శబ్ద సౌందర్యాన్ని 'నజాకత్' గా అభివర్ణించారు విమర్శకులు, ఉర్దూ పండితులు సామల సదాశివ.

ఇక ఈ పుస్తకానికి ముందుమాట రాసిన ప్రొఫెసర్ చేకూరి రామారావు "ఈ దశాబ్దపు వాగ్దానం మహెజబీన్" అని కితాబునిస్తే, "a lyrical beauty' గా కీర్తించారు శివారెడ్డి. మహెజబీన్‌లోని ప్రతిభకు తగినట్లుగా వారు ఈ మాటలు రాసినప్పటికీ, ఆమె పట్ల చేసిన ఫిర్యాదును విస్మరించకూడదు. పదునైన కవిత్వం రాసే మహెజబీన్ రాయాల్సినంతగా రాయలేదనేదే ఆ ఫిర్యాదు. అయినప్పటికీ ఆమె నుంచి మరో పుస్తకం రాకపోవడం ఆశ్చర్యంగానే ఉంటుంది. అయితే పత్రికల్లో మటుకు ఆమె రాసిన కవితలు ప్రచురితమవుతూనే ఉన్నాయి. నిర్భయ ఉదంతం జరిగినప్పుడు ఆమె రాసిన 'వజైనల్ మోనోలాగ్', పౌరసత్వం గురించిన 'ప్రశ్న దేశద్రోహమైంది... ఏం చేయను..?' వంటి కవితలు ఆమె కవిత్వానికి ఏమాత్రం వాడి తగ్గలేదని నిరూపిస్తూనే ఉన్నాయి. త్వరలోనే ఆమె రాసిన కవితలన్నింటిని కూర్చి మరో పుస్తకంగానూ రావాలని కోరుకుందాం.

◆◆

దర్వాజ పేజీపై మీ అభిప్రాయాలను, సూచనలను, సలహాలను, రచనలను darwajapage@gmail.com కు పంపించగలరు. చిరునామా : దర్వాజ, నవతెలంగాణ, ప్లాట్‌నెం. 21/1, అజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్- 500020



పీఎఫ్ఆర్డీఏ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నవతెలంగాణ-మిర్యాలగూడ

సీపీఎస్ అమలుకు కారణమైన పీఎఫ్ఆర్డీఏ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ (పీఎఫ్ఆర్డీఏ)ను రద్దుచేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని వర్తింపచేయాలని కోరారు. ప్రభుత్వ సొమ్మును కార్పొరేట్లకు అప్పనంగా అందించడం మంచిది కాదన్నారు. ఏ రకంగా చూసినా కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం.. ఉద్యోగులకు, ప్రభుత్వానికి నష్టం కలిగిస్తుందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం 2023 ఎన్నికల మేనిఫెస్టోలో సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను అమలు చేస్తానని ప్రకటించిందని.. దాన్ని అమలుచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1, 2004 ముందు ఉద్యోగ నోటిఫికేషన్ వచ్చి ఆ తర్వాత నియమించబడిన 2002, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పాత పెన్షన్ వర్తింపచేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. సెప్టెంబర్ 1, 2004 తర్వాత ఉద్యోగాల్లో చేరి ఉద్యోగ విరమణ చేసిన వారికి కనీస పెన్షన్ చెల్లించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశం, జిల్లా ఉపాధ్యక్షులు బి.శ్రీనివాస్‌చారి, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత చేప పిల్లల పథకానికి టెండర్లు కాదు...

మత్స్య సొసైటీల్లో నగదు జమ చేయాలి

టీఎంకేఎంకేఎస్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పథకానికి టెండర్లు ఆహ్వానించకుండా మత్స్య సొసైటీలకు నగదు బదిలీ చేయాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం (టీఎంకేఎంకేఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోరెంకల నర్సింహ, లెల్లెల బాలకృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం (2024-25) సీజన్‌లో చేప, రొయ్య పిల్లల పంపిణీకి రూ.114 కోట్లు కేటాయించిందని తెలిపారు. గతంలో లాగా ఈసారి టెండర్లు ఆహ్వానించకూడదని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కొంత మంది చేపల కాంట్రాక్టర్లు దీనిని ఆసరాగా చేసుకుని ప్రభుత్వ సొమ్ముకు గండికొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కొత్తగా రూపొందించిన నిబంధనలు వారి లాభార్జనకు ఆటంకంగా ఉన్నాయనే కారణంతో కాంట్రాక్టర్లు అంతా సిండికేటుగా ఏర్పడ్డారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా చేప పిల్లల కొనుగోలు కోసం ప్రభుత్వం రెండు దఫాలుగా టెండర్ల ప్రక్రియను ప్రారంభించిందనీ, అధిక లాభాల కోసం ఆ ప్రక్రియలో కాంట్రాక్టులు పాల్గొనడం లేదని విమర్శించారు. గతంలో కాంట్రాక్టర్లు, కొంతమంది అధికారులు కలిసి అవినీతికి పాల్పడ్డారనీ, అటువంటి వారిపై చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. చేప పిల్లల ఉత్పత్తిపై అధికారులు సరైన దృష్టి సారించకపోవడం వల్ల ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. చేప పిల్లల పంపిణీలో అవినీతి, అక్రమాలను కట్టడి చేసేందుకు చేప పిల్లలకు బదులుగా మత్స్య సహకార సంఘాల బ్యాంక్ అకౌంట్లలో నగదు జమ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

చేప పిల్లలకు బదులుగా

నగదు పంపిణీ చేయండి

సీఎంకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని మత్స్యకారులకు చేప పిల్లలకు బదులుగా వాటి విలువ ఆధారంగా నగదు పంపిణీకి చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో మత్స్యకారులకు, వారి వృత్తి ప్రోత్సాహకానికి మత్స్య పారిశ్రామిక సొసైటీల పరిధిలోని చెరువులు, కుంటల్లో చేప పిల్లలను పంపిణీ చేయడం తెలిసిందే. చేప పిల్లల పంపిణీకి జూలై నెలలో టెండర్ల ప్రక్రియను ప్రారంభిస్తారనీ, ప్రస్తుతం కాంట్రాక్టర్లు సిండికేట్‌గా ఏర్పడి టెండర్లలో పాల్గొనడం లేదని పేర్కొన్నారు. దీంతో టెండర్ల ప్రక్రియను వాయిదా వేసిందని తెలిపారు. టెండర్ల ద్వారా పంపిణీ చేస్తున్న చేప పిల్లలు నాణ్యంగా ఉండటం లేదని వివరించారు. ఈ క్రమంలో మత్స్యకారుల సొసైటీలకు చేప పిల్లలకు బదులుగా నగదు బదిలీ చేయాలని సీఎంను ఆయన కోరారు.



నేతన్నలను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఆర్డర్లు ఇచ్చి ఉపాధి కల్పించాలి : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించి నేతన్నలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద వస్త్ర పరిశ్రమ అనుబంధ రంగాల జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సిరిసిల్లలో కొన్ని నెలల నుంచి ఉపాధి లేక నేత కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. వేలాది కుటుంబాలు ఆధారపడిన వస్త్ర పరిశ్రమ సమస్యలను పరిష్కరించి కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై అసెంబ్లీలో చర్చించనున్నట్టు చెప్పారు. వస్త్ర పరిశ్రమ జేఏసీ అడుగుతున్న న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. కార్మికులకు గతంలో ఉన్న పథకాలను కొనసాగించాలని, విద్యుత్ సబ్సిడీ అందించి ఉపాధి కల్పించాలన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆధునికతవైపు నడిపించి, బతికించాలన్నారు. పెండింగ్ బకాయిలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, పట్టణ కార్యదర్శి పంతం రవి, కడారి రాములు, సీపీఐ(ఎం) నాయకులు రమేష్, గణేష్ పలువురు వస్త్ర పరిశ్రమ జేఏసీ తాటిపాముల దామోదర్, మండల సత్యం, ఎనుగుల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్త రెవెన్యూ చట్టం.. పేదలకు, రైతులకు చుట్టం

- భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా రూపకల్పన
- గ్రామాల్లోనే భూ సమస్యలు పరిష్కారమయ్యేలా వ్యవస్థ : ఆర్వోఆర్ చట్టం-2024 ముసాయిపై డీసీఏ చర్చలో వక్తలు



దేశంలోనే భూ సంస్కరణలకు ఇది పెనుమార్పు కానుంది

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కొత్త రెవెన్యూ చట్టం పేదలకు, రైతులకు చుట్టంగా మారనుందని పలువురు వక్తలు ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల భవిష్యత్తు తరాలకు కూడా ఉపయోగపడేలా ఆర్వోఆర్ చట్టం-2024 ముసాయిదా ఉందని అభిప్రాయపడ్డారు. దేశంలో అటవీ హక్కుల చట్టం తర్వాత ఒక చట్టం ముసాయిదాను ప్రజాభిప్రాయం కోసం పబ్లిక్ డొమైన్‌లో ఉంచడం మంచి పరిణామం అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్(డీసీఏ) ఆధ్వర్యంలో ఆర్వోఆర్ చట్టం-2024 ముసాయిదాపై చర్చ నిర్వహించారు. భూ చట్టాల నిపుణులు భూమి సునీల్ మాట్లాడుతూ..రాజ్యాంగం తరహాలో కొత్త ఆర్వోఆర్ చట్టానికి రూపకల్పన జరిగిందన్నారు. దేశంలోని 18 రాష్ట్రాల ఆర్వోఆర్ చట్టాలను అధ్యయనం చేసి మంచి అంశాలను స్వీకరించామని తెలిపారు. ఇప్పుడు తెలంగాణలో రాబోయే ఐదో ఆర్వోఆర్ -2024 చట్టానికి ప్రత్యేకత ఉందని చెప్పారు. 10,20 ఏండ్లను దృష్టిలో పెట్టుకుని ఈ చట్టరూపకల్పన జరిగిందన్నారు.

స్వాధీనంలో భూమి, చేతిలో పట్టా, రికార్డులో పేరు ఉన్నప్పుడే ఏ రైతుకైనా సంపూర్ణ భూమి హక్కులు దక్కుతాయని చెప్పారు. వాటి కేంద్రంగానే కొత్త చట్టం ఉండబోతుందన్నారు. వ్యవసాయ భూములకు మాదిరిగానే వ్యవసాయేతర భూములకు కూడా భూమి రికార్డు రాబోతుందని తెలిపారు. ముసాయిదాపై సలహాలు, సూచనలు చేయాలని కోరారు. భవిష్యత్తులో తెలంగాణలోని రెవెన్యూ చట్టాలన్నింటినీ కలిపి ఒకటే చట్టం తీసుకొచ్చే దశలో ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రతి రైతు భూమికీ భూ ఆధార్ కార్డు ఇచ్చే ఆలోచనలో కేంద్రం ఉందన్నారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల ప్రొఫెసర్ జీబీరెడ్డి మాట్లాడుతూ..ప్రస్తుతమున్న ఆర్వోఆర్ చట్టంతో ఏ చిన్న సమస్య వచ్చినా సివిల్ కోర్టుకు పోవాల్సిన పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది సాధారణ రైతులకు సాధ్యంకాని పనిగా మిగిలిపోయిందన్నారు. 2020 ఆర్వోఆర్ చట్టంలో అప్పీల్, రివిజన్ చేసే అవకాశం లేదన్నారు. ఆ చట్టానికి చిన్న చిన్న మార్పులు చేసుకుని తీసుకొస్తే రైతుల కష్టాలు తీరుతాయన్నారు. ఈ ముసాయిదాను వెంటనే చట్టంగా చేసి వెంటనే అమల్లోకి తేవాలని కోరారు.

డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజల నుంచే చట్టం రావాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం కొత్త చట్టం యొక్క ముసాయిదాను పబ్లిక్ డొమైన్‌లో ఉంచిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చట్ట రూపకల్పనలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛను ఇచ్చిందని చెప్పారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రూల్స్‌ను కూడా మార్చుకొనే వెసులుబాటు ఈ చట్టంలో ఉందన్నారు. గ్రామానికో రెవెన్యూ అధికారి కూడా అందుబాటులో ఉంటూ సేవలందించే రోజులు కూడా వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతమున్న చట్టంలో చిన్న సమస్య వచ్చినా రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల నుంచి సీసీఎల్ఏకు రావాల్సిన దుస్థితి ఉందని చెప్పారు. కొత్త చట్టంలో అధికారుల వికేంద్రీకరణతో ప్రజలకు గ్రామ, మండల స్థాయిలోనే అన్ని రకాల సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. చర్చలో రిటైర్డ్ రెవెన్యూ ఉన్నతాధికారులు రవీంద్రబాబు, బాలరాజు, డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, రమేశ్ లొలేవార్ కూడా మాట్లాడారు. కార్యక్రమంలో మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఎన్ఆర్ సరిత, డీసీఏ ఉపాధ్యక్షులు శకుంతల, శ్రీనివాస్, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.రాములు, సెక్రటరీ జనరల్ ఎల్.పూల్‌సింగ్ చౌహాన్, ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, మహిళా విభాగం అధ్యక్షులు పి.రాధా, కోశాధికారి శ్రీనివాస శంకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి విద్యుత్ పనులు వేగవంతం చేయండి

- 2025 మార్చి నాటికి ఉత్పత్తి ప్రారంభం కావాలి : విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్క



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో 2025 మార్చి నాటికి ఉత్పత్తి ప్రారంభం కావాలని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్, ఆర్థికశాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారుల్ని ఆదేశించారు. నాలుగు వేల మెగావాట్ల ఈ విద్యుత్కేంద్రంలో దానికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. ఆదివారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో జెన్‌కో ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. యాదాద్రి థర్మల్ కేంద్రం (800X5=4,000) లోని రెండో యూనిట్‌ను ఏ ఏడాది అక్టోబర్ 15 నాటికి, మొదటి యూనిట్‌ను అక్టోబర్ 30కి, నాలుగో యూనిట్‌ను ఈ ఏడాది డిసెంబర్‌నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. మూడో యూనిట్‌ను 2025 ఫిబ్రవరికి, ఐదవవ యూనిట్‌ను 2025 మార్చి నాటికి పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించి, అమలు చేయాలని ఆదేశించారు. అయితే ప్లాంట్‌లో పనిచేస్తున్న కొందరు అధికారులు, సిబ్బంది జ్వరాలతో బాధపడుతున్నారనీ, దానివల్ల పనుల్లో కొంత జాప్యం జరుగుతున్నదని అధికారులు డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి తక్షణం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి, దోమల బారి నుంచి వారిని రక్షించే చర్యలు తీసుకోవాలనీ, ఫాగింగ్ చేస్తూ, క్యాంపుల్లో దోమతెరలు సరఫరా చేయాలని ఆదేశించారు. కార్మికుల భద్రత, ఆరోగ్యాలను ఎంతమాత్రం నిర్లక్ష్యం చేయొద్దని చెప్పారు. అధికారులు, కార్మికులు స్థానికంగా నివసించేందుకు వెంటనే క్వార్టర్ల నిర్మాణానికి టెండర్లు పిలవాలని ఆదేశించారు. అవి పూర్తయ్యేవరకు మిర్యాలగూడ, దామరచర్ల నుంచి సిబ్బందిని తరలించేందుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే యాదాద్రి పవర్ ప్లాంట్ నుంచి బూడిద తరలింపునకు తాళ్ల వీరప్పగూడెం, దామరచర్లకు నాలుగు వరుసల బైపాస్ రోడ్డు నిర్మాణం పనుల పురోగతిపై వారంరోజుల్లో నివేదిక ఇవ్వాలని కోరారు. ఈనెలలో తానే స్వయంగా ప్లాంటును సందర్శిస్తానని చెప్పారు. సమావేశంలో ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి రోనాల్డ్ రాస్, జన్‌కో డైరెక్టర్లు అజయ్, సచ్చిదానందం, వైటీపీఎస్ చీఫ్ ఇంజనీర్ సమ్మయ్య,ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాస్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణభాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

'బలగం'కు కేటీఆర్ అభినందనలు

- ఫిలింఫేర్‌లో ఉత్తమచిత్రంగా ఎంపిక



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఫిలింఫేర్ అవార్డుల్లో ఉత్తమ చిత్రంగా 'బలగం' ఎంపిక కావడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు (కేటీఆర్) ఆ చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలిపారు. ఆ చిత్ర దర్శకుడు వేణు యెల్దండికి శుభాకాంక్షలు చెప్పారు. బలగం సినిమా మొత్తం సిరిసిల్లలోనే చిత్రీకరణ జరుపుకుందనీ, సినీ చరిత్రలోనే ఈ చిత్రం మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. సిరిసిల్ల నేత కార్మిక కుటుంబంలో పుట్టి, సినీరంగంలో వేణు యెల్దండి రాణిస్తున్నారని పేర్కొన్నారు. ఉత్తమ దర్శకుడిగా వేణు యెల్దండి (బలగం), ఉత్తమ సహాయ నటిగా రూపలక్ష్మి(బలగం)కి అవార్డులు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ విజయం వేణుతో పాటు అతని టీం కష్టానికి దక్కిన ఫలితంగా అభివర్ణించారు.

తెలుగు విశ్వవిద్యాలయానికి 'పాల్కురికి' పేరు పెట్టాలి : మామిండ్ల రమేశ్ రాజా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయానికి తెలంగాణ ఆదికవి, స్వతంత్ర కవి పాల్కురికి సోమనాథుడు పేరును పెట్టాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాలమూరు విశ్వవిద్యాలయానికి పత్రికా, సాహిత్య రంగానికి విశేష సేవలందించిన సురవరం ప్రతాప్‌రెడ్డి పేరును పెట్టాలని సూచించారు. తద్వారా పాల్కురికి సోమనాథుడిని, సురవరం ప్రతాప్‌రెడ్డిని సముచితంగా గౌరవించుకున్నట్టు అవుతుందని ఆయన పేర్కొన్నారు.

బొగ్గు బ్లాకులు లేకుంటే సింగరేణి మనుగడ కష్టం

- ప్రయివేట్ కంపెనీకి కేటాయించిన బ్లాకులు సింగరేణికి కేటాయించాలి
- సింగరేణి పరిరక్షణ కోసం ఉద్యమాలు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య
- ఇల్లందు చేరుకున్న సింగరేణి పరిరక్షణ యాత్ర



నవతెలంగాణ-ఇల్లందు

సిరుల తల్లి సింగరేణికి బొగ్గు బ్లాకులు లేకుంటే భవిష్యత్‌లో దాని మనుగడే కష్టమని, తెలంగాణకు గుండెకాయగా ఉన్న సింగరేణి పరిరక్షణ కోసం ఉద్యమాలు తప్పవని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. ఇప్పటికే ప్రయివేటు కంపెనీలకు కేటాయించిన బొగ్గు బ్లాకులు సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలోని బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనుల వేలాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేస్తూ జులై 29న బెల్లంపల్లిలో ప్రారంభమైన సింగరేణి పరిరక్షణ యాత్ర ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఇల్లందు సింగరేణి జేకే ఓసీ ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించారు. అనంతరం ఇల్లందు కొత్త బస్టాండ్ సెంటర్‌లో సీపీఐ(ఎం) నాయకులు ఎస్‌ఏ.నబీ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఎస్.వీరయ్య మాట్లాడారు. సింగరేణికి బొగ్గు బ్లాకులు కేటాయించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని, సంస్థను ప్రయివేటీకరించేందుకే బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని ముందుకు తీసుకువచ్చిందన్నారు. తెలంగాణలో మొట్ట మొదటిసారిగా బొగ్గును గుర్తించింది ఇల్లందు బొగ్గుట్టలోనని, బొగ్గు పుట్టిన ఏరియాలో సింగరేణి మనుగడ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో బొగ్గు బ్లాకులు లేని సింగరేణిని ఊహించలేమన్నారు. సంస్థ ద్వారా సింగరేణి ప్రాంతాల్లో ఎంతో అభివృద్ధి జరుగుతుందని, సీఎస్ఆర్ పాలసీ కింద అనేక కోట్ల రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు జరుగుతున్న విషయాన్ని గుర్తు చేశారు.

శ్రావణపల్లి బొగ్గు వేలం పాటను రద్దుచేసి సింగరేణి సంస్థకు అప్పగించాలని డిమాండ్ చేశారు. బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి హైదరాబాద్ కేంద్రంగా వేలం పాట ప్రారంభించడాన్ని చూస్తే బీజేపీ నాయకులు తెలంగాణ ప్రజలకు ద్రోహం చేసేందుకే ఉన్నారని స్పష్టమవుతోందన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ అన్వేషణా విభాగం పరిశోధన చేసి బొగ్గు నిల్వలను గుర్తిస్తే, వాటిని ప్రయివేటు వారికి అప్పగించడం సరైనది కాదని అన్నారు. కోయగూడెం, సత్తుపల్లి ఓసీల్లో ప్రయివేటు కంపెనీకి అప్పగించిన బొగ్గు బ్లాకులను వెంటనే వెనక్కి తీసుకొని సింగరేణికి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే సింగరేణిలో కార్మికులు తగ్గిపోయారని, రానున్న రోజుల్లో వేలాది మంది కార్మికులు నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. సింగరేణి సంస్థ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వేలాది కోట్ల రూపాయలు పన్నుల రూపంలో చెల్లిస్తున్నదని, వాటి ద్వారా ప్రభావిత ప్రాంతాలు అభివృద్ధి జరుగుతున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సభలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఆశయ్య, ఏజే.రమేష్, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు, నాయకులు తాళ్లూరి కృష్ణ, ఆలేటి కిరణ్ కుమార్, మన్యం మోహన్‌రావు, సిరాజ్ అహ్మద్, వి.రాజ మొగిలి, సుల్తాన, తాళ్లూరి పద్మ ఆలేటి సంధ్య మరియా, ప్రేమ్ సింగ్, వెంకటమ్మ, సోమ లక్ష్మి, కోటమ్మ హుస్సేన్, తిరుమల, స్వరూప, శాంత తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ ఓఆర్ఆర్‌పై భారీగా గంజాయి పట్టివేత

- ట్రక్కులో తరలిస్తుండగా.. పట్టుకున్న సైబరాబాద్ పోలీసులు
- పట్టుబడిన గంజాయి విలువ దాదాపు రూ.3 కోట్లు : సైబరాబాద్ ఎస్ఓటీ డీసీపీ శ్రీనివాస్



నవతెలంగాణ-మియాపూర్

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై భారీగా గంజాయి పట్టుబడింది. బాలానగర్, శంషాబాద్ ఎస్ఓటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించగా.. ట్రక్కులో తరలిస్తున్న 803 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సైబరాబాద్ సీపీ కార్యాలయంలో సైబరాబాద్ ఎస్ఓటీ డీసీపీ శ్రీనివాస్ ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఒడిశా నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా తెలంగాణ నుంచి మహారాష్ట్ర, కర్నాటకకు గంఝాయిని తరలిస్తున్నారు. నిందితులు డీసీఎం ఏర్పాటు చేసుకుని దానిలో మొదటి వరుసలో కెమికల్ డ్రమ్స్ పెట్టి, వెనుక వైపు గంజాయి పెట్టుకొని సరఫరా చేస్తున్నారు. ఇలా డీసీఎంలో గంజాయి తీసుకొచ్చినందుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు డబ్బులు వసూలు చేస్తారు.

డీసీఎంలో తీసుకొచ్చిన గంజాయిని పటాన్‌చెరులోని ఒక నిర్మాణష్య ప్రాంతంలో ఉంచి, మహారాష్ట్ర, కర్నాటకకు పంపించే ఏర్పాటు చేసుకున్నారు. ఆ క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు బాలానగర్, శంషాబాద్ ఎస్ఓటీ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.3 కోట్లు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. ఇంత పెద్ద మొత్తంలో గంజాయిని పట్టుకోవడం ఇదే మొదటి సారి.

ఐదుగురిపై కేసు నమోదు చేసి వారిని విచారిస్తున్నారు. ఈ కేసులో మొత్తం ఏడుగురి ప్రమేయం ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ప్రధాన నిందితుడు రాము, సోమనాథ్ కట్టర్, సురేష్ మారుతి పటేల్, విటల్‌రెడ్డి తదితరులు ఉన్నారు. ప్రధాన నిందితుడు రాము పరారీలో ఉన్నాడు. ఈ ఆపరేషన్‌లో బాలానగర్ ఎస్ఓటీ సీఐ శివ, ఎస్ఐ రవి కిరణ్, సిబ్బంది పాల్గొనగా.. వారిని సైబరాబాద్ సీపీ అభినందించినట్టు డీసీపీ తెలిపారు.

7వ తేదీ నుంచి పంటలకు ఎస్సారెస్పీ నీటి విడుదల



నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్

ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి సాగునీటి అవసరాల కోసం బుధవారం నుంచి నీటిని విడుదల చేయనున్నట్టు ప్రాజెక్టు ఎస్ఈ శ్రీనివాసరావు గుప్త ఆదివారం తెలిపారు. ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో, ఎగువ ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో ప్రాజెక్టులోకి క్రమంగా వరద నీరు వచ్చి చేరుతుందని, దాంతో నీటి సామర్థ్యం పెరుగుతున్నట్టు తెలిపారు.

ప్రస్తుతం ప్రాజెక్టులోకి పరిసర ఎగువ ప్రాంతాల నుంచి 21,422 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుందని చెప్పారు. కాగా తెలంగాణ నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సమీకృత నీటి ప్రణాళిక యాజమాన్య కమిటీ సమావేశ నిర్ణయం ప్రకారం ఆగస్టు 7 (బుధవారం) నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని పంటలకు కాకతీయ, లక్ష్మి, సరస్వతి కాలువలకు సాగునీరు విడుదల చేయనున్నట్టు తెలిపారు. వానాకాలం పంటలు వేయని రైతులు పంటలు వేయటానికి అన్నిరకాల సిద్ధం చేసుకోవాలని సూచించారు.

నీటి విడుదల సమాచారంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

14న కేఆర్ఎంబీ భేటీ

- చెన్నైకి తాగునీటి సరఫరాపై చర్చ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

చెన్నైయ్ నగరానికి తాగునీటిని అందించడంపై ఈ నెల 14వ తేదీన ఉదయం 11 గంటలకు ఆన్‌లైన్ విధానంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో కష్ణా నదీ యాజమాన్య సంస్థ(కేఆర్ఎంబీ) సమావేశం కానున్నది. ఈ మేరకు ఆ బోర్డు సభ్య కార్యదర్శి రాయ్‌పురే సమాచారాన్ని తెలుగు రాష్ట్రాలకు పంపారు. ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు, ఈఎన్సీలు ఈసమావేశంలో పాల్గొననున్నారు.

13న జీఆర్ఎంబీ సమావేశం

గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశం ఈ నెల 13వ తేదీన జరగనున్నది. సీతారామ ఎత్తిపోతల పథకం, సీతారామ బహుళార్థసాధక ప్రాజెక్టు పథకాలకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను గోదావరి నదీ యాజమాన్య బోర్డుకు సమర్పించనుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 13న జీఆర్ఎంబీ భేటీకి హాజరు కావాలంటూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు జీఆర్ఎంబీ సమాచారం పంపింది. వాస్తవానికి ఈనెల 6న జరగాల్సిన ఈ సమావేశాన్ని తెలంగాణ అభ్యర్థన మేరకు 13కు వాయిదా వేసింది.

నవతెలంగాణ
సోమవారం 05 ఆగస్టు 2024

బీజేపీ ఫాసిస్టు విధానాలను తిప్పికొట్టాలి

- గిరిజన ప్రాంతాల్లో మతం పేరుతో జరిగే హింసా రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీజేపీ మతం పేరుతో చేసే హత్యా రాజకీయాలను తిప్పికొట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. కుమురం భీం జిల్లా లాంటి ఏజెన్సీ ప్రాంతాల్లో బీజేపీ చేప కింద నీరులా విస్తరిస్తున్నదనీ, దానిని నిలువరించాలని సూచించారు.రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కి, ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నదని విమర్శించారు. రాజ్యాంగాన్ని మారుస్తామంటూ పదే పదే చెప్పిన బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో దేశ ప్రజలు తగిన బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎం) కుమురం భీం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులల్లో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం స్థానంలో మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని బీజేపీ ప్రయత్నిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మనుధర్మ శాస్త్రం ప్రకారం దేశంలో ఉన్న నిమ్నకులాల ప్రజలు అంటరానివారుగా, దేశ అభివృద్ధి ఫలాలకు దూరంగా ఉండాలనీ, స్త్రీలకు కనీస స్వేచ్ఛ లేకుండా వారిని రెండోవ తరగతి పౌరులుగా స్థిరపర్చే కుట్ర దాగి ఉందని చెప్పారు. దేశాన్ని మత రాజ్యంగా మార్చే కుట్రలో భాగంగా అధికారాన్ని పావుగా వాడుకుంటున్నారనీ, దాని అంతిమ లక్ష్యం హిందూ మత రాజ్యాన్ని ఏర్పాటు చేయడమేనని విమర్శించారు. మత రాజ్యంలో ప్రజలకు కనీస హక్కులు ఉండవనీ, మత సిద్ధాంతాల ఆధారంగా ప్రజలు బతకాలని చెప్పారు. దేశంలో ఉన్న నిమ్న కులాలు, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు బ్రాహ్మణీయ భావజాల ఆధిపత్యంలో బతకాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ హక్కులను కాలరాసే బీజేపీ ఫాసిస్టు విధానాలను తిప్పికొట్టేందుకు సీపీఐ(ఎం) ప్రతీ సభ్యుడూ బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు బండారు రవి కుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి కూషన రాజన్న, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్ కుమార్, గుడిసెల కార్తీక్, రాజ్ కుమార్ నాయకులు మాలశ్రీ, శంకరమ్మ కమల జిల్లాలోని వివిధ మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అందితే జుట్టు...లేకుంటే కాళ్లు

- ఇదీ కాంగ్రెస్ నైజం : బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

నిరుద్యోగులకు ఆశలు కల్పించి, వారి ఓట్లతో ఎన్నికల్లో గెలిచి, అధికారంలోకి వచ్చాక ఇప్పుడు కాంగ్రెస్‌పార్టీ వారి గొంతులు పట్టుకుంటున్నదని బీఆర్ఎస్ నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి విమర్శించారు. ఆదివారంనాడిక్కడి తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవసరానికి ప్రజలను వాడుకోవడం, అది తీరాక ప్రజలను ముంచడంలో కాంగ్రెస్ పార్టీకి మించిన పార్టీ లేదని చెప్పారు. నిరుద్యోగ యువతపై కేసులు పెట్టి, జైళ్లకు పంపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని ప్రజాభవన్‌కు వెళ్లిన జీవో 46 బాధితులపై పోలీసులు పిడి గుద్దులు కురిపించి, దుర్మార్గంగా వ్యవహరించారని చెప్పారు. జీవో 46 పై న్యాయస్థానాల్లో కేసు పదే పదే వాయిదా పడటం బాధాకరమన్నారు. అసెంబ్లీలో జాబ్ కేలండర్ పేరిట నిరుద్యోగులను మోసం చేశారని ఆరోపించారు. బీహార్, తమిళనాడు రాష్ట్రాల్లో జాబ్ కేలండర్ స్పష్టంగా ఉందనీ, కానీ రాష్ట్ర అసెంబ్లీలో పెట్టిన జాబ్‌కేలండర్‌లో .ఉద్యోగాల సంఖ్య, నోటిఫికెషన్ తేదీలు కూడా లేవని ఎద్దేవా చేశారు. రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విడిచిపెట్టబోమన్నారు.

ప్రయివేటు టీచర్లకు సీఎం క్షమాపణలు చెప్పాలి


- వారికోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి : మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ప్రయివేటు టీచర్లపై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలని మాజీ ఎంపీ, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారంనాడాయన మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావుతో కలిసి తెలంగాణ భవన్ విలేకరులతో మాట్లాడారు. 2009 ఆగస్టులో విద్యా హక్కు చట్టం వచ్చి, రాజ్యాంగ సవరణ ద్వారా విద్య ప్రాథమిక హక్కుగా మారిందని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 40,941 పాఠశాలలు ఉంటే, ప్రభుత్వ పాఠశాలలు 30,307 ఉన్నాయన్నారు. మొత్తం 50 లక్షలు మంది విద్యార్థులు ఉంటే, అందులో 51 శాతం ప్రయివేటు పాఠశాలల్లోనే ఉన్నారని వివరించారు. ప్రయివేటు పాఠశాలలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడానికి వీల్లేదన్నారు. ప్రయివేటు స్కూళ్లలో పదో తరగతి ఫెయిల్ అయిన వారు ఉపాధ్యాయులుగా ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారనీ, అది ఎవరి తప్పు అని ప్రశ్నించారు. విద్యా హక్కు చట్టం ప్రకారం శిక్షణ పొందినవారే ఉపాధ్యాయులుగా ఉండాలని చెప్పారు. ప్రయివేటు పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు విద్యా సెస్ వసూలు చేసైనా, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. వారికి రిటైర్మెంట్ తర్వాత కూడా సాయం అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో రెండు లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రయివేటు పాఠశాలల్లోకి వెళ్లారనీ, సీఎం రేవంత్‌రెడ్డి దానిపై దృష్టి పెట్టాలని సూచించారు. త్వరలో లక్ష మంది ప్రయివేటు ఉపాధ్యాయులతో సభ పెట్టి, సంరక్షణ చట్టంం కోసం ఒత్తిడి తెస్తామని చెప్పారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

- ఫ్లైఓవర్‌పై నుంచి పడి ఇద్దరు.. మరో ప్రమాదంలో ఒకరు..
- గచ్చిబౌలి, మాదాపూర్ పోలీసుస్టేషన్ల పరిధిలో ఘటనలు



నవతెలంగాణ-మియాపూర్

వేరు వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు యువకులు మృతిచెందినఘటనలు రంగారెడ్డి జిల్లాలో ఆదివారం జరిగాయి. కొత్తగూడ ఫ్లైఓవర్‌పై నుంచి పడి ఇద్దరు యువకులు మృతిచెందగా, మరో ప్రమాదంలో యువకుడు మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా పేపర్ల గ్రామానికి చెందిన బాల ప్రసన్న(24), మద్రిపాడు గ్రామానికి చెందిన రోహిత్ (26) ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. వీరు హఫీజ్‌పేట్‌లో నివాసం ఉంటున్నారు. కాగా, వీరిద్దరూ ఆదివారం ఉదయం మజీద్‌బండ నుంచి ద్విచక్ర వాహనంపై హఫీజ్‌పేట్ వైపు వెళు ్తండగా కొత్తగూడ ఫ్లైఓవర్‌పై వేగంగా బైక్ నడపడంతో వాహనం అదుపుతప్పి ఫ్లైఓవర్ పై నుంచి కిందపడ్డారు. ఈ ఘటనలో ఇద్దరూ అక్కడిక్కడే మృతిచెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కేపీహెచ్‌బీ, హైటెక్ సిటీ మార్గంలో ఇద్దరు యువకులు స్వామిశంకర్(28), ప్రవీణ్ బైక్‌పై వెళ్తున్నారు. యశోద ఆస్పత్రి దగ్గర ఫ్లైఓవర్‌పై లారీని బైక్ అతివేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బైకుపై వెనుక కూర్చున్న స్వామి శంకర్ ఫ్లైఓవర్‌పై నుంచి కింద పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే స్వామి మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. ప్రవీణ్ బైక్‌ను నిర్లక్ష్యంగా, అతివేగంగా నడపడంతోనే ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పట్టాలు తప్పిన మోడీ రైలు బండి

- విధాన నిర్ణయాలన్నీ ఆయనవే
- నామ్‌కేవాస్తేగా రైల్వే మంత్రి
- ఓట్ల కోసమే కొత్త రైళ్లు, ప్రాజెక్టులు
- కాంట్రాక్ట్ సిబ్బంది చేతికి కీలక విధులు

న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ పాలనలో భారతీయ రైల్వే పట్టాలు తప్పింది. ఆ శాఖకు గ్రహణం పట్టింది. ప్రమాదాలు జరగడం, ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవడం నిత్యకృత్యంగా మారిపోయింది. తాజాగా గత సంవత్సరం కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, ఈ ఏడాది కాంచన్‌జంగా ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురయ్యాయి. ఈ రెండు ప్రమాదాలపై విచారణ ఇంకా కొనసాగుతూనే ఉంది. రైల్వే భద్రతా కమిషనర్ ప్రాథమిక విచారణను పూర్తి చేశారు. కోరమాండల్ ప్రమాదంపై సీబీఐ విచారణ ప్రారంభమైంది. రైల్వేలో చోటుచేసుకుంటున్న వివిధ ప్రమాదాలపై విశ్లేషణలు అందించడంలో 'ది వాల్' ఎగ్జిక్యూటివ్ ఎడిటర్, టైమ్స్ ఆఫ్ ఇండియా మాజీ సీనియర్ ఎడిటర్ అమల్ సర్కార్‌కు విశేష అనుభవం ఉంది. రైలు ప్రమాదాలపై అమల్ సర్కార్ అందిస్తున్న విశ్లేషణాత్మక కథనం...ఇప్పుడు భారతీయ రైల్వేలకు విడిగా ఓ బడ్జెట్ అంటూ లేదు. విధాన నిర్ణయాలన్నీ ప్రధాని నరేంద్ర మోడీవే. ప్రస్తుత ప్రాజెక్టులను పూర్తి చేసిన తర్వాతే కొత్త రైళ్లు లేదా మార్గాలు ప్రవేశపెట్టాలని ప్రధాని గతంలో నిర్ణయించారు. కాబట్టి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ చేసేందుకు పెద్దగా పనేమీ ఉండదు.

సాధారణంగా గతంలో రైల్వే బడ్జెట్ విడిగా ఉండేది. ఇపుడు సాధారణ బడ్జెట్‌లో అంతర్భాగమైంది. రైల్వేలను ప్రభుత్వాలు తమ ప్రచారానికి వాడుకునేవారు. ఇపుడు మోడీ నేరుగా తన స్వంత డబ్బా కోసం వాడుకుంటున్నారు. మోడీ క్యాబినెట్ సహచరులు ఆయనను అనునిత్యం కీర్తిస్తూ, ఆయన్ని 'సూపర్ ప్రధాని'గా మార్చేశారు. ఈ నేపథ్యంలోనే మోడీ అకస్మాత్తుగా 'వందేభారత్' రైళ్లను ప్రవేశపెట్టారు. గతంలో ప్రకటించిన ప్రాజెక్టులనే ముందుగా పూర్తి చేయాలన్న తన నిర్ణయానికి కట్టుబడి ఉంటే రైల్వే శాఖ మాజీ మంత్రులు మమతా బెనర్జీ, లాలూ ప్రసాద్ యాదవ్, నితీష్ కుమార్ వంటి వారు ప్రకటించిన ప్రాజెక్టులను పూర్తి చేయాల్సి వచ్చేది. విశాలమైన భారతీయ రైల్వేల సామ్రాజ్యంలో కనీసం ఒక్కటైనా మోడీ సంతకం చేసిన ప్రాజెక్ట్ లేకపోతే ఎలా? ఆ విధంగా ప్రారంభమైందే వందే భారత్ రైళ్లు.



డిటర్జెంట్ సబ్బు వంటిదే...

కొత్త రైళ్ల ప్రారంభంపై ఓ అధికారి ఇలా వ్యాఖ్యానించారు 'మార్కెట్‌లో ఉన్న డిటర్జెంట్ సబ్బు పేరుకు ముందు కొంత కాలం తర్వాత సూపర్, ఎక్స్‌ట్రా సూపర్, ఎక్స్‌ట్రా వైట్, ఎక్స్‌ట్రా బ్రైట్ అని పేర్లు చేరిస్తే ఎలా ఉంటుందో ఇదీ అలాంటిదే. సబ్బు ప్యాకెట్‌లో ఉండే పదార్థంలో ఎలాంటి మార్పు ఉండదు. కేవలం పేరులోనే సూపర్, ఎక్స్‌ట్రా వంటి పదాలను చేరుస్తారు. కొత్త రైళ్ల వ్యవహారం కూడా ఇలాంటిదే'.

సమయపాలన ఎక్కడ?

2022 అక్టోబరులో 130 జనరల్ మెయిల్ లేదా ఎక్స్‌ప్రెస్ రైళ్లను సూపర్ ఫాస్ట్‌గా మార్చేసి ఛార్జీలు పెంచారు. అప్పటికీ, ఇప్పటికీ ఆ రైళ్లలో ఎలాంటి తేడా లేదు. ఒక లెక్క ప్రకారం 2022 జనవరి-సెప్టెంబర్ మధ్య ఈ సూపర్‌ఫాస్ట్ రైళ్లు 2,00,10,000 గంటల ఆలస్యంగా నడిచాయి. సరిపడినన్ని ట్రాక్‌లు లేకపోవడమే దీనికి కారణం. మొత్తం 12,524 రైళ్లలో వెయ్యి రైళ్లను కొత్తగా ప్రవేశపెట్టారు. నాయకులు, మంత్రుల రాజకీయ అవసరాల కోసమే కొత్త రైళ్లను పట్టాలు ఎక్కించారని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.

సమయపాలనకు సంబంధించి స్వయం ప్రకటిత లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమైన చోట కొత్త రైళ్లను ప్రవేశపెట్టారు. వైఫల్యాలను కప్పిపుచ్చడానికే వీటిని నడిపారు. రైళ్లు షెడ్యూలు ప్రకారం నడిస్తే కొత్త వాటి అవసరం ఏముంటుంది? ప్యాసింజర్, గూడ్సు రైళ్లు నడిచే పట్టాల పైనే బులెట్ రైళ్లు లేదా హై-స్పీడ్ రైళ్లను నడపడం అంటే రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల ప్రాణాలను ఫణంగా పెట్టడమే అవుతుంది. రైళ్ల సమయపాలనపై కాగ్ కూడా అక్షింతలు వేస్తోంది. గత పదేండ్ల కాలంలో దేశంలో రైళ్ల సగటు వేగం కేవలం 3.5 శాతం మాత్రమే పెరిగిందని, ఇదేమీ గొప్ప ముందడుగు కాదని కాగ్ తన 2022 నివేదికలో ఎత్తిచూపింది.

డిటర్జెంట్ సబ్బు వంటిదే...
కొత్త రైళ్ల ప్రారంభంపై ఓ అధికారి ఇలా వ్యాఖ్యానించారు 'మార్కెట్‌లో ఉన్న డిటర్జెంట్ సబ్బు పేరుకు ముందు కొంత కాలం తర్వాత సూపర్, ఎక్స్‌ట్రా సూపర్, ఎక్స్‌ట్రా వైట్, ఎక్స్‌ట్రా బ్రైట్ అని పేర్లు చేరిస్తే ఎలా ఉంటుందో ఇదీ అలాంటిదే. సబ్బు ప్యాకెట్‌లో ఉండే పదార్థంలో ఎలాంటి మార్పు ఉండదు. కేవలం పేరులోనే సూపర్, ఎక్స్‌ట్రా వంటి పదాలను చేరుస్తారు. కొత్త రైళ్ల వ్యవహారం కూడా ఇలాంటిదే'.

ఓట్ల కోసమే రైళ్లు, ప్రాజెక్టులు

వైష్ణవ్ ప్రస్తుతం రైల్వే శాఖకు నామమాత్రపు మంత్రి మాత్రమే. ఆ మంత్రిత్వ శాఖ రైల్వే బోర్డు కార్పొరేట్ ఛైర్మన్-కమ్-సీఈఓ నాయకత్వాన, ప్రధానమంత్రి కార్యాలయం ఆదేశాల మేరకు పనిచేస్తోంది. పైగా వైష్ణవ్ రైల్వేకు మాత్రమే మంత్రి కాదు. ఐటీ, సమాచార ప్రసార శాఖలకూ ఆయనే మంత్రి. రైల్వేలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడంలో గత ప్రధానుల దారిలోనే మోడీ నడుస్తున్నారు. జపాన్ సాంకేతిక పరిజ్ఞానం, నిధులతో నాటి ప్రధాని పి.వి. ఈ ప్రాజెక్టును నిర్మించారు.

కేవలం ఓట్ల కోసమే అసంపూర్తి ప్రాజెక్టుకు ప్రధాని ప్రారంభోత్సవం చేశారని ఆరోపణలు వచ్చాయి. జపాన్ అభ్యంతరాలను రైల్వే శాఖ కానీ, ప్రధాని కార్యాలయం కానీ పట్టించుకోలేదు. 29 ఏండ్లు గడిచిన తర్వాత సార్వత్రిక ఎన్నికలకు ముందు నరేంద్ర మోడీ పలు వందేభారత్ రైళ్లకు పచ్చజెండాలు ఊపారు. ఇది కూడా ఓట్ల కోసమేననేది నిర్వివాదాంశం.

కాంట్రాక్ట్ సిబ్బందే ఆధారం

ఇప్పుడు రైల్వే శాఖలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులను కాంట్రాక్టర్లే సరఫరా చేస్తున్నారు. వారికి నైపుణ్యం కానీ, అనుభవం కానీ ఉండదు. కాంట్రాక్టర్లు ఇచ్చే తక్కువ జీతాలకు నిపుణులు, శారీరక దారుఢ్యం కలిగిన వారు రావడం లేదు. ఇప్పుడు దినసరి కార్మికులే సాంకేతిక విభాగాన్ని, నిర్వహణను చూసుకుంటున్నారు. జరగరానిది ఏదైనా జరిగితే జవాబుదారీ వహించే వారే లేరు. రైల్వేలో కాంట్రాక్ట్ సంస్థల హవా కొనసాగుతోంది. అధికారులకు తెలియకుండానే ప్రయివేటు సంస్థల ఉద్యోగులు పట్టాలపై పనిచేస్తుంటారు. రైల్వేలో మూడు లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఫలితంగా ప్రస్తుత ఉద్యోగుల పైనే అధిక పని భారం పడుతోంది. రైల్వే శాఖకు ప్రస్తుతానికి పోటీ లేదు. అది ఏకచ్ఛత్రాధిపత్యం సాగిస్తోంది. ఎక్కడ చూసినా మోడీ ఫొటోలు, సెల్ఫీ పాయింట్లే కన్పిస్తుంటాయి. నరేంద్ర మోడీని రైల్వే మంత్రి అని ఎవరైనా అనుకున్నా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. ఒడిశా ఐపీఎస్ అధికారి వైష్ణవ్ ఉత్సవ విగ్రహమే!

అవకాశం ఉన్న ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం చూపాలి

- ప్రతి మూడు నెలలకు ప్రజావాణిపై ప్రణాళిక శాఖ సమీక్ష
- ప్రభుత్వ విధానాల్లో మార్పులు కోరుకుంటే
- రాతపూర్వకంగా నివేదిక ఇవ్వండి : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజావాణి ద్వారా పరిష్కరించడానికి అవకాశం ఉన్న ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం చూపాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. ఆదివారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షులు చిన్నారెడ్డితో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజావాణి పనితీరుపై ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రణాళికా శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ విధానాల్లో ఏవైనా మార్పులు చేయాలని అధికారులు భావిస్తే వాటిని రాతపూర్వకంగా ప్రభుత్వానికి నివేదించాలని సూచించారు. ఇందులో సాధ్యాసాధ్యాలను ప్రభుత్వం పరిశీలిస్తుందని తెలిపారు. ప్రజావాణికి వస్తున్న ఫిర్యాదులు, అవి పరిష్కరిస్తున్న తీరును డిప్యూటీ సీఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు, వివిధ ప్రభుత్వ శాఖల వారీగా వచ్చిన ఫిర్యాదుల ఆరా తీశారు. సమస్యల పరిష్కారం సందర్భంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు స్పందిస్తున్న తీరును అధికారులు భట్టికి వివరించారు. ఫిర్యాదుదారు తన సమస్య పరిష్కారం ఎంతవరకు వచ్చిందో తెలుసుకునేందుకు ఏ రకమైన వ్యవస్థ ప్రజావాణిలో ఉందనే అంశంపై ఆరా తీశారు. ఫిర్యాదుకు సంబంధించి మొదట దరఖాస్తు చేసుకున్న సందర్భంలో ఎస్ఎంఎస్ పంపిస్తామనీ, సమస్య పరిష్కారం అయిన తర్వాత చివరగా మరొక ఎస్ఎంఎస్ మొబైల్‌కు పంపిస్తామని ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దేవరాజన్ తెలిపారు. ఫిర్యాదు పరిష్కారం ఏ దశకు చేరిందనే అంశం తెలుసుకునే వ్యవస్థ ప్రస్తుతం లేదని ఆ సౌకర్యాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు, ధరణికి సంబంధించిన ఫిర్యాదులు పెద్ద సంఖ్యలో వస్తున్నట్టు ఆమె వెల్లడించారు. దీంతో డీప్యూటీ సీఎం రేషన్ కార్డులకు సంబంధించి ప్రభుత్వం సబ్ కమిటీ ఏర్పాటు చేసిందనీ, త్వరలో నిర్ణయం తీసుకుని కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. రేషన్ తీసుకునేందుకు, సంక్షేమ పథకాలు పొందేందుకు వేర్వేరుగా, గుర్తింపు కార్డులు ఇవ్వాలనే అంశంపై ప్రభుత్వంలో చర్చ జరుగుతుందనీ త్వరలోనే నిర్ణయం నిర్ణయం వెలువడుతుందని చెప్పారు. కొత్త పెన్షన్లను త్వరలో మంజూరు చేసే అవకాశం ఉందని తెలిపారు. మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు ఇస్తే ప్రయోజనం లేదనీ, వారికి శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందనీ, దానికోసం అవసరమైతే ఆర్థిక సాయం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అన్ని ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ డెస్కులను బలోపేతం చేస్తే సీఎంఆర్ఎఫ్‌కు సంబంధించిన ఫిర్యాదులు తగ్గిపోతాయని అధికారులకు సూచించారు. జీరో విద్యుత్ బిల్లు దరఖాస్తులు తీసుకునే మండల స్థాయి సిబ్బందికి శిక్షణ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని డిప్యూటీ సీఎం అధికారులకు తెలిపారు. బీహార్‌తో పాటు వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ పద్ధతులు ఆవలంభిస్తున్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు విజయవంతంగా పూర్తి చేసిన కొన్ని కేసుల గురించి సమావేశంలో దివ్య దేవరాజన్ వివరించారు.

తన వ్యవసాయ భూమిలో విద్యుత్ వైర్లు వేలాడుతున్న విషయాన్ని మహబూబ్‌నగర్‌కు చెందిన రైతు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా స్థానిక విద్యుత్ అధికారులు రెండు రోజుల్లోనే పరిష్కరించడం.. దానికి ఆ రైతు ఆనందంగా స్పందిస్తూ అధికారులను అభినందిస్తూ లేఖ రాసిన విషయాన్ని సమావేశంలో వివరించారు. ప్రజావాణి విభాగంలో పనిచేసేందుకు పూర్తిస్థాయి సిబ్బందిని కేటాయించాలనీ, మౌలిక సదుపాయాలు కల్పించాలని నోడల్ అధికారి కోరగా డిప్యూటీ సీఎం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మోడీ హామీ మేరకే సుప్రీం తీర్పు

- మాలలను అణగదొక్కాలని రేవంత్ రెడ్డి ప్లాన్
- నేడు ఛలో కలెక్టరేట్‌లు
- 7, 8, 9, 10 తేదీల్లో ఢిల్లీలో ధర్నా : ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రధాని నరేంద్రమోడీ ఇచ్చిన హామీ మేరకు, సుప్రీంకోర్టు వర్గీకరణ అనుకూల తీర్పునిచ్చిందని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అభిప్రాయపడింది. రాజకీయ ఒత్తిళ్లతో వచ్చిన ఆ తీర్పును స్వాగతించేది లేదని తేల్చి చెప్పింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాలల ద్రోహి అని ఆగ్రహం వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు తీర్పు రాకముందే ఆర్డినెన్స్ తెచ్చి వర్గీకరణ అమలు చేస్తామన్న రేవంత్ రెడ్డి రాజ్యాంగ విరుద్ధంగా అసెంబ్లీలో ప్రకటించడం వెనుక మాలలను అణగదొక్కాలనే కుట్ర ఉందని విమర్శించింది. దళితుల బతుకులు, ముఖ్యంగా మాలల జీవన స్థితిగతుల గురించి రాష్ట్ర శాసనమండలిలో విపులంగా మాట్లాడిన ఎమ్మెల్సీ గోరటి వెంకన్నకు కృతజ్ఞతలు తెలిపింది.

ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో పోరాట సమితి చైర్మెన్ సర్వయ్య, కో చైర్మెన్‌లు జి.చెన్నయ్య, రామచందర్, సుధీర్, బాలనాథం, గుడిమల్లె వినోద్, తాళ్ళపల్లి రవి, పాలడుగు శ్రీనివాస్, బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, బల్వంత్, రావుల విజయ్ కుమార్, సైదులు, బేరా బాలకిషన్, మేక వెంకన్న, పిల్లి సుధాకర్ తదితరులు మాట్లాడారు. ఎస్సీల వర్గీకరణకు వ్యతిరేకంగా ఆగస్టు ఐదున రాష్ట్రంలో ఛలో కలెక్టరేట్, ఆగస్టు 7, 8, 9, 10 తేదీల్లో నాలుగు రోజుల పాటు ఢిల్లీలో ఆందోళనలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అంశం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వచ్చిన డిమాండే తప్ప తెలంగాణలో అవసరం లేనిదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో మాదిగలు విద్య, ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి చెందారని, మాల, ఆ ఉపకులాలు పూర్తిగా నష్టపోయాయని తెలిపారు.


'భగ్గు' గనులు

(మొదటిపేజీ తరువాయి)

గనులకు వేలం ప్రక్రియను చేపట్టింది. పదో విడత బొగ్గు గనుల వేలంలో భాగంగా శ్రావణపల్లి గనిపై గురిపెట్టింది. ఇప్పటికే సత్తుపల్లి-3, కోయగూడెం గనులను ప్రయివేటుకు అప్పగించింది. వీటితో పాటు దేశంలోని ఒడిశాలో 16, మధ్యప్రదేశ్‌లో 15, ఛత్తీసగఢ్‌లో 15, జార్ఖండ్‌లో 6, బీహార్‌లో 3, బెంగాల్‌లో 3, మహారాష్ట్ర, తెలంగాణలోని ఒక్కో గనిని మోడీ ప్రభుత్వం వేలం వేస్తోంది. ఇప్పటివరకు 107 కోల్‌బ్లాక్‌లను వేలం వేశారు. ప్రభుత్వరంగంలో 130 ఏండ్లుగా ఏటా రూ.6లక్షల కోట్ల వార్షికాదాయంతో లాభాల బాటలో పయనిస్తున్న మన సింగరేణి చరిత్రను కూడా ఈ గనుల వేలంతో కేంద్రం కాలగర్భంలో కలపాలని చూస్తోంది.

సింగరేణి ప్రయివేటీకరణకు బీజం..

తెలంగాణ ప్రాంతంలో నైజాం కాలం నుంచి బొగ్గు నిక్షేపాలపై లీజింగ్ అనుమతి సింగరేణికే ఉంది. కానీ మైనింగ్ అనుమతి మాత్రం ఎప్పటికప్పుడు కేంద్రం నుంచి తీసుకుంటోంది. 1992-93 నుంచి బొగ్గు మంత్రిత్వశాఖ సింగరేణిని తమ ప్లానింగ్‌లో లేని బ్లాకుల వివరాలను అడిగింది. ఆ మేరకు సింగరేణి కేంద్రానికి వివరాలు ఇచ్చింది. తాను ఇచ్చిన బ్లాకులు తప్ప మిగతావన్నీ తమవే అనుకున్నది కానీ తన పేరుతో మాత్రం పెట్టుకోలేదు. కోల్ ఇండియా మాత్రం తన ప్లానింగ్‌లో లేని బ్లాకల వివరాలు ఇచ్చి మిగతావాటిని తన పేరుతో పెట్టుకుంది. ఈ నేపథ్యంలో ఎంఎండీఆర్ యాక్ట్ సవరణ జరుగుతున్నప్పుడు కోల్ ఇండియా బ్లాక్‌లను కోల్ ఇండియాకు ఇచ్చి, సింగరేణికి



మాత్రం అప్పటివరకు అనుమతి ఉన్న మైనింగ్ బ్లాక్‌లనే కేటాయించారు. మిగతా బ్లాక్‌లన్నింటినీ బొగ్గు మంత్రిత్వశాఖ తన దగ్గర పెట్టుకుంది. నాటి నుంచి సింగరేణి అనేక పర్యాయాలు గనుల కోసం దరఖాస్తు చేసుకున్నా ఆ మైన్స్‌ను వేలంలో కొనుక్కోవాలని కేంద్రం సూచిస్తోంది. ఫలితంగా సింగరేణికి కొత్త బావుల అనుమతి రావడం లేదు. సింగరేణికి కొత్త అనుమతులు రాకపోతే.. బ్లాక్‌లు కేటాయించకపోతే 2038 నాటికి మొత్తం 27 బావులు మూతబడి 12 గనులు మాత్రమే సింగరేణికి మిగులుతాయి. తద్వారా సంస్థ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుంది. తద్వారా వివిధ ప్రభుత్వ రంగ కంపెనీలకు సరఫరా చేసే బొగ్గు ధరలు పెరుగుతాయి. ఇప్పటికే సింగరేణి బొగ్గు టన్ను ధర రూ.3,900- 8000 వరకు లభిస్తుంటే.. ప్రయివేటు బొగ్గును రూ.8,000- రూ.13వేలకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఉంది.

ప్రయివేటీకరణతో ప్రయో'జనాల'కూ ఆటంకం..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సింగరేణి ద్వారా రూ.49,667 కోట్లు వివిధ పన్నుల రూపంలో లభిస్తున్నాయి. రాష్ట్రానికి రూ.23వేల కోట్లు, కేంద్రానికి రూ.26వేల కోట్ల ఆదాయం అందుతోంది. ఎన్టీపీసీ ద్వారా తక్కువ ధరకు విద్యుత్, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ పేరుతో రూ.3వేల కోట్లు, సీఎస్ఆర్ పేరుతో రూ.300 కోట్లు, సింగరేణి వినియోగించే ఇంధనం ట్యాక్స్‌ల ద్వారా నెలకు రూ.కోటి, హరితహారానికి రూ.4.60 కోట్లు, కోవిడ్ సందర్భంలో రూ.100 కోట్లు, రామగుండం మెడికల్ కాలేజీకి రూ.500 కోట్లు, భద్రాద్రి కరకట్టకు రూ.100 కోట్లు, సివిల్స్ రాసే అభ్యర్థులకు రాజీవ్‌గాంధీ అభయహస్తం పేరుతో ఒక్కొక్కరికి రూ.లక్ష ఇలా ఎన్నో ప్రజా ప్రయోజన కార్యాలను సింగరేణి నిర్వహిస్తోంది. ప్రయివేటీకరణతో ఈ ప్రజా ప్రయోజనాలకూ ఆటంకం కలుగుతుందని నేతలు హెచ్చరిస్తున్నారు.

నేటితో ముగియనున్న పరిరక్షణ యాత్ర

ఈనేపథ్యంలో సింగరేణి పరిరక్షణకు జులై 29న బెల్లంపల్లి కోల్‌బెల్ట్ నుంచి ప్రారంభమైన సీపీఐ(ఎం) యాత్ర సోమవారం కొత్తగూడెంతో ముగియనున్నది. ఖమ్మం జిల్లా పెనుబల్లి నుంచి సత్తుపల్లి వరకు ర్యాలీ నిర్వహిస్తారు. అనంతరం కొత్తగూడెంలో ముగింపు సభ జరుగుతుంది. ఈ యాత్రకు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు విజయరాఘవన్ హాజరుకానున్నారు. తాత్కాలికంగా యాత్ర ముగిసినా భవిష్యత్తు పోరాటాలు మాత్రం యథాతథంగా కొనసాగుతాయని ఆ పార్టీ నాయకత్వం స్పష్టం చేస్తోంది.

స్కూళ్లలో కారం మెతుకులు అమానుషం

- మాజీమంత్రి, ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం సరైన భోజనం లేక ఆకలితో ఉన్న విద్యార్థులు కారం, నూనెతో అన్నం కలుపుకుని కడుపు నింపుకున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు తెలిపారు. ప్రభుత్వం భావిభారత పౌరుల పట్ల ఇలా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం బాధాకరమని అన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించే సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అటకెక్కించిందనీ, ఇప్పుడు మధ్యాహ్న భోజనం అందించడంలో తీవ్రంగా విఫలమైందని విమర్శించారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి భోజన సామాగ్రి బిల్లులు, కుక్ కమ్ హెల్పర్ల వేతనాలు పెండింగ్ ఉండటం వల్ల విద్యార్థులకు సరైన భోజనం అందడం లేదన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు.

వాయనాడ్ బాధితులకు సహాయం

- తెలంగాణ తమిళ్ క్యాథలిక్ సభ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వాయనాడ్ ప్రకృతి వైపరీత్య బాధితులకు సహాయం చేయాలని తెలంగాణ తమిళ్ క్యాథలిక్ సభ నిర్ణయించింది. ఆదివారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో సభ నాయకులు ఆండ్ర్యూ, రాజన్, జె.షర్మిల, మోజెస్ దాస్, అరోకామేరీ తదితరులు సమావేశమయ్యారు. వాయనాడ్ దుర్ఘటనలో మరణించిన వారికి సంతాపం ప్రకటించారు. బాధితులకు ప్రతి ఒక్కరు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. క్రైస్తవులపై, వారి ప్రార్థనా మందిరాలపై జరుగుతున్న దాడులను సమావేశం తీవ్రంగా ఖండించింది.

యువకుడు అదృశ్యం



నవతెలంగాణ -నాగోల్

ఓ యువకుడు అదృశ్యమైన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాగోల్ సీఐ సుధీర్ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నాగోలు డివిజన్ పరిధిలోని సాయి నగర్ కాలనీకి చెందిన కైరం కొండ వివేక్..ఈనెల 2న మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో షేర్ మార్కెట్ ట్రేడింగ్‌కు బైకుపై కొత్తపేటలో ఉన్న తన స్నేహితుడి వద్దకు ఇంటి నుండి బయలుదేరి వెళ్లాడు. కానీ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆ యువకుడి తల్లి కైరం కొండ మాలతి అతని స్నేహితులు, బంధువుల వద్ద వెతికిన ఫలితం లేకపోయింది. వెంటనే ఆమె నాగోల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

హయత్ నగర్ మండలానికి నూతన ఎంఈఓగా శ్రీనివాస్



నవతెలంగాణ-హయత్ నగర్

గత కొంత కాలం నుండి మండల విద్యాధికారికి పదోన్నతులు, బదిలీలు లేకపోవడంతో హయత్ నగర్ మండలానికి 15సంవత్సరాల నుండి హీర్యా నాయక్ విధులు నిర్వహించారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా హయత్ నగర్‌లో పనిచేసిన హీర్యా నాయక్ ఇబ్రాహీం పట్నంకు బదిలీ అయ్యారు. నాగర్ కర్నూలు జిల్లా, తిమ్మాజీ పేట మండలంలో పనిచేసిన శ్రీనివాస్ హయత్ నగర్ మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించారు.

ఎస్సీ వర్గీకరణతో సమన్యాయం : మల్లెపాక మల్లేష్



నవతెలంగాణ - పెద్ద అంబర్‌పేట్

ఎస్సీ వర్గీకరణతో సమన్యాయం జరిగిందని ఆర్కేనగర్ మాజీ కౌన్సిలర్ మల్లెపాక మల్లేష్ అన్నారు. ఆదివారం తట్టిఖానా గ్రామం ఆర్కేనగర్‌లో స్థానిక మాదిగలతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంబేద్కర్ ఆశయ సాధనకు మందకృష్ణ పోరాటంలో భాగంగా సుప్రీంకోర్టు తీర్పును ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంద్రాల రామ నర్సయ్య, కత్తుల బిక్షపతి, చిలుక నాగమ్మ, బొల్లెద్ల వెంకటయ్య, జాలిగామ మోహన్, కాస్మోన్ ఆంజనేయులు, సుక్క నరసింహ, గడ్డం లక్ష్మీ, గడ్డం లింగయ్య, పల్లెర్ల జగన్,కొమ్ము శీను, గంధమాల రమేష్, జై భీమ్ ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ సలహాదారులు బలుగులఎల్లేష్, అధ్యక్షులు గంగారపు బిక్షపతి, ఉపాధ్యక్షులు కొంపల్లి బిక్షపతి, సందేన శ్రీహరి ,ట్రెజరర్ బొచ్చు కుమార్, సభ్యులు కొంపల్లి నరసింహ, సూర్య ప్రకాష్, ఏడాకులపల్లి శ్రీనివాస్, మహంకాళి సోమన్న, గంధమాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరస్తు బార్ అండ్ రెస్టారెంట్, హోటల్ మూసివేత





నవతెలంగాణ - వనస్థలిపురం

వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓంకార్ నగర్‌లో ఉన్న శ్రీరస్తు బార్ అండ్ రెస్టారెంట్, హెటల్ ప్రాంగణాన్ని (బొమ్మరిల్లు కాంప్లెక్స్) సీపీ సుధీర్ బాబు ఐపీఎస్ ఆదేశానుసారం, ఎస్హెచ్ఓ వనస్థలిపురం విజ్ఞప్తి మేరకు, సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్ కందుకూరు మూసివేశారు. పగలు, రాత్రి తేడా లేకుండా విచక్షణారహితంగా, ఎలాంటి ధృవ పత్రాలు లేకుండా హెటల్ గదులలో కస్టమర్లను మద్యం సేవించడానికి అనుమతిస్తూ చట్ట వ్యతిరేక చర్యలను ప్రోత్సహిస్తుందని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ శ్రీరస్తు బార్ అండ్ రెస్టారెంట్, హెటల్ ప్రాంగణాన్ని (బొమ్మరిల్లు కాంప్లెక్స్) ను మూసివేశారు. సాధారణ ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా వ్యవహరించే వారిని, అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కొనసాగించే వారిని, హెటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్ లు, ఇతర ప్రాంగణాలలో అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్స హించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని సీపీ సుధీర్ బాబు ఐపీఎస్ హెచ్చరించారు. కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు, సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు రాచకొండ కమిషనరేట్ పోలీసులు అహర్నిశలు కృషి చేస్తున్నారని కమిషనర్ పేర్కొన్నారు.

ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా వినోద్ నాయక్



నవతెలంగాణ-పెద్ద అంబర్‌పేట్

రంగారెడ్డి జిల్లా ఏఐఎస్ఎఫ్ నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం నుంచి విద్యార్థి నాయకుడు వినోద్ నాయక్‌ను ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికల పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పేదల భూమి పేదలకే ఇవ్వాలని వినతి

- సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జగదీశ్, బాలాపూర్ మండల కార్యదర్శి ఎం.యాదయ్య





నవతెలంగాణ- బడంగ్‌పేట్

పేద రైతుల భూములను పేదలకు దక్కే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జగదీశ్, బాలాపూర్ మండల కార్యదర్శి ఎం.యాదయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ గ్రామంలోని సర్వే నెంబర్ 613(119) ప్రభుత్వ భూమిని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం 70 సంవత్సరాల కిందట పంపిణీ చేయడం జరిగిందని గుర్తుచేశారు. ఆ భూమిని కొందరు కబ్జా చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఆ భూమిని 70 సంవత్సరాలుగా 100మంది భూమి లేని పేద రైతులు సాగుచేసుకొని జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆ భూమి ఇంకా రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగానే ఉందని, ఇటీవల కొందరు వ్యక్తులు కబ్జా చేసుకునేందుకు ఈ భూమి మాదని లబ్దిదారులను బెదిరింపులకు గురి చేస్తూ.. వ్యవసాయం చేయకుండా అడ్డుపడుతున్నారని మండి పడ్డారు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యంలో గరిష్ట భూ పరిమితి చట్టం 1973ప్రకారం పేద ప్రజలకు ఆ భూమిని పంపిణీ చేశారని చెప్పారు. గత తెలంగాణ ప్రభుత్వం సహకారంతో కొందరు.. రైతులను బెదిరించి, ప్రలోభాలకు గురిచేసి భయపెట్టి భూములను స్వాధీనం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే రైతులకు నష్ట పరిహారం ఇస్తామని కాగితాలపై రైతులచే సంతకాలు చేయించుకొని కొందరు వ్యక్తులు కబ్జా చేసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. తరతరాలుగా భూమిని సాగుచేస్తున్న రైతులను అందులో వ్యవసాయం చేయకుండా అడ్డు పడుతున్నారని, అలాంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. పేదలకు ఆ భూమిపై హక్కు కల్పించాలని డిప్యూటీ సీఎంను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసరి బాబు, అంకంగారి శశిపాల్, భూ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా వంశీ వర్ధన్ రెడ్డి





నవతెలంగాణ-హయత్‌నగర్

ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా సామిడి వంశీ వర్ధన్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజేందర్ నగర్ ఏ ఆర్ దేవరాజ్ భవన్ లో జరిగిన నిర్మాణ కౌన్సిల్‌లో జిల్లా అధ్యక్షుడిగా పవన్, ప్రధాన కార్యదర్శిగా సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా బి.అరుణ్, పి వినోద్, బి. వినోద్ తో పాటు మొత్తం 21 మంది సభ్యులతో కౌన్సిల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వంశీ వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో 6 మండలాల్లో మాత్రమే కమిటీలు ఉన్నాయని, భవిష్యత్‌లో అన్ని మండలాల్లో కమిటీలతో పాటు ఏఐఎస్ఎఫ్‌ను బలోపేతం చేస్తామన్నారు. గవర్నమెంటు స్కూల్, కాలేజీల్లో మౌలిక వసతులతో పాటు, నాణ్యమైన విద్య తదితర సమస్యలపై పోరాడుతామని పేర్కొన్నారు. అనంతరం తనను జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్న జిల్లా పార్టీ నాయకత్వానికి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

కళాకారుల త్యాగ ఫలితమే తెలంగాణ

- ప్రజా నాట్యమండలి రంగారెడ్డి జిల్లా నిర్మాణ బాధ్యులు ముత్యాల యాదిరెడ్డి



నవతెలంగాణ-పెద్ద అంబర్ పేట

ప్రజానాట్యమండలి కళాకారుల త్యాగ ఫలితమే ప్రత్యేక తెలంగాణ ఏర్పడిందని ప్రజా నాట్యమండలి రంగారెడ్డి జిల్లా నిర్మాణ బాధ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజా నాట్యమండలి అబ్దుల్లాపూర్మెట్ మండలం నిర్మాణ మహాసభ ఆదివారం రావి నారాయణరెడ్డి కాలనీ ఫేస్ 2 సీపీఐ కార్యాలయంలో ముచ్చపోతు రాము అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ప్రజానాట్యమండలి రంగారెడ్డి జిల్లా నిర్మాణ బాధ్యులు ముత్యాల యాదిరెడ్డి, ప్రజానాట్యమండలి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వేణుగోపాల చారి హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదిరెడ్డి మాట్లాడుతూ ప్రజా నాట్యమండలి కళాకారుల త్యాగం వల్లనే తెలంగాణ ఏర్పడిందని, కళాకారులు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందుండి తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రముఖ పాత్ర వహించారని, వారి సేవలు ఎనలేనివని కొనియాడారు. ముందు జరిగే ప్రజా పోరాటాలలో పాటలతో, కళారూపాలతో ప్రజలను చైతన్యపరిచి ముందుకు తీసుకెళ్లాలని, దానికి మా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. అనంతరం వేణుగోపాల చారి మాట్లాడుతూ ఈ నెల 7న రవీంద్రభారతిలో జరిగే ప్రజా కలల పండుగ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాకారులు పాల్గొని మీ మీ కళారూపాలు ప్రదర్శించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కళాకారులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్ కార్డులు, వృద్ధాప్య పెన్షన్లు ఇవ్వాలని కోరారు. రంగారెడ్డి జిల్లాలో కూడా మినీ రవీంద్ర భారతి, ఓపెన్ ఆడిటోరియం నిర్మించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

ప్రజానాట్యమండలి నూతన మండల కమిటీ ఎన్నిక..

ప్రజానాట్యమండలి అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షులుగా సీకిరాల శేఖర్, ఉపాధ్యక్షులుగా రానింగు సరస్వతి, ప్రధాన కార్యదర్శిగా ముచ్చపోతు రాము, సహాయ కార్యదర్శిగా దాసరి భాస్కర్, కోశాధికారిగా పగడాల మహేందర్ మరియు దాదిమల్ల నారాయణ, రామ్ చందర్, పోచయ్య, గడ్డం నరసింహ, మారేడు మధు, ముచ్చపోతు భాస్కర్, ఆమనగంటి లింగం, అంజి, మల్లేష్, వెంకన్న, విజయ్ తదితర కార్యవర్గ సభ్యులతో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పలు చోట్ల బోనాల ఉత్సవాలు



నవతెలంగాణ-నాగోల్

బోనాల పండుగ సందర్భంగా నాగోల్‌లోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస గుప్తా, ఆయన సతీమణి ఐవీఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్నతో కలిసి ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు. తర్వాత ఒడి బియ్యం పోశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఐవీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- నాగోల్



బోనాల పండుగ సందర్భంగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి నాగోల్ డివిజన్ పరిధిలోని మహంకాళి, పోచమ్మ దేవాలయంలో నిర్వహించిన బోనాల వేడుకలకు ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా మహంకాళి పోచమ్మ అమ్మవారిని దర్శించుకొని, పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆనంతుల రాజిరెడ్డి, మాజీ కార్పొరేటర్ చెరుకు సంగీత ప్రశాంత్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు చిరంజీవి, కట్ట ఈశ్వరయ్య, పల్లె సీతారాములు, కొలన్ నర్సింహా, చెరుకు ప్రవీణ్ గౌడ్, బద్దం నరేందర్ గౌడ్, రంజిత్, నవ చైతన్య యువజన సంఘం కార్యవర్గ సభ్యులు, దేవాలయం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- వనస్థలిపురం



బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని పద్మావతి బ్యాంక్ కాలనీ, పద్మావతి బ్యాంక్ ఎంప్లాయిస్ కాలనీ, సాహెబ్ నగర్ బతుకమ్మ కుంట, సాహెబ్ నగర్, శ్రీ శ్రీనివాస కాలనీ, విజయపూర్ కాలనీ ఫేస్ 1లలో నిర్వహించిన బోనాల పండుగకు ఆదివారం కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్సీ సెల్ సెక్రెటరీ దుర్గాప్రసాద్, వివిధ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ - హస్తినాపురం

తెలంగాణ రాష్ట్రం సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అని వేద పాఠశాల కరస్పాండెంట్ సంకల్ప్ అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని వేద పాఠశాలలో ఆదివారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాల పట్ల అవగాహన కల్పించే విధంగా పాఠశాలలో ఉత్సవాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దీప, అధ్యాపకులు సురేష్, కృష్ణ, ప్రియాంక పాల్గొన్నారు.

నవతెలంగాణ - హస్తినాపురం




బోనాల పండుగ నేపథ్యంలో హస్తినాపురం డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో జరిగిన ఉత్సవాలలో స్థానిక కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో రాజుగౌడ్, భాస్కర్ నాయక్, రఘు పాల్గొన్నారు.

నవతెలంగాణ -నాగోల్



బోనాల పండుగ నేపథ్యంలో నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ ఆహ్వానం మేరకు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ విచ్చేసి.. నాగోల్‌లోని పోచమ్మ ఆలయంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. తర్వాత ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామా రంగారెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహ రెడ్డి, బీఎన్ రెడ్డి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, గడ్డిఅన్నారం కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, కొత్తపేట కార్పొరేటర్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-వనస్థలిపురం



వనస్థలిపురం డివిజన్ పరిధిలోని చింతలకుంట కాలనీలో వేములయ్య గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల పండుగకు ఆదివారం కార్పొరేటరు రాగుల వెంకటేశ్వరరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవాలలో కనకదుర్గ కమిటీ చైర్మెన్ వేములయ్య గౌడ్ కిరణ్ కుమార్ గౌడ్, సంతోష్, కోలన్ శ్రీనివాస్, లాగోని శ్రీధరు గౌడ్, వైశ్యాసవిద్యాధర్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- బడంగ్ పేట్



మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడలో కార్పొరేటర్లు గడ్డం లక్ష్మారెడ్డి, దడిగ శంకర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బోనాల పండుగ ఉత్సవాలకు కేంద్ర మంత్రి బండి సంజయ్, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షులు బొక్క నర్సింహా రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్‌లు హాజరై అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మద్ది రాజ శేఖర్ రెడ్డి, గంగిడి మనోహర్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్ రెడ్డి, కార్పొరేటర్ ఇంద్రసేన, రామిడి మాధురి వీర కర్ణరెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- నాగోలు



నాగోల్ డివిజన్‌లోని మైసమ్మ, మహంకాళి, పోచమ్మల దేవాలయాల్లో ఆదివారం బోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మాల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్, ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస గుప్తా, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేందర్ నాథ్ యాదవ్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అనంతుల రాజిరెడ్డిలతో పాటు పలువురు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



బండ్లగూడలో బోనాలతో వెళ్తున్న మహిళలు

వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ



నవతెలంగాణ - చైతన్యపురి

రామకృష్ణాపురం డివిజన్‌లోని ఎన్టీఆర్ నగర్ కూరగాయల మార్కెట్, గడ్డి అన్నారంలో సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో కేరళ వయనాడ్ బాధితుల కోసం ఆదివారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా సీపీఐ(ఎం) పార్టీ కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. చంద్రమోహన్ మాట్లాడుతూ ప్రకృతి విపత్తు వల్ల వయనాడ్‌లో వందల మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణ నష్టంతో పాటు ఆస్తి నష్టం కూడా అధికంగా జరిగిందని అన్నారు. వారిని ఆదుకునేందుకే సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో విరాళాలు సేకరిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సరూర్ నగర్ సర్కిల్ సీపీఐ(ఎం) పార్టీ కార్యదర్శి సి హెచ్ వెంకన్న, సర్కిల్ కమిటీ సభ్యులు ఎం వీరయ్య, కే శ్రీనివాస్, ఎం గోపి నాయక్, జి మనోహర్, జి చైతన్య, కె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తుర్కయంజాల్

భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ తుర్కయంజాల్ మున్సిపాలిటీ సమితి ఆధ్వర్యంలో కేరళ వయనాడ్ బాధితుల కోసం ఆదివారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ.. భారత కమ్యునిస్టు పార్టీ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా వరద బాధిత ప్రజలకు సహాయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్నామని అన్నారు.



తుర్కయాంజల్ లో స్థానిక ప్రజల నుండి, షాప్‌లు, చిన్న చిన్న వ్యాపారస్తుల నుండి డబ్బులు సేకరిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు పి శివకుమార్, శ్రీకాంత్, సుందరమ్మ, లక్ష్మి, బోడి, గండికోట శివ, దీప్లా నాయక్, కోట్య, నాగేశ్వర్, ఆటో యూనియన్ నాయకులు చెక్క యాదగిరి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ శరణాలయంలో జడ్జి కూతురు పుట్టినరోజు వేడుకలు

నవతెలంగాణ - హయత్‌నగర్

అనాథశరణాలయంలో జడ్జి కూతురు (మొదటి సంవత్సరం) పుట్టినరోజు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. నాంపల్లి కోర్టులో జడ్జిగా పనిచేస్తున్న మొహమ్మద్ గౌస్ పాషా కూతురు అయేషా మొదటి జన్మదిన సందర్భంగా హయత్ నగర్‌లోని సుధీర్ ఫౌండేషన్‌లో 140 మంది పిల్లలతో కలిసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానంతోపాటు పండ్లు, ఫ్రూటీలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్జి కుటుంబంతో పాటు, రంరారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ, సెల్ అధ్యక్షులు గంటా శ్రావన్, అంకె ప్రశాంత్, బొలుగురి అభిలాష్, సాయి, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా బోనాల వేడుకలు



నవతెలంగాణ-మల్కాజిగిరి,నేరేడ్‌మెట్

మల్కాజిగిరి పరిధిలోని చంద్రగిరి కాలనీలో గంగపుత్రుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల వేడుకలకు మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ కుమార్, వినాయక్ నగర్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా బోనాల ఊరేగింపును జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాజ్య లక్ష్మి, సునీతా యాదవ్, వెంపటి రాజు, నవీన్, పెద్ద ఎత్తున గంగపుత్ర సంఘం నాయకులు పాల్గొన్నారు.

నిజాన్ని నిర్భయంగా రాసే పత్రిక నవ తెలంగాణ



నవతెలంగాణ-ఘట్కేసర్

నిజాన్ని నిర్భయంగా రాసే పత్రిక నవ తెలంగాణ పత్రిక అని సహకార సంఘం బ్యాంక్ డైరెక్టర్ బీసీ సంక్షేమ సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గోపు బాలరాజ్ యాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని కొర్రెముల గ్రామంలో బోనాల పండుగను జరిపారు. అనంతరం నవ తెలంగాణ 9వ వార్షికోత్సవం సందర్భంగా గోపు బాలరాజు యాదవ్ సంస్థకు జాకెట్ యాడ్ ప్రచురించిన సందర్భంగా జాకెట్ ఆడును ఆయన ప్రారంభించారు. వార్షికోత్సవం సందర్భంగా పత్రిక విలేకరులకు, యాజమాన్యానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యాదవ రెడ్డి, లింగయ్య యాదవ్, సంజీవ ముదిరాజ్, రమేష్ యాదవ్, మహేష్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, గోపాల్ రెడ్డి, శంకర్ యాదవ్, నరసింహ యాదవ్, జంగయ్య యాదవ్, కుమార్ యాదవ్, శివకృష్ణ యాదవ్, బబ్బీ చింటూ తదితరులు పాల్గొన్నారు.

పీర్జాదిగూడలో వైభవంగా బోనాలు



- పాల్గొన్న మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి

నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన బోనాల వేడుకలో మేడ్చల్ శాసన సభ్యులు చామకూర మల్లారెడ్డి, మేయర్ జక్క వెంకట్ రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అంతకుముందు మేయర్ కుటుంబ సమేతంగా అమ్మవారికి బోనాలు సమర్పించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా పీర్జాదిగూడలో బోనాల పండుగ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. ప్రజలంతా కులమతాలకు అతీతంగా ఎంతో సంతోషంగా బోనాల పండుగను జరుపుకుంటున్నారని, అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రజలంతా సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే మల్లారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మన ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలను భావితరాలకు అందజేసే విధంగా అందరూ కలిసికట్టుగా బోనాలను కొనసాగించడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, మధుసూదన్ రెడ్డి, దొంతిరి హరిశంకర్ రెడ్డి, నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి రఘువర్ధన్ రెడ్డి, జావేద్ ఖాన్, మహిళా అధ్యక్షురాలు నిర్మల,యూత్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, అంజనేయులు, శంకర్ రావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థ నగర్‌లో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని సిద్ధార్థనగర్‌లో మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్ కాలనీ వాసులతో కలిసి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా సీసీ రోడ్లు, చెట్ల ట్రిమ్మింగ్, కరెంట్ తీగల సవరణ తదితర సమస్యల ఆయా కాలనీ ప్రజలు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఇంజనీరింగ్ ఈఈ లక్ష్మణ్‌కు సీసీ రోడ్డు నిర్మాణం గురించి, యాదగిరికి కరెంట్ తీగల గురించి, మహేశ్వరికి చెట్ల ట్రిమ్మింగ్ సమస్యలు పరిష్కరించాలని ఫోన్‌లో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ నగర్ కాలనీ అధ్యక్షులు రవీందర్, శ్రీనివాస్, రాజు, వెంకటేష్, హరి, నవీన్, ప్రభు, జహంగీర్ పాల్గొన్నారు.

ఘనంగా బిట్స్ పిలానీ స్నాతకోత్సవం



- 1600 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం

నవతెలంగాణ- జవహర్ నగర్

బిర్లా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ పిలానీ, హైదరాబాద్ క్యాంపస్‌లో స్నాతకోత్సవ వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2024లో పట్టభద్రులైన 1600 మంది విద్యార్థులకు బిట్స్ పిలానీ ఆడిటోరియంలో డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు, బోధన, బోధనేతర సిబ్బంది హాజరు కావడంతో ఆడిటోరియం ప్రతిధ్వనించింది. ముఖ్యతిథిగా బఫెలో విశ్వవిద్యాలయం అధ్యక్షుడు ప్రొఫెసర్ సతీష్ కె. త్రిపాఠి హాజరయ్యారు. బిట్స్ పిలానీ ఉపకులపతి ప్రొఫెసర్ వి. రాంగోపాల్ రావుతో పాటు, బిట్స్ పిలానీ ఉన్నతాధికారులు, సెనేట్ సభ్యులు పాల్గొన్నారు. ఈ స్నాతకోత్సవంలో మొదటి డిగ్రీ, ఉన్నత డిగ్రీ, పీహెచ్‌డీ స్థాయిలో 1600 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. అత్యుత్తమ ప్రతిభను కనపరిచిన మొదటి డిగ్రీ విద్యార్థి సాత్విక్ సర్దేశాయ్‌కు బంగారు పతకం లభించింది. 2024 గాను 2 బిట్స్ రత్న అవార్డులు, 12 విశిష్ట పూర్వ విద్యార్థి అవార్డులు, 6 విశిష్ట సేవా పురస్కార అవార్డులు, 10 యువ సాధకుల అవార్డులు, వెరసి 30 పూర్వ విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం చేశారు. బిట్స్ పిలానీ కులపతి డాక్టర్ కుమార్ మంగళం బిర్లా, స్ఫూర్తిదాయకమైన వ్యక్తులైన ఎన్విడియా వ్యవస్థాపకుడు, జెన్సన్ హువాంగ్, పరోపకారి, చార్లీ ముంగెర్, మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల లాంటి ప్రముఖులను ఉదాహరణగా పేర్కొన్నారు. అవకాశలు, జీవితకాలపు శిక్షణ, నెట్వర్కింగ్ ద్వారా సమ్మిళతమైన వృత్తిపరమైన విధానాలను అలవర్చుకొని అవకాశాలను అందిపుచ్చుకొని మారుతున్న ప్రపంచాభివృద్ధికి అనుగుణంగా అడుగులు వేయాలని పట్టభద్రులైన విద్యార్థులకు సూచించారు. ఉపకులపతి, ప్రొఫెసర్ వి. రాంగోపాల్ రావు మాట్లాడుతూ.. అత్యంత గొప్ప బిట్స్ పిలానీ వారసత్వం, దాని పరిశోధనలలో పొందుపరిచిన భవిష్యత్తును, సహకారం, ఆవిష్కరణలను గుర్తు చేశారు. వారసత్వాన్ని ముందుకు తీసుకు వెళ్లాలని విద్యార్థులను ఆయన కోరారు. ప్రొఫెసర్ సౌమ్య ముఖర్జీ, డైరెక్టర్, హైదరాబాద్ క్యాంపస్, 2023-24 సంవత్సరానికి సంబంధించిన క్యాంపస్ డెవలప్మెంట్ రిపోర్టును సమర్పించి, విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు. ముఖ్యతిథి ప్రొఫెసర్ సతీష్ త్రిపాఠి తన మాట్లాడుతూ.. విద్యార్థులు సాధించిన విజయాలను కొనియాడారు. వారి విద్యా ప్రయాణంలో కృషి, అంకితభావం, విజయాలను ఎత్తి చూపారు. బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్ పట్టభద్రులైన విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షిస్తూ స్నాతకోత్సవం విజయవంతముగా ముగిసింది.

దైవదర్శనానికి వెళ్లొచ్చే సరికి ఇల్లు లూటీ



నవతెలంగాణ - జవహర్ నగర్

దైవదర్శనానికి వెళ్లి వచ్చేసరికి ఇల్లు లూటీ చేసిన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దమ్మాయిగూడ నరసయ్య కాలనీలో నివాసం ఉంటున్న జితేందర్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం వేములవాడ దైవదర్శనం కోసం వెళ్లారు. శనివారం అర్ధరాత్రి ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటికి వేసిన తాళం పగలగొట్టి, ఇల్లు గుల్ల చేసి, బీరువాలో దాచిన ఆరు తులాల బంగారం దోచుకెళ్లారు. దీంతో బాధిత కుటుంబ సభ్యుల సమాచారం మేరకు ఆదివారం సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రిక్త 'హస్తం'..!

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు ప్రాధాన్యత కరువు
- నామినేటెడ్ పోస్టుల్లోనూ జిల్లాకు మొండి చేయి
- నిరాశలో ఆశావహులు.. నైరాశ్యంలో పార్టీ నేతలు..!

నవతెలంగాణ-సిటీబ్యూరో

'గతమెంతో ఘనం.. ప్రస్తుతం అంతా శూన్యం' అన్నట్టుగా తయారైంది మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిస్థితి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లాకు దక్కిన ప్రాధాన్యత, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో దక్కడం లేదనే విమర్శలు వస్తున్నాయి. అధికార పార్టీ నుంచి ఒక్క ప్రజాప్రతినిధి కూడా లేకపోగా.. నామినేటెడ్ పోస్టుల్లోనూ జిల్లాకు మొండి చెయ్యే మిగిలింది. కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాను గుర్తించకపోవడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది.

తెలంగాణలో తమ ప్రభుత్వం తొలిసారి ఏర్పడటంతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నాయి. గ్రేటర్‌లో భాగమైన తమ జిల్లాకు ప్రాధాన్యత దక్కుతుందని పార్టీ శ్రేణులంతా భావించాయి. కానీ వీరికి నిరాశే మిగిలింది. జిల్లాలో మేడ్చల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు మల్కాజిగిరి ఎంపీ నియోజకవర్గం ఉంది. ఒక్క అధికార పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ కూడా లేరు. దీనికి తోడు అధికార పార్టీ ఇటీవల ప్రకటించిన 34 కార్పొరేషన్ చైర్మెన్ పదవుల్లో జిల్లా నాయకులకు ఒక్క పదవి కూడా దక్కకపోవడం చర్చనీయాంశమైంది. జిల్లాకు కాంగ్రెస్ 'హ్యాండ్' ఇవ్వడంతో స్థానిక నేతలు నిట్టూరుస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నా.. జిల్లాలో అధికార పార్టీకి ఒక్క ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ, నామినేటెడ్ పోసుల లేకపోవడంతో కాంగ్రెస్ క్యాడర్ నిరాశతో ఉన్నట్టు సమాచారం. ఐదు నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన నాయకులు మినహా చాలా మంది టికెట్ ఆశించి భంగపడ్డ వారే ఉన్నారు. పార్టీని నిలబెట్టేందుకు పని చేస్తున్నా.. ప్రభుత్వంలో కనీసం గుర్తింపు ఇవ్వడం లేదని పార్టీ శ్రేణులు ఆవేదన చెందుతున్నట్టు తెలుస్తోంది. దీనికితోడు ఉమ్మడి జిల్లాల పరంగా పదవుల పంపకం జరుగుతుండటంతో తమకు అవకాశాలు దక్కడం లేదని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధికార పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం నెలకొంది.

పడిలేచిన పార్టీ..

సీనియర్లంతా పార్టీని వీడటంతో జిల్లాలో కాంగ్రెస్ పరిస్థితి దయనీయంగా తయారైంది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీలో మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మెన్ శరత్‌చంద్రారెడ్డితోపాటు మరికొంత మంది నేతలు చేరడంతో మళ్లీ ఆశలు రేకెత్తాయి. వారంతా క్రమంగా పార్టీని నిలబెడుతూ ఎన్నికల్లో బలంగానే తలపడ్డారు. అయినా ఐదు అసెంబ్లీ స్థానాల్లో పార్టీ ఓటమి పాలైంది. ఇక ఎన్నికల అనంతరం పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో చేరికల జోరు పెరిగింది. అసెంబ్లీ పోరులో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌తోపాటు చాలా మంది



ప్రజాప్ర తినిధులు, మాజీలు, సీనియర్లు హస్తం పార్టీలో చేరారు. పార్లమెంట్ ఎన్నికల్లో బలంగా పోరాడటంతో అధికార కాంగ్రెస్ ద్వితీయ స్థానంలో నిలిచింది.

జిల్లాకు దక్కని ప్రాధాన్యత

పదేండ్లపాటు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు జిల్లాలో కాంగ్రెస్ దయనీయ స్థితికి చేరింది. ఏండ్లుగా పార్టీని నమ్ముకున్న వారు మినహా మిగతా వారంతా హస్తాన్ని వదిలి వెళ్లారు. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు అండగా ఉన్న తమకు ఏదైన అవకాశం కల్పించాలని కోరారు. అలాగే పార్టీ దయనీయ స్థితిలో ఉన్నప్పుడు వచ్చి మళ్లీ పూర్వవైభవం తీసుకొవచ్చేందుకు కృషి చేసిన తమనూ చూడాలంటూ కొత్తనేతలూ పదవులు ఆశించారు. కొంతకాలంగా ఊరించిన కార్పొరేషన్ పదవుల్లో జిల్లాకు ఒక్కటైనా దక్కుతుందని అందరూ భావించారు. కానీ.. ఉమ్మడి జిల్లాలో భాగంగా రంగారెడ్డి జిల్లాకు మూడు పోస్టులు ఇచ్చిన అధిష్టానం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు మాత్రం ఒక్క పోస్టు కూడా ఇవ్వలేదు. దీంతో నిరాశలో ఆశావహులు.. నైరాశ్యంలో పార్టీ శ్రేణులు.. నారాజ్‌లో పార్టీ సీనియర్లు ఉన్నట్టు చర్చ నడుస్తోంది. నియోజకవర్గ స్థాయి నాయకులకు ప్రభుత్వంలో అవకాశం కల్పించి అధికార కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తే ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పనులను మరింతగా ప్రజలకు వద్దకు తీసుకెళ్లే అవకాశం ఉంటుందని కార్యకర్తలు అభిప్రాయ పడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నామినేటెడ్ పోస్టుల భర్తీతో ఇతర జిల్లా నాయకులను న్యాయం చేసినా.. మేడ్చల్-మల్కాజిగి జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఒక్క నాయకుడికీ పదవి దక్కకపోవడంతో నాయకులతో పాటు పార్టీ క్యాడర్ ఒక్క సారిగా నైరాశ్యంలోకి వెళ్లినట్టు సమాచారం.

నిరాశలో ఆశావహులు

మేడ్చల్ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరుపున పోటీ చేసిన వజ్రేష్‌యాదవ్ ఓడిపోగా.. టికెట్‌ను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు హరివర్దన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, సీనియర్ నాయకులు నక్కా ప్రభాకర్‌గౌడ్ ఆశించి భంగపడ్డారు. నామినేటెడ్ పదవల్లోనూ వీరికి ప్రాధాన్యత లభించకపోవడంతో నిరుత్సాహపడ్డట్టు వినికిడి. ఇక కుత్బుల్లాపూర్‌లో భూపతిరెడ్డి, జ్యోత్స్న శివారెడ్డి ఆశపడ్డ ఎమ్మెల్యే టికెట్ హనుమంత రెడ్డికి దక్కగా.. ఆయన ఓడిపోయారు. ఎన్నికల తర్వాత మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ పార్టీలో చేరినా.. నామినేటెడ్ పదువి కోసం ఆశపడ్డ ఏ ఒక్క నాయకుడికీ పదవి దక్కలేదు. ఇక కూకట్‌పల్లి ఎమ్మెల్యే టికెట్ రమేష్‌కు దక్కగా.. సత్యం శ్రీరంగం నామినేటెడ్ పోస్టుపై ఆశలు పెట్టుకున్నా.. ఆయనకు స్థానం దక్కలేదు. ఉప్పల్‌లో పదవులు ఆశిస్తున్న వారు పెద్దగా ఎవరూ లేరు. ఇక మల్కాజిగిరిలో మైనంపల్లి హనుమంతరావు ఓడిపోయినా.. ఎమ్మెల్సీతో మంత్రి అయి జిల్లాలో చక్రం తిప్పుతారని పార్టీ శ్రేణులు, ఆయన అనుచరులు చెబుతున్నారు.

పలు ఆలయాల్లో ఎమ్మెల్యే పూజలు



నవతెలంగాణ-ఉప్పల్

ఆషాఢ మాస బోనాలను పురస్కరించుకొని చిల్కానగర్ డివిజన్‌లోని బొడ్రాయి ప్రాంతంలో మరల మైసమ్మ ఆలయంలో, కుమ్మరి కుంట పోచమ్మ ఆలయంలో, సాయిరాం నగర్ మజ్జి గౌరమ్మ ఆలయంలో, కల్యాణపూరిలోని ఇందిరానగర్, అంబేద్కర్ నగర్, పోచమ్మ ఆలయంలో, శ్రీనగర్ కాలనీలోని అమ్మవారి ఆలయాల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రత్యేక పూజలు చేశారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఏదుల కొండల్ రెడ్డి, మాస శేఖర్, చేర్యాల శ్రీనివాస్, పిట్టల నరేష్, ప్రధాన కార్యదర్శి కోకుండా జగన్, బంటి గౌడ్, రవీందర్ గౌడ్, నర్సింగ్ నేత, శ్రీకాంత్ నిదాన కవి,, సుభాష్ గౌడ్, ఆకాష్, కరుణాకర్, పలు ఆలయాల అధ్యక్ష, కార్యదర్శులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సన్‌రైజ్ ట్రస్ట్ సేవలను ఆదర్శంగా తీసుకోవాలి

- టీఎన్జీవో మేడ్చల్ జిల్లా మాజీ కార్యదర్శి ప్రవీణ్ గౌడ్



నవతెలంగాణ-ఘట్కేసర్

ఆపదలో ఉన్న అభాగ్యులకు అండగా ఉంటూ ఆర్థికంగా ఆదుకుంటున్న సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్టు సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని టీఎన్జీవో మేడ్చల్ జిల్లా మాజీ కార్యదర్శి డాక్టర్ బొమ్మ గోని ప్రవీణ్ గౌడ్ తెలిపారు. ఘట్కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీ నగర్‌లోని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యాదాద్రి జిల్లా మక్త అనంతారం గ్రామానికి చెట్టేపల్లి ఆదిత్య, చెట్టేపల్లి మాధురిల తల్లి తండ్రులు ఒకే రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో అనాథలైన వారి చదువులకు ట్రస్టు తరఫున రూ.10 వేల చెక్కును ఆదివారం అందజేశారు. ఎన్ఎఫ్‌సీ నగర్‌కు చెందిన పక్షవాత బాధితురాలు లాల్‌బీకి రూ.10 చెక్కును ఇచ్చారు. ఎన్ఎఫ్‌సీ నగర్ నివాసి దివాకర్ సాహూ రోడ్డు ప్రమాదంలో గాయపడి గాంధీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మరణించాడు. అతడికి అంధురాలు అయిన భార్య, ఇద్దరు కుమార్తెలకు ట్రస్టు తరఫున రూ.10 వేల ఆర్థిక సాయం ప్రవీణ్ గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చందుపట్ల వెంకట్ రెడ్డి, ట్రస్ట్ అధ్యక్షుడు వై. సుందర రావు, కార్యదర్శి ఎం. శ్రీకాంత్, ట్రస్ట్ సభ్యులు దేవేందర్, ఐలయ్య, బంగారు బాబు, కృష్ణ , రమేష్ , లింగస్వామి, వీరారెడ్డి, మాజీ ఎంపీటీసీ జంపాల రమేష్, మల్లయ్య, భూపాల్, అజయకుమార్, ప్రవీణ్ కుమార్, మల్లమ్మ, చంద్రమౌళి, ప్రభాకర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం : పూడూర్ చందర్



నవతెలంగాణ - జవహర్ నగర్

పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ సంజీవని లాంటిదని బీజేఆర్ నగర్ వ్యవస్థాపకులు పూడూరు చందర్ అన్నారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బీజేఆర్ నగర్‌లో నివాసం ఉంటున్న కొలుపుల జానమ్మ కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధ పడుతుండడంతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఆమెకు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.28,500 ఎల్‌వోసీ చెక్కును ఆదివారం బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.

కార్పొరేటర్ సునీతా శేఖర్ యాదవ్‌కు సన్మానం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఆషాడమాసం బోనాల సందర్భంగా చంద్రగిరి కాలనీలోని గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మౌలాలి కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉండాలని కోరుకున్నారు. అనంతరం గంగపుత్ర సంఘం అధ్యక్షులు రాజు, కమిటీ సభ్యులు కార్పొరేటర్‌ను ఘనంగా సన్మానించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



నవ తెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డుకు చెందిన ఉప్పలాంచి వీరేష్‌కు మంజూరైన రూ.10వేల500, సాజిదా బేగంకు మంజూరైన రూ.21వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి లబ్దిదారులకు ఆయన నివాసంలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా 17వ వార్డు యువ నాయకుడు సందీప్ గౌడ్ మాట్లాడుతూ ఆపదలో వుండి, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి, ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతోగానో ఉపయోగ పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సందీప్ గౌడ్,మహేష్ యాదవ్,సంతోష్ గౌడ్, రేవంత్, సాయిరెడ్డి, బాబు, అంజాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉమర్‌ఖాన్ దంపతులకు సన్మానం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఆరాధన కల్చరల్ అసోసియేషన్ 29వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ త్యాగరాయ గాన సభలో 'విజయంలో భార్యాభర్తల భాగస్వామ్యం' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు దశాబ్దాలుగా వికలాంగుల కోసం ఎనలేని సేవ చేస్తున్న వారి సేవకు గుర్తింపుగా హెలెన్ కెల్లర్స్ ఫౌండర్, చైర్మెన్ లయన్ ఉమర్ ఖాన్ దంపతులను తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధా రాణి ఘనంగా సన్మానించారు. అనంతరం హియరింగ్ ఇంపైర్డ్ స్టూడెంట్స్ ఆఫ్ హెలెన్ కెల్లర్స్ స్కూల్ విద్యార్థులు అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఎంతో అలరించాయి.

అన్నదానం చేయడం ఎంతో సంతృప్తి



శ్రీ బాలాజీ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు

నవతెలంగాణ - జవహర్ నగర్

అమవాస్య రోజు పేదలకు అన్నదానం చేయడం ఎంతో సంతృప్తినిస్తుందని అన్నదానం చేయడం ఎంతో సంతృప్తిని ఇస్తుందని శ్రీ బాలాజీ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. ఆదివారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అంబేద్కర్ నగర్‌లోని నోబుల్ స్కూల్ ఎదురుగా శ్రీ అభయ ఆంజనేయస్వామి. ఆలయ సమీపంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ అన్నదానం అంటేనే మనతో ఏ బంధం లేని నిరు పేదలను భగవంతుడిగా భావించి చేసే మహత్కార్యం అని, అన్నదానం జరిగే చోటుకు భగవంతుడు పేదవారి రూపం దాల్చి వస్తాడని పురాణాలు చెప్పుతాయన్నారు. అన్నదానం ఈ నెల అమావాస్యతో మొదలుకొని ప్రతీ నెల అమావాస్య రోజున దేవాలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బల్లి శ్రీనివాస్ గుప్తా, కార్పొరేటర్ కుతాడి సాయికుమార్, పంతంగి సిద్దులు యాదవ్, వెంకట నరసయ్య, పెద్ది మురళీ, పొలాస కిరణ్ కుమార్, మూల సోమయ్య, శాగంటి వెంకటేష్, కటకం శ్రీనివాస్, పొలాస సాయికుమార్, సోమ రంగయ్య, వెంకటేష్ యాదవ్, జ్ఞానేశ్వర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాగారంలో ఆలయాలకు నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాల్ పరిధిలోని శ్రీపోచమ్మ, ముత్యాలమ్మ, బంగారు మైసమ్మ ఆలయాల కమిటీ పదవి కాలం ముగిసినందున స్థానిక కౌన్సిలర్ పంగ హరిబాబు, పెద్దల సమక్షంలో నూతన ఆలయ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్దారి మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా ఎర్ర విద్యాసాగర్, కోశాధికారిగా ఎల్దారి బాబు, ఉపాధ్యక్షులుగా పంగ శ్రీహరి, కిష్టన్నగారి రవి, ఉప కార్యదర్శిగా ఎ.శ్రావన్ కుమార్, ఆర్గనైజర్స్‌గా కొండపాక రఘుపతి, ఎర్ర లింగం, కిష్టన్నగారి ధరంపాల్‌ను ఎన్నుకున్నారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పంగ హరిబాబు, పంగ భిక్షపతి, పంగ ముత్యాలు, ఎర్ర ఊశయ్య, ఎల్దారి ఆంజనేయులు, పంగ బాబురావు, ఎల్దారి శంకరయ్య, ఎల్దారి అశోక్, నిమ్మల కృష్ణ, కిష్టన్నగారి లింగం, ఎర్ర వామనరావు,పంగ ఎల్లమయ్య, వెంకటేష్, పంగ నాగేష్,నిమ్మల రవి, ఎల్దారి కుమార్, ఎల్దారి శ్రీకాంత్ పాల్గొన్నారు. కౌన్సిలర్ పంగ హరిబాబు నూతనంగా ఎన్నికైన ఆలయ కమిటీ సభ్యులకు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

బోనాల ఉత్సవాలలో పాల్గొన్న ప్రొఫెసర్ జ్యోత్స్న తిరునగిరి



నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్ డివిజన్‌లో శ్రీ దార్ల మైసమ్మ ఆలయం, ఉప్పల్ డివిజన్‌లోని శ్రీనల్ల పోచమ్మ ఆలయాల్లోని అమ్మవారిని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రొఫెసర్ జ్యోత్స్న తిరునగిరి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గూడపాటి ఫౌండేషన్ చైర్మెన్ శరత్ గూడపాటి, టీడీపీ చిల్కానగర్ డివిజన్ అధ్యక్షులు పబ్బతి శేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి డా. అంతగళ్ల అశోక్ ,ఉప్పల్ నియోజగవర్గ తెలుగు యువత అధ్యక్షులు బజారు హేమంత్ గౌడ్, పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షులు సాయి నాగార్జున, సన్నీ జూపల్లి, ప్రదీప్ వాసిరెడ్డి, శివ కెపి, విజయ్, అంకమ్మరావు, సాయి, పసల ప్రసాద్, రామ్మోహన్ పాల్గొన్నారు.



ఫ్రెండ్ షిప్ డే సందర్భంగా స్నేహం అంటే భుజం మీద చేయి వేసి నడవడమే కాదు..నీకెన్ని కష్టాలు వచ్చినా నేనున్నాని భుజం తట్టి చెప్పమేనని కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. అనంతరం ఆదివారం ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డికి, సహచర నేతలకు ఫ్రెడ్షిప్ బ్యాండ్ కట్టి వార్డు కార్యాలయంలో శుభాకాంక్షలు తెలిపారు.

-నవతెలంగాణ,కాప్రా

జనతానగర్ బోనాల ఉత్సవాల్లో బండి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆషాడ మాసం బోనాల ఉత్సవాలు ఆఖరి రోజైన ఆదివారం పలు చోట్ల ఘనంగా జరిగాయి. మూసాపేట జనతా నగర్‌లోని బండి మైసమ్మ ఆలయంలో.. ఆషాడ మాసం సందర్భంగా బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై, పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పండుగ శుభాకాంక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, గడ్డం శీను, ఆర్.సాయిలు, పి.నరసింహ, పి.సత్య నారాయణ, చిత్తారి ఎల్లయ్య, ఎం.నరసింహ పాల్గొన్నారు.

ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను, భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఆషాడమాసం బోనాల పండుగ, ఆఖరి ఆదివారం పర్వదినాన్ని పురస్కరించుకుని, ప్రత్యేక పూజలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని దీనబంధు కాలనీలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో.. నియోజకవర్గ నాయకులు గొట్టి ముక్కల వెంకటేశ్వర రావు, డివిజన్ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కేరళలోని వయనాడు వరద బాధితులకు అండగా నిలుద్దాం..

- సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలు కానీ లక్ష్మణ్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కేరళ వయనాడ్ వరద బాధితులను ఆదుకునేందుకు విరివిరిగా విరాళాలు సేకరించాలని సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్ తమ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సూరారం 129 డివిజన్ పరిధిలోని షాపూర్ నగర్ తదితర ప్రాంతాలలో సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో... కేరళలోని వయనాడ్ వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలు కానీ లక్ష్మణ్ మాట్లాడుతూ... వరదలు, కొండచరియలు కనికరం లేకుండా బీభత్సం సృష్టించి, వందలాది మంది ప్రాణాలను బలికొన్నాయని తెలిపారు. అనేక గ్రామాలు నామరూపాలు లేకుండా అయ్యాయని అది హృదయ విదారకమైన ఘటనని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి రాష్ట్రమైన కేరళ నేడు వరదల్లో చిక్కుకొని అతలాకుతలం అయిందని అన్నారు. ప్రకృతి విపత్తుతో నిర్వాసితులుగా మారి, ఆత్మీయు లను కోల్పోయి, ఆపన హస్తం కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలకు అండగా నిలవడం దేశ ప్రజల బాధ్యత అని అన్నారు. వారికి తక్షణ సహాయం పునరావాసం అందించడానికి ప్రతి ఒక్కరూ మానవత దృక్పథంతో స్పందించి, ప్రజలు విరాళాలు అందజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కమిటీ సభ్యులు బి.సత్యం, శంకర్, రావుల స్వాతి, సీఐటీయూ నాయకులు కే.శీను, కరుణాకర్, మల్లారెడ్డి, కృష్ణ, ఏసు, పాష తదితరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిని ఉపేక్షించం

- రాచకొండ సీపీ సుధీర్ బాబు ఐపీఎస్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజలకు అసౌకర్యం కలిగించిన శ్రీరస్తు బార్ రెస్టారెంట్, హెూటల్ (బొమ్మరిల్లు కాంప్లెక్స్) మూసివేతకు ఆదేశాలు పగలు, రాత్రి తేడా లేకుండా విచక్షణారహితంగా కస్టమర్లను మద్యం సేవించడానికి మరియు గదులలో ఉండడానికి అనుమతిస్తూ.. ఎలాంటి ధ్రువ పత్రాలు లేకుండా హెూటల్ గదులలో ఉండడానికి అనుమతిస్తూ, చట్ట వ్యతిరేక చర్యలను ప్రోత్సహించడము ద్వారా, పరోక్షముగా లైంగిక దాడికి కారణమై, స్థానిక ప్రజలకు ఇబ్బంది కరముగా, వ్యవహరిస్తున్న శ్రీరస్తు బార్, రెస్టారెంట్, హెూటల్ ప్రాంగణాన్ని (బొమ్మరిల్లు కాంప్లెక్స్) సీపీ సుధీర్ బాబు ఐపీఎస్ ఆదేశాను సారం... ఎస్‌హెచ్‌ఓ వనస్థలిపురం విజ్ఞప్తి మేరకు సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్, కందుకూరు, రంగారెడ్డి జిల్లా గారు శ్రీరస్తు బార్ రెస్టారెంట్, హెూటల్ రూమ్‌ల ప్రాంగణాన్ని (బొమ్మరిల్లు కాంప్లెక్స్) మూసివేతకు ఆదేశించారు. సాధారణ ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా వ్యవహరించే వారిని, అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలని కొనసాగించే వారిని, హెూటళ్లు, బార్ రెస్టారెంట్‌లు, ఇతరత్ర ప్రాంగణాలలో అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించే వారిని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని సీపీ శ్రీ సుధీర్ బాబు ఐపీఎస్ హెచ్చరించారు. కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు, సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు రాచకొండ కమిషనరేట్ పోలీసులు అహర్నిశలు కృషి చేస్తున్నారని కమిషనర్ పేర్కొన్నారు.

అసంఘటితరంగ ఆటో కార్మికులను విస్మరిస్తున్న ప్రభుత్వం



- ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి వంగాల శ్రీనివాస్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

అసంఘటితరంగ ఆటో కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తుందని ఏఐటీయూసీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి వంగాల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఐడీపీఎల్ కాలనీ క్రాంతి ఆటో యూనియన్ (ఏఐటీ యూసీ అనుబంధం)కౌన్సిల్ సమావేశం రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్ ఏఐటీయూసీ కార్యాలయంలో కామ్రేడ్ వి. హరి నాథ్ రావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ. 12 వేలు ఆటో కార్మికులకు ఇవ్వాలని తెలిపారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ఆటోరంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించినప్పటి నుంచి ఆటో కార్మికుల జీవనం అగమ్యగోచరంగా అయ్యిందని పేర్కొన్నారు. 2014 సంవత్సరం నుంచి ఆటో మీటర్ చార్జీలు పెంచక పోవడంతో కార్మికులు నష్టపోవాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా ఆటో కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాలకు సన్నద్ధం కావాలని అందుకు ఏఐటీయూసీ యూనియన్ ఆటో కార్మికులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐడీపీఎల్ ఆటో యూనియన్ అధ్యక్షులు రాజకుమార్, ఉపాధ్యక్షులు ప్రవీణ్, కార్యదర్శి ఎల్లాస్వామి, కోశాధికారి కుమార్, సభ్యులు సతీష్, జాంగిర్, యాదగిరి, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నెలకొల్పుదాం



- డీసీపీ సురేష్ కుమార్
- విద్యార్థులకు అవగాహన సదస్సు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

వ్యక్తిగత అవగాహన సమిష్టి బాధ్యతతోనే డ్రగ్స్ రహిత సమాజాన్ని నెలకొల్పవచ్చని బాలనగర్ జోన్ డీసీపీ సురేష్ కుమార్ సూచించారు. శనివారం సాయంత్రం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి, జగద్గిరినగర్ ఆర్యవైశ్య భవన్‌లో జగద్గిరిగుట్ట సిఐ.కే.క్రాంతికుమార్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన, ఏసీపీ హనుమంతరావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అంతకుముందు విద్యార్థులు నిర్వహించిన ర్యాలీని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ చెడు అలవాట్ల వైపు విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని వారి నడవడిక పట్ల జాగ్రత్తలు తీసుకో వాలని తెలిపారు. ఒకటే సారి కదా అని చెడు అలవాటులను రుచి చూస్తే వ్యసనాలుగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మద్యం, గుట్కా, తంబాకుతో పాటు గంజాయి మనిషి ఆరోగ్యాలతో పాటు జీవితాలను నాశనం చేస్తున్నాయన్నారు. డ్రగ్స్ వినియోగ సమాచారాన్ని డయల్ 100..ఫోన్ నెంబర్ 8712671111,హెల్ప్ లైన్ 14446కు తెలియజేయాలని కోరారు. అన్ని వర్గాలతో కూడిన కమిటీలు ద్వారా బాధితులకు కౌన్సిలింగ్, డీ ఆడిక్షన్ కేంద్రాలలో సహాయం అందిస్తారన్నారు. డ్రగ్స్ సరఫరా విక్రయదారుల సమాచారం అందిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని తెలిపారు. అనంతరం నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శంకర్, యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బుడోకయ్ బుడతలు.. ఆత్మరక్షణలో ఛాంపియన్లు..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బుడోకయ్ మార్షల్ ఆర్ట్స్ డూ ట్రైనింగ్ స్కూల్ మాస్టర్ కామేశ్వర్ రావు ఆధ్వర్యంలో.. ఇటీవల యూసఫ్ గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో జూలై 21న నిర్వహించిన ఫస్ట్ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ 2024 విజేతలుగా నిలిచిన కుత్బుల్లాపూర్‌కు చెందిన 50 మంది విద్యార్థులు (30 గోల్డ్ మెడల్ విజేతలు, 20 సిల్వర్ మెడల్ విజేతలు) ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ని ఆదివారం కలిశా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆత్మరక్షణ కళలలో ఇంతమంది విద్యార్థులు ఛాంపియన్లుగా నిలిచి కుత్బుల్లాపూర్‌కు మంచి పేరు తెచ్చారని, రానున్న రోజుల్లో ఈ కలలో మరింత నిష్ణాతులై ఉజ్వల భవిష్యత్తును రూపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభతో గోల్డ్ మెడల్ సాధించిన వందన, లాస్య, సిద్దు, రోషన్, మోనిషా, మోక్షఘ్నలతో పాటు ఏడేం ఢ్ల ప్రాయంలోనే గోల్డ్ మెడల్ సాధించిన ఇమ్మడి సోహన్ వీర్‌ను ఎమ్మెల్యే ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజేతల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్ని దానాల్లోకెల్లా.. అన్నదానమే మిన్న..

- ప్రగతి హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు జిల్లెల రవీందర్ రెడ్డి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

అన్ని దానాల్లోకెల్లా అన్నదానమే మిన్న అని శ్రీ సాయిగణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ప్రతినెల అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని ప్రగతి హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు జిల్లెల్ల రవీందర్ రెడ్డి అన్నారు. ఆదివారం అమావాస్య పురస్కరించుకుని శ్రీ సాయిగణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో.. రంగారెడ్డినగర్ డివిజన్,పంచశీల కాలనీలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిన శ్రీ సాయిగణేష్ ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని అందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఉత్సవ కమిటీ చైర్మెన్ మోతే రాజేశ్వర్, రవితేజ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, సంఘ సేవకులు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం కార్యదర్శి జింకల వెంకటేష్ ముదిరాజ్‌లు మాట్లాడుతూ సామాజిక సేవే లక్ష్యంగా గత కొన్నేండ్ల క్రితం శ్రీ సాయిగణేష్ ఉత్సవ కమిటీ సంస్థను స్థాపించి పేదలకు, పేద విద్యార్థులకు,పేద కార్మికులకు, కర్షకులకు,వచ్చినంతలో కమిటీ నేతృత్వంలో తమవంతు పలు విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బాషయ్య, అనిల్, సూర్యనారాయణ, సంజీవ్ కుమార్, ఆరే రామకృష్ణ ముదిరాజ్, స్థానికులు పాల్గొన్నారు.

నేషనల్ డెంటల్ కేర్ భవిష్యత్‌లో ప్రజలకు మరెన్నో సేవలు అందించాలి



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రగతి నగర్‌లోగల సుందరయ్య భవనంలో పరిసర ప్రాంతాల ప్రజలకు వివిధ ఫోరమ్స్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్న విషయం అందరికి తెలిసిందే.. అందులో భాగంగానే ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు నేషనల్ డెంటల్ కేర్ సహకారంతో ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాచుపల్లి పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఉపేందర్ హాజరై దంత వైద్య శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రస్తుతం మనిషి జీవన విధానంలో అనేకమైనటువంటి ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి తరుణంలో ఇట్లాంటి క్యాంపులు పేద మధ్య తరగతి వాళ్లకు అందరికీ ఉపయోగపడే విధంగా సుందరయ్య భవన నిర్వహణ కమిటీ ఏర్పాటు చేయటం అభినంద నీయం అన్నారు. అదేవిధంగా నేషనల్ డెంటల్ కేర్ వారు కూడా ఇట్లాంటి ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేసే దాంట్లో సంపూర్ణ సహకారం అందించినందుకు వారికి కూడా అభినందనలు తెలియజేశారు. నేషనల్ డెంటల్ కేర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో ప్రతి మనిషి తప్పనిసరిగా దంత వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించవలసిన అవసరం ఉందని తెలియజేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్నటువంటి దంత వైద్య పరీక్షలకు సంబంధించిన పరికరాలను ఏర్పాటు చేసినామని ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోన్నారని తెలిపారు. సుందరయ్య భవనం నిర్వాణ కమిటీ కన్వీనర్ సి హెచ్ మల్లయ్య చారి మాట్లాడుతూ ప్రతినెల మొదటి ఆదివారం షుగర్ బీపి మెడికల్ క్యాంపు నిర్వహించటంతో పాటు, ఉదయం 10గంటలకు ఉచిత దంత వైద్య శిబిరంలో స్థానిక ప్రజలు పాల్గొని ఆధునిక వైద్య సౌకర్య పరికరాలతో దంత వైద్య పరీక్షలను వినియోగించుకున్నారుని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నాటక, సినీ రంగ ప్రముఖులు ఎస్.వెంకట స్వామినాయుడు, కే.శంకరరావు, బాల వెంకటేశ్వరరావు, కృష్ణయ్య, ప్రగతి మహిళా సాధికారత వేదిక నాయకులు, రోజా రాణి, రమ, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

పదేండ్ల బీఆర్ఎస్ పార్టీ పాలనలో బాధితులైన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. ఆదివారం షాపూర్ నగర్‌లోని తన నివాసం వద్ద ప్రజలు, కార్యకర్తల నుంచి మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ వినతులు స్వీకరించారు. తమ సమస్యలు చెప్పుకునేందుకు వివిధ బస్తీల నుండి ప్రజలు, భాదితులు శ్రీశైలం గౌడ్ నివాసానికి వచ్చారు. అందరి సమస్యలు పరిష్కరిసానని మాజీ ఎమ్మెల్యే వారికి భరోసా ఇచ్చారు. బహదూర్ పల్లి, గుబురుగుట్ట కాలనీల నుంచి ఆయా సంక్షేమ సంఘాల ప్రతినిధులు తమ కాలనీల్లో నెలకొన్న సమస్యలు మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. పలువురు పలు ఆహ్వాన పత్రికలు అందజేశారు.

శ్రీ చైతన్య సాగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడిగా రవిసింగ్ ఏకగ్రీవ ఎన్నిక..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని, షాపూర్ నగర్, గాజులరామారంలోని శ్రీ చైతన్య సాగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీ ఏర్పాటు చేశారు. భవన నిర్మాణ కార్మిక కమిటీలో ఎన్నో రోజుల నుంచి కార్మికుల పట్ల అండగా ఉంటూ.. కార్మికులకు ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడికి వెళ్లి న్యాయం చేసిన బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు రవి సింగ్‌ను ఏకగ్రీవంగా శ్రీ చైతన్య సాగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 129 డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ హాజరయ్యారు.ఈ కమిటీలో ఉప అధ్యక్షునిగా ఎం.విట్టల్, రాజు సాగర్, ప్రధాన కార్యదర్శి సహదేవ్, అఖిల్ షేక్, కోశాధికారి బాబూజీ, తలారి దుర్గయ్య, నాగరాజు, డేవిడ్ రాజు, ఆర్గనైజర్‌గా స్వామి, రమేష్ సాగర్, మాణిక్యం, నరసింహ, దాస్, అడ్వైజర్స్ పాండు సాగర్ ఎం.శ్రీను, ఎస్.శ్రీను, కమిటీ సభ్యులు పరశురాం, ఎం.రఫీ, రాము, లంబాడి రమేష్, రవి నూతన కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. అనంతరం జెండా ఆవిష్కరణ, కమిటీ సభ్యులతో మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్, శ్రీ చైతన్య సాగర్ భవన నిర్మాణ కార్మిక కమిటీ సభ్యులు, స్థానిక కార్మికలు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో గుర్రపు డెక్కలు తొలగించి, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి..

- కూకట్‌పల్లి సీపీఐ(ఎం) మండల నాయకులు కృష్ణా నాయక్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కాలనీకి ఆనుకొని ఉన్న చెరువులో గుర్రపు డెక్కలు తొలగించి, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కూకట్ పల్లి సీపీఐ(ఎం) మండల నాయకులు కృష్ణా నాయక్ అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి మండల పరిధిలోని మూసాపేట్ రాఘవేంద్ర నగర్ బస్తీలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో.. బస్తీ సమస్యలపై పర్యటించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి సీపీఐ(ఎం) మండల నాయకులు కృష్ణా నాయక్ మాట్లాడుతూ స్మశాన వాటికలో బోరు లేక ట్యాంకర్ల ద్వారా నీళ్లను తీసుకొని స్మశాన వాటిక వద్ద వాడుకుంటున్నామని, బోరు వేయించాలన్నారు. బస్తీకి ఆనుకుని ఉన్న చెరువు పక్కనుంచి చాలా గుంతలు త్రోవేసి వదిలేశారు. గత ఆరు నెలల నుంచి పైపులు వేయకుండా కాల్వను పూర్చకుండా ఇలాగే వదిలేశారని త్వరగా ఆ పనులను కూడా పూర్తి చేయాలన్నారు. లేనిపక్షంలో ప్రజా సంఘాలను కలుపుకొని ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కాలనీలో డ్రయినేజీ, కరెంటు మీటర్ల సమస్యలు ఉన్నాయన్నారు. అవి త్వరగా పరిష్కారం కాకపోతే మండల కార్యాలయాలు, ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు నరసింహ, సిహెచ్ నాగమణి, మహిళా సంఘం నాయకురాలు పెంచలమ్మ, కృష్ణవేణి, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం..ప్రాణాలు కాపాడుకుందాం



- కార్పొరేటర్ రావుల శేషగిరి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట


దైనందిన జీవితంలో ప్రతిఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటుకుదాం.. ప్రాణాలను కాపాడుకుం దాం అని గాజులరామారం డివిజన్ కార్పొరేటర్, గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, బీజేపీ సీనియర్ నాయకులు రావుల శేషగిరి అన్నారు. ఈ మేరకు డివిజన్ పరిధిలోని ఉషో దయ కాలనీ ఫేస్ 1 ప్రాంతంలో ఆదివారం మెగా హరితహారం కార్యక్రమంలో భాగంగా కాలని సంక్షేమ సంఘం ఏర్పాటు చేసిన వనమహెూత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కాలనీవాసులతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు యుద్ధ ప్రాతిపదికన నడుము బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ కాలనీ ఫేస్ వన్ అసోసియేషన్ నాయకులు, కాలనీవాసులు, జీహెచ్ఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల బెదిరింపులు బాధాకరం

- కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని గురువారం సాయంత్రం ఓ పిచ్చికుక్క పలు కాలనీలలో స్వైర విహారం చేస్తూ 24 మందిని కరచి గాయాలపాలు చేసింది. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతలు బాధిత కుటుంబ కుటుంబాలను కనీసం పరామర్శించకపోవడం బాధాకరం అని కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధి లోని కాంగ్రెస్ నాయకులు బాధితులను పరామర్శించడంలో బాధ్యతను విస్మరించి, సేవ చేసే వారిని బెదిరించడం అల వాటుగా చేసుకుని నిస్సిగ్గుగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసం అని ఆయన అన్నారు. బాలానగర్ స్థానిక కార్పొ రేటర్ విషయం తెలుసుకుని.. స్థానిక ప్రజలను అప్రమత్తం చేసి జీహెచ్ఎంసీ సిబ్బందికి సమాచారం అందించి పిచ్చి కుక్కలను జీహెచ్ఎంసీ సిబ్బంది ద్వారా తరలించారు. అదేవిధంగా ప్రజలను అప్రమత్తం చేసి వ్యాక్సిన్లు వేయించడంలో అప్రమత్తం చేసిన సామాజిక కార్యకర్తలను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సైతం తన వంతు బాధ్యతగా బాలానగర్‌లో పర్యటించారు. బాధితులను పరామర్శించి, కుక్కలను నియంత్రించడానికి సంబంధిత అధికారులకు తగు సూచనలు చేశారు. ప్రజలపై ప్రేమ ఉన్న వారు కుక్కల బారిన పడిన బాధితులను పరామర్శించి ఆర్థిక సాయం అందించాల్సిన వారు కుయుక్తులు రాజకీయాలు చేయడం కాంగ్రెస్ నేతల విజ్ఞతకు తగదని కార్పొరేటర్ అన్నారు.



కూకట్‌పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని కళ్యాణి నగర్ కట్ట మైసమ్మ దేవాలయంలో ఆదివారం అమావాస్య ఆషాడ మాసం సందర్భంగా ఆఖరి రోజున చండి హెూమం నిర్వహించచారు. ఆలయ నిర్వాహకుల ఆహ్వానం మేరకు కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ మేరకు ప్రజలంతా ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని కట్టా మైసమ్మ తల్లిని దర్శించుకున్న బాలానగర్ డివిజన్ పరిధిలోని కట్ట మైసమ్మ ఆలయంలో జరుగుతున్న రుద్రచండి హెూమంలో ఆషాడ మాసం చివరి ఆదివారం రోజు కట్టమైసమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న రుద్ర చండీ హెూమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కార్పొరేటర్ కుటుంబ సభ్యులకు సన్మానం చేశారు. అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారికి మంగళహారతులు ఆశీర్వదించి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు మధుబాబు, వెంకటేశ్వర్లు, శేఖర్ రెడ్డి భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. నవతెలంగాణ-బాలానగర్

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ శాసన సభ్యులు మాగంటి గోపినాథ్ రహ్మత్ నగర్ డివిజన్‌కు చెందిన 22మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫయాజ్, నజీర్, లియాఖత్ అలీ, రాకేష్, చోటు, గని, ధనుజ, స్రవంతి, రమాదేవి, బేగం, సమీనా, సురేందర్, పెద్దింటి కుమార్, అహ్మద్, అర్షద్, తరుణ్, రఘు, రమేష్, గోపీచంద్, బసప్ప , బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు

ఫర్నిచర్, వాల్ ఆర్ట్‌కు ప్రసిద్ధి

నవతెలంగాణ - బంజారా హిల్స్



అత్యాధునిక ప్రీమియం ఫర్నిచర్ స్టోర్ 'ఫర్నెస్టీ' మొదటి ఎక్స్‌పీరియన్స్ స్టూడియోని ఆదివారం బంజారాహిల్స్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫర్నెస్టీ వ్యవస్థాపకురాలు మాన్సీ అలెన్ మాట్లాడు తూ... ఇది ఢిల్లీ, ఎన్‌సీఆర్ ఆధారిత బ్రాండ్ అన్నారు. కస్టమ్ మేడ్ ప్రీమియం ఫర్నిచర్, ఆర్ట్ పీస్‌లకు ప్రసిద్ధి చెందిందన్నారు. ఈ స్టూడియోలో కస్టమైజ్డ్ ఫర్నిచర్, వాల్ ఆర్ట్, అధునాతన జపాండి, మెడిటరేనియన్ తదితర గృహాలంకరణలు కలవన్నారు. ఈ స్టూడియోలో ప్రతి భాగం సృజనాత్మకత, ఆవిష్కరణల అద్భుత కళాఖండాలు, స్కాండినేవియన్, జపనీస్ మినిమలిజంను మిళితం చేస్తుందన్నారు. ఈ స్టూడియోలో క్లయింట్‌ల కోసం డిజైన్ కాన్సెప్ట్‌లను విజువలైజ్ చేయడానికి ప్రత్యేకమైన కాంప్లిమెంటరీ మూడ్ బోర్డ్‌లు ఉన్నాయన్నారు. ఈ ఆలోచనలు, ప్రేరణలు నైపుణ్యం కలిగిన ఫర్నెస్టీ బృందం అందిస్తుందని తెలిపారు.

బోనాలను ఘనంగా జరుపుకోవాలి



- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

బోనాల ఉత్సవాలను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బోనాల ఉత్సవాల సందర్భంగా వివిధ అభివృద్ధి పనులు చేపట్టేలా అధికారులను ఆదేశించాలని పలువురు నాయకులు ఆదివారం తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఆయన నివాసంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 11, 12 తేదీలలో బోయిగూడ, భోలక్ పూర్, ఐడీహెచ్ కాలనీ, పద్మారావు నగర్ తదితర ప్రాంతాలలో బోనాల ఉత్సవాలు జరగనున్నాయని, ఆయా ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు, డ్రయినేజీ లీకేజీ లేకుండా చర్యలు తీసుకోవాలని, వ్యర్థాల తొలగింపుకు, అవసరమైన చోట్ల స్ట్రీట్ లైట్ లను ఏర్పాటు చేసే విధంగా వెంటనే చర్యలు తీసుకునే విధంగా అధికారులను ఆదేశించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. బోనాలకు రావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బన్సీలాల్ పేట డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, శివ, మల్లేష్, కళ్యాణ్, హరినాధ్ తదితరులు ఉన్నారు.

మ్యూజికల్ థెరపీతో విశ్రాంతి పొందండి

నవతెలంగాణ - బంజారాహిల్స్



డిగ్నిటీ చాయ్ మస్తీ సెంటర్ డిగ్నిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్‌ల సమూహంతో ది జెంబే సర్కిల్ మ్యూజికల్ థెరపీ ద్వారా ఆదివారం బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 14లో జెంబే సర్కిల్ మ్యూజికల్ వ్యవస్థాపకుడు సాయి కుమార్ ఎంటర్టైనర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయి కుమార్ మాట్లాడుతూ.. జెంబే పశ్చిమ ఆఫ్రికా అత్యంత ప్రసిద్ధ వాయిద్యాలలో ఒకటనీ గోబ్లెట్ ఆకారపు డ్రమ్ సాంప్రదాయకంగా ఆఫ్రికన్ గట్టి చెక్క నుండి చెక్కబడి డ్రమ్ హెడ్‌గా జంతువుల చర్మంతో ఉంటుందన్నారు. పాశ్చాత్య అవగాహనల, డ్రమ్ పెర్కషన్ కుటుంబంలోని మెంబ్రానో ఫోన్ వాయిద్యాల తరగతికి చెందినదనీ "నేను మ్యూజియాలజీ లో పీహెచ్‌డీ చేశాననీ, సంగీతంతో మనస్సు, శరీరాన్ని నయం చేయడంపై దృష్టి సారిస్తానన్నారు. సంగీత ప్రయాణంలో లయ, ఆనందం ద్వారా ప్రజలను కనెక్ట్ చేసే అద్భుతమైన వాయిద్యం జెంబే అని నేను కనుగొన్నాననీ తెలిపారు. జెంబే సర్కిల్ అన్ని వయసుల వారికి సంగీతం యొక్క మ్యాజిక్‌ను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుందనీ జెంబే సర్కిల్ గత 5 సంవత్సరాలుగా భారతదేశంతో పాటు యు.కె. లో నిర్వహించిన డ్రమ్ సర్కిల్‌లకు ప్రసిద్ధి చెందిందనీ, మా జెంబే సర్కిల్‌లు సంగీతం ద్వారా సృజనాత్మక స్వీయ-వ్యక్తీకరణను అన్వేషించే అవకాశాన్ని నిర్మించడంలో ప్రసిద్ధ మానసీపాఠశాలలు కళాశాలల్లో ప్రదర్శనలు, వర్క్‌షాప్‌లు చేస్తామని చెప్పారు.

అధ్యక్ష పదవిపై ఆరోపణలు తగవు



- గడ్డం శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ - బంజారాహిల్స్

అధ్యక్ష పదవిపై అనవసరపు ఆరోపణలు తగవని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన గడ్డం శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈ నెల 8న ఢిల్లీలో యాదవ ఎంపీలకు సన్మాన సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జులై 23న తమ సంఘం జాతీయ అధ్యక్షులు కే. సెల్వం యాదవ్ తనను జాతీయ అధ్యక్షుడిగా నియమించిన ధృవీకరణ పత్రాన్ని మీడియా సమావేశంలో విడుదల చేశారు. తనపై ఆరోపణలు చేసే సంఘ సభ్యులు తన కుటుంబ సభ్యులే అన్నారు. రాష్ట్రంలోని యాదవుల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిల్లి కుమార్, గడ్డం చిన్న శ్రీనివాస్, సల్ల ఆనంద్, శ్రీనివాస్, సుశానంద్, శ్రీశైలం, కార్తీక్ యాదవులు పాల్గొన్నారు.

ఆలయంలో అమవాస్య అన్నదానం

నవతెలంగాణ-కంటోన్మెంట్



బాపూజీ నగర్ శ్రీదేవి నల్ల పోచమ్మ ఆలయంలో ఆలయ కమిటీ వారు ఆదివారం అమా వాస్య సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అమావాస్య రోజు ఆలయంలో అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అమ్మవారిని మనసారా కోరుకుంటే మొక్కులు తీర్చే తల్లి అని అన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్ ఆస్పత్రి ఎం.డీ.నంద కిషోర్, ప్రకాష్ భాటియా, ఆలయ కమిటీ సభ్యులు అజిత్,ప్రేమ్ ముదిరాజ్, రామారావు, నరసింహ, నరేందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దండు మారమ్మ దేవాలయంలో బోనాలు





నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్‌లో బలం రాయి దండు మారమ్మ దేవాలయంలో ఆదివారం బోనాలు ఈవో రవికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుండి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించబడ్డాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు పలువురు ప్రముఖులు రాజకీయ నాయకులు వచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే శ్రీ గణేష్‌తో పాటు బీజేపీ, బీఆర్ఎస్ ఇంకా పోలీస్ అధికారులు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యులకు ఈవో రవికుమార్ ఆధ్వర్యంలో సన్మానాలు చేశారు. ఉదయం నుండి భక్తులు మహిళలు, యువతులు బోనాలు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించు కున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకుగాను ఆలయ సిబ్బంది పకడ్బందీగా అన్ని ఏర్పాట్లు చేశారు. ఎలంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందో బస్తు ఏర్పాటు చేశారు.

'ది రెసిలెంట్ పాత్' పుస్తక ఆవిష్కరణ

నవతెలంగాణ - బంజారా హిల్స్



అపోలో హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ హెూం గ్రోన్ సీఈవో సుబ్రహ్మణ్యం యడవల్లి రాసిన తొలి పుస్తకం 'ది రెసిలెంట్ పాత్'ను హెూటల్ దసపల్లాలో అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పుస్తకం మన జీవనానికి సంబంధించిన ప్రత్యేకమైన దృక్కోణాలను అందిస్తుందన్నారు. మార్పును స్వీకరిస్తూ.. వేగవంతమైన ప్రపంచంలో అభివృద్ధి చెందడం తెలుపుతుందన్నారు. ఇది మన బాహ్య వాతావరణం తాలూకా గందరగోళంలో సమతుల్యత, అంతర్గత సామరస్యాన్ని కనుగొనేలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా రచయిత సుబ్రహ్మణ్యం యడవల్లి మాట్లాడుతూ.. ఈ పుస్తకంలో డయాగ్నోస్టిక్స్ సెంటర్‌లో వార్డ్ బాయ్ గా ప్రారంభమైన నా జీవిత ప్రయాణంలో అనేక సవాళ్లను అధిగమించి ర్యాంకుల ద్వారా నా ఎదుగుదలను వివరిస్తుందన్నారు. అడ్డంకులను అధిగమించడానికి, అవకాశాలను చేజిక్కించుకోవడానికి, విజయం వైపు ప్రయాణానికి రోడ్‌మ్యాప్‌ను అందిస్తుందని తెలిపారు. సుబ్రహ్మణ్యం యడవల్లి నాలుగు దశాబ్దాలుగా విశిష్టమైన కెరీర్‌ను కలిగి ఉన్నారు. మూడు దశాబ్దాలుగా అపోలో హాస్పిటల్స్‌లో ఎగ్జిక్యూటివ్ లీడ్ రోల్స్‌లో పని చేశారు. మార్కెటింగ్, ఆపరేషన్స్‌లో విధులు నిర్వర్తించారు. ఇప్పుడు రీజినల్ సీఈవోగా రాణిస్తున్నారు. వ్యక్తిగత, కార్పొరేట్ జీవిత పాఠాలను పంచుకోవాలన్న బలమైన కోరికను ఈ పుస్తకం తెలియజేస్తుంది. తదుపరి తరం నాయకులను రూపొందించడానికి, తద్వారా మేనేజ్‌మెంట్ విద్య భవిష్యత్తుకు దోహదపడటానికి తన అనుభవాలను, అంతర్దృష్టులను పంచుకున్నారు. 'ది రెసిలెంట్ పాత్' పుస్తకంలో జ్ఞానోదయం కలిగించే అంశాలు ఎన్నో ఉన్నాయి. వివేకం, దృఢత్వంతో కష్టాలను అధిగమించడం, భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా ఉండటం చెప్పింది. వ్యక్తిగత, వృత్తి పరమైన వృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలి.

సవాళ్లను అవకాశాలుగా, వైఫల్యాలను సోపానాలుగా, భయాలను స్ఫూర్తిగా మార్చడంలో ఇది ఒక పాఠం. రామాయణం ఇది ఒక ఇతిహాసం. రామాయణంలో రాముడు తీవ్రమైన ప్రతి కూల పరిస్థితులలో కూడా తిరుగులేని సానుకూలతతో వ్యవహరించారు. దీనిని మనం స్ఫూర్తిగా తీసుకోవాలి. నిజమైన స్థితి స్థాపకత అంటే నిరంతరం సవాళ్లతో పోరాడటం కాదు, అంతర్గత బలాన్ని కాపాడుకోవడం, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ నిర్ణయాలు తీసుకోవడం. ఇది సహనం, విజన్, ధైర్యాన్ని కోరుతుంది. ఏ క్షణంలో ఏ లక్షణాన్ని ఉపయోగించాలో గుర్తించడంలోనే వివేచన ఉందనీ వివరించారు.

అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- అమరవీరుల కుటుంబాల వేదిక

నవ తెలంగాణ-బంజారాహిల్స్



తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం తమ బిడ్డల్ని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న అమరవీరుల కుటుంబాల బాధలను తీర్చే బాధ్యత ప్రభుత్వానిదేనని కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా 250 గజాల ఇంటి స్థలం, ప్రతి అమరవీరుడి కుటుంబంలో ఒకరికి రూ.25వేల పెన్షన్ ఇవ్వాలని తెలంగాణ అమరవీరుల కుటుంబాల వేదిక రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కావలి మన్యం, శశికళ డిమాండ్ చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... తెలంగాణ అమరవీరుల పట్ల గత ప్రభుత్వం లాగే నిర్లక్ష్యం వహించకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. అమర వీరులు రాజకీయ నాయకుల వలె స్వార్థ ప్రయోజనాల కోసం ఉద్యమాలు చేయలేదన్నారు. ఈ నేల తల్లి విముక్తి కోసం బలిదానం చేసుకున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు కావస్తున్న ఇంతవరకు అమరుల కుటుంబాలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కావున అమరవీరుల కుటుంబాలకు సీఎం రేవంత్ రెడ్డి సమయం ఇచ్చి వారి సాధక, బాధకలను స్వయంగా వినాలన్నారు. అందుకు ప్రొఫెసర్ కోదండరాం చొరవ తీసుకోవాలని వారువిజ్ఞప్తి చేశారు.

మోడ్రన్ దోబి ఘాట్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

రజక సంఘ ప్రతినిధుల డిమాండ్



నవతెలంగాణ-కంటోన్మెంట్

మోడ్రన్ దోబీగాట్ల నిర్మాణాల నిధులు మంజూరు చేయాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యదర్శి మరియాల గోపాల్ , ముఖ్యమంత్రిని కోరారు. ఆదివారం రజక సంఘ జిల్లా సహాయ కార్యదర్శులు రాపర్తి ప్రభాకర్, అల్వాల బాబు ఆధ్వర్యంలో కంటోన్మెంట్ అన్నా నగర్‌లో నిర్వహించిన సమావేశంలో కోరారు. డివిజన్‌లో నూతన కమిటీ ఏర్పాటు కోసం అలాగే పాత సొసైటీల పునరుద్ధరణ కోసం ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో మరియాల గోపాల్ మాట్లాడుతూ.. తెలంగాణ పోరాట వీరనారి ఐలమ్మ విగ్రహం ట్యాంక్ బండిపైన పెట్టలన్నారు. మోడ్రన్ దోబీఘాట్లు నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. రజకులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, దౌర్జన్యాలని, అరికట్టడానికి ప్రత్యేక రక్షణ చట్టాన్ని రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలోలి ఎస్. సహదేవ్, డి. బాబు రాజ్, ఎం. పోచయ్య పి.పోచయ్య,ఏ.రవీందర్, జై.వెంకట నరసయ్య,కే.భాస్కర్, కే.కనకయ్య, కే.శ్రీనివాస్, కే. పోచయ్య, ఎం. పోచయ్య, జే.వెంకట స్వామి, కే.రమేష్, పాల్గొన్నారు.

నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన చింతల తులసికి అభినందన

నవతెలంగాణ-ఓయూ



ఉస్మానియా యూనివర్సిటీలో ఎంటెక్ చదువుతూ నల్లగొండకు చెంది న చింతల తులసి ఏకంగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ప్రభంజ నం సృష్టించింది. అటువైపు ఎంటెక్ విద్యా అభ్యసిస్తూనే ఈ ఉద్యోగాలు సాధించి కష్టపడితే సాధ్యం కానిది ఏది లేదంటూ నిరూపించింది. తాజాగా వచ్చిన ఫలితాల్లో ఏఈఈ, ఏఈ, గ్రూప్ 4, పాలిటెక్నిక్ లెక్చరర్ ఉద్యోగాలు సాధించింది. చింతల వెంకన్న లక్ష్మి దంపతుల మూడో సంతానం తులసి, చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలలోనే విద్యను అభ్యసించి రాష్ట్రంలో ప్రముఖ యూనివర్సిటీలైన జేఎన్టీయూహెచ్ , ఉస్మానియా యూనివర్సిటీ నుండి గ్రాడ్యుయేట్ , పోస్ట్ గ్రాడ్యుయేట్ పట్టాను పొందారు. ప్రభుత్వ ఉద్యోగమే ధ్యేయంగా గత రెండు సంవత్సరాలుగా పరీక్షలకు సన్నద్ధమవుతూ నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై, గ్రూప్ 1 ప్రిలిమ్స్‌లో క్వాలిఫై అయ్యింది. ఈ సందర్భంగా నిరుద్యోగ జేఏసీ చైర్మెన్ కోటూరి మానవతారాయ్ తో పాటుగా ఓయూలో సహ విద్యార్థులు కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు.

సుప్రీం కోర్టు తీర్పుతో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు

-మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి చెన్నయ్య

నవ తెలంగాణ - బంజారా హిల్స్



సుప్రీం కోర్టు ఎస్సీ ఎస్టీల రిజర్వేషన్లపై ఇచ్చిన తీర్పు ఎస్సీఎస్టీల రిజర్వేషన్లకు బంగం కలిగించేల ఉందని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి చెన్నయ్య, వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభకు అధ్యక్షత వహించిన సర్వయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. ఇది పూర్తిగా ఆర్టికల్ 341 కి విరుద్ధంగా రాజకీయ ప్రమేయం ఉండేలా ఉందని సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు తెలిపారు. రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉందని దీని పై న్యాయనిపుణులతో చర్చించిన అనంతరం సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. స్వార్థ రాజకీయాలకు మనువాదా సిద్ధాంతాలకు అనుగుణంగా వెలువడిన తీర్పు దళితుల మధ్యచిచ్చుపెడుతుందన్నారు. మాలాల్లో 23 ఉపకులా లు విద్య,వైద్య ఉద్యోగ భూ పంపిణీలలో వెనుకబడి ఉన్నారన్నారు. పూర్తిగా సర్వేచేసిసాధ్యాపసాధ్యాలను పరిశీలించాలన్నారు. వర్గీకరణను వ్యతిరేకిస్తూ రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్ల ముందు నేడు ధర్నాలు నిర్వహిస్తామన్నారు. బీజేపీ ప్రభుత్వం దేశం లోని దళిత ఆదివాసీ సమాజాన్ని అస్థిరపరిచే చర్యలకు పూనుకున్నదని విమర్శించారు.

తల్లిపాలతో ఎన్నో ప్రయోజనాలు

- అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్ కన్సల్టెంట్, ప్రసూతి, గైనకాలజిస్ట్ డాక్టర్ హరితా రామ్

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

'తల్లిపాలు'తో తల్లీ, బిడ్డకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్ (కొండాపూర్) సీనియర్ కన్సల్టెంట్, ప్రసూతి, గైనకాలజిస్ట్ డాక్టర్ హరితా రామ్ జూబ్లీహిల్స్ అపోలో హాస్పిటల్‌లో మీడియా ద్వారా ప్రకటన విడుదల చేశారు. శిశు సంరక్షణలో తల్లిపాలు కీలకమైన ఒక భాగమన్నారు. 'ప్రపంచ బ్రెస్ట్ ఫీడింగ్ వీక్' ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు నడుస్తున్న నేపథ్యంలో ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. తల్లులు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. తల్లి శిశువుకు పాలు ఇచ్చేటట్టు ప్రోత్సహించడం చాలా ముఖ్యమన్నారు.

శిశువుకు కలిగే ప్రయోజనాలు

పోషకాహార ప్రయోజనాలు :

తల్లి పాలను 'లిక్విడ్ గోల్డ్' అని పిలుస్తారన్నారు. ఎందుకంటే, ఈ పాలు శిశువు పెరుగుదల, అభివృద్ధికి అవసరమైన పోషకాల సంపూర్ణ సమతుల్యతను కలిగి ఉంటుందన్నారు. ఇది సులభంగా జీర్ణమవుతుందన్నారు. శిశువు అవసరాలకు అనుగుణంగా ఉంటుందన్నారు. సరైన పోషణను నిర్ధారిస్తుందని తెలిపారు.

ఇమ్యూనిటీ బూస్ట్ :

తల్లి పాలలో యాంటీబాడీస్, ఇతర రోగ నిరోధక శక్తిని పెంచే కారకాలు పుష్కలంగా ఉంటాయన్నారు. ఇవి సాధారణ ఇన్ఫెక్షన్లు, చెవి ఇన్ఫెక్షన్లు, శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, డయేరియా వంటి అనారోగ్యాల నుంచి శిశువును రక్షించడంలో సహాయపడతా యని వివరించారు. ఈ సహజ రోగ నిరోధక శక్తిని పెంచితే.. శిశువు రోగ నిరోధక వ్యవస్థ ఇంకా అభివృద్ధి చెందుతుందన్నారు. ఇది ప్రారంభ నెలలో చాలా కీలకమన్నారు. తల్లి పాలివ్వడం వల్ల చర్మం సౌందర్యాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. ఇది తల్లీ, బిడ్డ మధ్య భావోద్వేగ బంధాన్నిపెంచు తుందన్నారు. ఈ బంధం శిశువుకు ఓదార్పు, భద్రతను అందిస్తుందన్నారు. అనుబంధం, ప్రేమ భావాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. బిడ్డకు పాలు ఇవ్వడం వలన తల్లికి కలిగే ప్రయోజనాలు.శిశువులకు పాలు ఇచ్చే తల్లులకు రొమ్ము, అండాశయ క్యాన్సర్లు, టైప్ 2 మధుమేహం వచ్చే ప్రమాదం తక్కువన్నారు. తల్లిపాలు ఆక్సిటోసిన్ విడుదలను ప్రోత్సహించడం ద్వారా ప్రసవానంతర మాంద్యం సంభావ్యతను తగ్గించడంలో సహాయపడుతుందని తెలిపారు. ఇది మానసిక స్థితిని నియంత్రించడంలో సహాయపడుతుందని పేర్కొన్నారు. తల్లిపాలు ఇవ్వటం వలన బరువు తగ్గడం, అదనపు కేలరీలు ఖర్చవుతాయ న్నారు. ఇది తల్లులు గర్భధారణ బరువును త్వరగా తగ్గించనుందని తెలిపారు. ఈ సహజ ప్రక్రియ గర్భధారణకు ముందు బరువుకు తిరిగి రావడానికి ఆరోగ్యకరమైన, క్రమమైన మార్గమన్నారు. తల్లి పాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. సరైన ఉష్ణోగ్రత వద్ద ఉంటాయని తెలిపారు. పాలు ఇచ్చే సమయాలను సరళంగా, సౌకర్యవంతంగా చేస్తుందన్నా రు. తల్లిపాలు ఇవ్వడం వల్ల ఆయా కుటుంబాలకు ఖర్చు కూడా ఆదా



అవుతుందన్నారు. అయితే, తల్లిపాలతో చాలా ప్రయోజనాలు ఉన్నప్పటికీ, సవాళ్లు లేకుండా పోలేదన్నారు. సాధారణ సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలు ఉన్నాయన్నారు. తల్లి పాలు ఇచ్చేటప్పుడు చాలా మంది కొత్త తల్లులు ఈ విషయంలో ఇబ్బంది పడతారన్నారు. ఈ సమస్య వల్ల పిల్లలకు సరిపడినం త ఆహారం లభించదని తెలిపారు. చనుబాలి వ్వడంలో కన్సల్టెంట్ నుంచి మార్గదర్శకత్వం పొందాలన్నారు. తల్లీ, బిడ్డ ఇద్దరికీ ఉత్తమంగా ఉండే విధానాన్ని కనుగొనాలన్నారు. చనుమొన మాత్రమే కాకుండా ఆ బ్లాక్ స్పాట్ మొత్తం శిశువు నోటిలో ఉండేలా చూడాలన్నారు.

గొంతు ఉరుగుజ్జులు:

ఇది సరిగ్గా పట్టుకోకపోవడం వల్ల గానీ, తరచూ ఆహారం తీసుకోవడం వల్ల గానీ, పొడి చర్మం వల్ల గానీ సంభవించవచ్చు అని అన్నారు ఈ సమస్యకు చనుమొన రాపిడిని తగ్గించడానికి సరైన పద్ధతుల వైపు మళ్లాలన్నారు. ఉపశమనానికి చనుమొనలకు లానోలిన్ క్రీమ్ లేదా తల్లి పాలను పూయాలన్నారు. పాలు ఇచ్చిన తర్వాత చనుమొనలను గాలి తగిలేటట్టు ఉంచాలన్నారు. సబ్బులు, లోషన్లను ఉపయోగించ రాదని తెలిపారు. కొంతమంది తల్లులు తమ శిశువు అవసరాలకు సరిపడా పాలను ఉత్పత్తి చేయడం లేదని ఆందోళన చెందుతూ ఉంటారన్నారు.తరచూ తల్లిపాలను ఇవ్వడం వల్ల పాల ఉత్పత్తిని ప్రేరేపిస్తుందన్నారు. షెడ్యూల్లో కాకుండా డిమాండ్పై ఆహారం ఇవ్వాలన్నారు. హైడ్రేటెడ్‌గా ఉండాలన్నారు. పాల ఉత్పత్తికి తోడ్పడటానికి సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఇంకా ఆందోళనలు ఉంటే నిపుణులను సంప్రదించాలని తెలిపారు.

ప్రత్యేక పూజలు చేసిన నివేదిత



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు మూడో వార్డులో ఆదివారంబోనాల సందర్భంగా ఎమ్మెల్యే నివేదిత పలు ఆలయాల్లో ప్రత్యేక పూజ లు నిర్వహించారు. బాలం రాయి దండు మారమ్మ దేవాలయం, శీతల పోచమ్మ దేవాలయాలతో పాటు పలు ఆలయాలలో దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా నివేదితను సభ్యురాలు అనిత ప్రభాకర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు చేసిన ఏసీపీ



నవతెలంగాణ-కంటోన్మెంట్

దండు మారమ్మ బోనాల సందర్భంగా బేగంపేట ఏసీపీ కృష్ణమూర్తి, సీఐ రమేష్ అమ్మవారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముప్పిడి గోపాల్ కుటుంబ సభ్యులు పాల్గొని పూజలు చేసి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించండి



- ముఖ్యమంత్రికి ఆదివాసి సంఘాల విజ్ఞప్తి

నవతెలంగాణ - బంజారాహిల్స్

ఎస్టీ జాబితా నుంచి లంబాడి సామాజిక వర్గాన్ని తొలగించి అడవి తల్లి పై ఆధారపడి జీవిస్తున్న ఆదివాసులకు న్యాయం న్యాయం చేయాలని ఆదివాసి సంఘాల నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ పార్లమెంటు సభ్యులు, తురుము దెబ్బ అధ్యక్షుడు సోయం బాబురావు మాట్లాడారు. దేశ అత్యున్నత న్యాయస్థానం వర్గీకరణ విషయంలో ఇచ్చిన తీర్పును తాము స్వాగతిస్తున్నామన్నారు.సదర్ తీర్పును అనుసరించి ఎస్టీ జాబితాలోని తెగలను జనాభా ప్రకారం లెక్కించి వర్గీకరించాలని కోరారు. ఇతర రాష్ట్రాలలో బీసీ ఎస్సీలుగా ఉన్న సామాజిక వర్గం తెలంగాణలో ఎస్టీ జాబితా లో కొనసాగుతూ అత్యంత వెనుకబడిన ఆదివాసీలకు సంక్షేమ పథకాలకు దూరం చేస్తుందన్న భావన ప్రతి ఆదివాసికి ఉందని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని తెగల వారిగా సమగ్ర గణన నిర్వహించడంతో పాటు వారి ఆర్థిక స్థితిగతులను తెలుసుకొని దానికి అనుగుణంగా రాష్ట్రంలో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం దేశంలోనే అత్యంత వెనుకబడిన వర్గాలైన ఆదివాసులు అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వాల పకడ్బందీ చర్యలతోనే సాధ్యమవుతుందని అన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కూడా అవగాహన లేని ఆదివాసీలు వాటిని అందుకోవడంలో విఫలమయ్యారని దీనిని దృష్టిలో ఉంచుకొని తమ తెగలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐడబ్ల్యుసిపి జాతీయ అధ్యక్షులు,గొంది వెంకటరమణ, బట్ట వెంకటేశ్వర్లు, ఏఎస్ఎఫ్ ఓయూ విద్యార్థి మాడవి అజయ్, ఓయూ విద్యార్థి నాగమణి, రజిని తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ ప్రథమ వర్ధంతి సభను జయప్రదం చేయండి

నవతెలంగాణ-హైదరాబాద్‌డెస్క్



ప్రజా వాగ్గేయకారుడు, దివంగత నేత గద్దర్ అన్న ప్రథమ వర్ధంతిని ఈనెల ఆరవ తారీఖున మధ్యాహ్నాం రెండు గంటల నుండి రవీంద్రభారతిలో జరుగుతుందని, అట్టి మహత్తర కార్యక్రమానికి జర్నలిస్టులు, నాయకులు, హాజరై దిగ్విజయం చేయాలని కవులు, కళాకారులు, కోరారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని గాజులరామారంలో కవులు, కళాకారులు కలిసి గోడ ప్రతిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దరువు అంజన్న, ప్రముఖ కవి జర్నలిస్టు మోహన్ బైరాగి పాత్రికేయులు డప్పు రామస్వామి, జోగు వెంకట్, నాగుల సాయి, రాగాల ఆనంద్,రమేష్, రవీందర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ గోదా సామెత శ్రీమన్నారు రంగనాయకస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ- ఘట్కేసర్ రూరల్

మండలంలోని ఎదులాబాద్ శ్రీ గోదా సామెత శ్రీమన్నారు రంగనాయకస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమైయ్యాయి. స్వామి వారికి పదేశ్వకాశనరదన, పుణ్యావాచనం రూతివకర్ణం కోతుక బంధనం ముత్సవగ్రవానం, అంకురార్పణ ఆరగింపు తీర్థ ప్రసాద వినియోగ కార్యక్రమాలు నిర్వహించారు. విష్య క్సేనారదన సందర్భంగా అమ్మవారికి స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ ఆవరణంలో సుదర్శన హోమం నిర్వహించారు. హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు టీపీ లక్ష్మణా చార్యులు రాజ గోపాల చార్యులు, సేషా చార్యులు ,పురుషోత్తా చార్యులు పవన చార్యులు, అచ్యుతాచార్యులు ఆదిత్యా చార్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఓయూ హెల్త్ సెంటర్‌కు అనారోగ్యం

- రెగ్యులర్ డాక్టర్స్ కరువు
- ప్రొఫెసర్స్ ,ఉద్యోగులు , విద్యార్థులకు అంతఅంత మాత్రమే ఆరోగ్య సేవాలు
- కాంట్రాక్టు, కన్ సాల్ డెంట్ వారే దిక్కు
- బడ్జెట్‌లో పోస్టులు భర్తీ చేయాలని ప్రభుత్వానికి లేఖ రాశాం : ఓయూ రిజిస్ట్రార్

నవతెలంగాణ-ఓయూ



ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వందలాది మంది ప్రొఫెసర్స్ , ఉద్యోగులు , విద్యార్థులు , సిబ్బంది ఉన్నారు. వీరే కాకుండా కాంట్రాక్టు ,పార్ట్ టైమ్ ప్రొఫెసర్స్‌తో పాటుగా కాంట్రాక్టు ఉద్యోగులు ,ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వివిధ రూపాల్లో సేవాలు అందిస్తున్న విషయం తెలిసిందే. ఇలాంటి వారి అందరి ఆరోగ్య సంరక్షణ కోసం యూనివర్సిటీ పాటు పడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కానీ యూనివర్సిటీ ప్రస్తుతం ఓయూలో ఉన్న హెల్త్ సెంటర్ లో ప్రస్తుతం కనీస సౌకర్యాలు కల్పన దేవుడు ఎరుగు పూర్తిస్థాయిలో ఒక్క రెగ్యులర్ డాక్టర్ అయిన లేక పోవడం శోచనీయం. ఉన్న ఒక్క డాక్టర్ కూడా జులై నెలలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ హోదాలో పదవీ విరమణ చెందిన విషయం తెలిసిందే. దీనితో రెగ్యులర్ డాక్టర్స్ లేక పోవడంతో ఇన్‌చార్జి సీఎంఓ గా ఓయూ రిజిస్ట్రార్‌కు బాధ్యతలు స్వీకరించారు.

కాంట్రాక్టు డాక్టర్స్‌యే దిక్కు

ఇక రెగ్యులర్ డాక్టర్స్ లేక పోవడంతో గత్యంతరం లేక గత కొన్ని సంవత్సరాలుగా కాంట్రాక్టు డాక్టర్స్‌తోనే కాలం వెల్లదిస్తున్నారు. మరొక వైపు సదరు కాంట్రాక్టు డాక్టర్స్ కూడా చాలి చాలని వేతనాలు ఇవ్వడంతో నిపుణులైన సీనియర్ డాక్టర్స్ ఎవరూ ఇక్కడికి రావడానికి సుముఖంగా లేరు. దీనితో అటు ప్రస్తుతం పనిచేస్తున్న ప్రొఫెసర్స్‌యే కాకుండా రిటైర్మెంట్ చెందిన ప్రొఫెసర్స్ ఉద్యోగులకు ,విద్యార్థులకు అంతఅంత మాత్రమే వైద్య సేవాలు అందుతున్నాయి. ఇక రాత్రి పూట ఒక్క డాక్టర్ కూడా అందుబాటులో ఉండక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక గత్యంతరం లేక ప్రవేట్ ఆస్పత్రికి లేదా దగ్గరలో ఉన్న గాంధీ ఆస్పత్రిని ఆశ్రయిస్తున్నారు. ఇక వీరే కాకుండా వారాని ఒక్కసారి వచ్చే 5 మంది వివిధ ప్రత్యేక కాన్సులైంట్ ,చర్మ , గైనాజిస్టు , కార్డియాలజిస్టు , లాంటి ప్రత్యేక వైద్యులు వారానికి ఒక్క విజిట్ కు మాత్రమే వస్తున్నారు. ఇది ఇలా ఉంటే ఇక్కడ రెగ్యులర్ ఉద్యోగులు కూడా తగిన స్థాయిలో లేక పోవడంతో అంత కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారు. 106 సంవత్సరాల యూనివర్సిటీలో హెల్త్ సెంటర్ దుస్థితి ఇలా ఉండటం పలువురు ఆవేదన, అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరొక వైపు ఓయూ నీటి లో అధిక శాతం ఫ్లోరైడ్ ఉండటంతో విద్యార్థులకు జుట్టు ఉడి పోవడంతో గత్యంతరం కొందరు విద్యార్థులు గుడ్డు కొట్టించుకుంటున్నారు కొందరికి బట్ట తలలు వస్తున్నాయి అని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వానికి లెటర్ రాశాం



డాక్టర్స్ , ఉద్యోగుల కొరత ఉన్న మాట వాస్తవమే దీనితో రాష్ట్ర ప్రభుత్వానికి ఇటీవలే హెల్త్ సెంటర్ లో బడ్జెట్ పోస్ట్ లకు డాక్టర్స్ , సపోర్టు ఉద్యోగులను రిక్రూట్ మెంట్ చేయాలని లేఖ రాశాం.

-ఓయూ రిజిస్ట్రార్, లక్ష్మీనారాయణ

భారత రాజ్యాంగం పుస్తకం ఆవిష్కరణ

- ప్రజలకు కానుక దేవేందర్ 'రాజ్యాంగం'
- తెలంగాణ హైకోర్టు జస్టిస్ జి. రాధారాణి

నవతెలంగాణ -సుల్తాన్ బజార్



బీసీసీఇ (వెనుకబడిన తరగతులు సాధికారత సంస్థ) చైర్మెన్, రాజ్యసభ మాజీ సభ్యుడు తూళ్ల దేవేందర్ గౌడ్ సంక్షిప్తంగా, సరళమైన భాషలో 'భారత రాజ్యాంగం' ప్రజలకు కానుకగా అందించారని తెలంగాణ హైకోర్టు జస్టిస్ జి. రాధారాణి పేర్కొన్నారు. కోఠిలోని హనుమాన్ టేక్టిలో బీసీసీఇ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, తెలుగులోను, ఇంగ్లీషు లోను ప్రచురించిన రాజ్యాంగం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ మధ్య జరిగిన తాజా ఎన్నికల్లో దేశప్రజలు ఎంతోపరిణతి చూపించారని, అందులో భాగంగా గట్టి ప్రతిపక్షాన్ని ఎన్నుకున్నారని తెలిపారు. పాలకులు తప్పులు చేస్తే సరిదిద్దే బాధ్యత ప్రజలే తీసుకోవాలని చెప్పారు.బీసీసీఇ ఇంచార్జి, కవి, జర్నలిస్టు ఇంద్రవెల్లి రమేష్ సమన్వయకర్తగా నిర్వహించిన సమావేశంలో పుస్తకా న్ని అందించిన టి.దేవేందర్ గౌడ్ మాట్లాడుతూ, నాలుగు దశాబ్దాలపాటు చట్టసభలతో తనకు ఉన్న సుదీర్ఘ అనుభవాన్ని జోడించి ఈ పుస్తకం తీసుకొచ్చామని తెలిపారు. ప్రజలే పాలకులుగా మారి, విఫలమైన వ్య వస్థలను సరైన బాటలో నడిపించాలని, ధన రాజకీయాలనుంచి దేశాన్ని విముక్తం చేయాలని చెప్పారు.తెలంగాణ గ్రంధాలయసంస్థ చైర్మన్ ఎండి రియాజ్, ఢిల్లీ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు ఐ. తిరుమలి, ఉమ్మడి హైకోర్టు జడ్జి జస్టిస్ చంద్రకుమార్, రిటైర్డు డిప్యూటి కలెక్టర్ నాగమ్మ పూలే, బహుజన ఫ్రంట్ నేత నల్లా సూర్యప్రకాష్ సభికులను ఆలోచింపజేసే రీతిలో రాజ్యాంగంపై చర్చనీయాంశాలు వెల్లడించారు. సీని యర్ జర్నలిస్టు పాశం యాదగిరి, దిగంబర కవి నగ్నముని, సిఎల్ఎన్ గాంధి, ఎండి. రఫీ, టిపిఎస్ కె జి , డా. నాగన్న తదితరులు పాల్గొన్న ఈ సమావేశం ఉద్వేగభరితంగా సాగిందిసైంటిస్టు, ఉపాసకులు దేవరపల్లి హరిప్రసాద్ సమావేశాన్ని బుద్ధ వందనతో ప్రారంభించడం విశేషంగా ఆ కట్టుకుంది. సమావేశం చివర సభికులకు రాజ్యాంగం కాపీలు పంపిణీ చేశారు.

కరాటే పోటీల్లో సత్తా చాటిన యూనివర్సల్ 369 విద్యార్థులు

నవ తెలంగాణ- మేడ్చల్



జాతీయస్థాయి కరాటే పోటీల్లో మేడ్చల్ పట్టణానికి చెందిన యూనివర్సల్ 369 విద్యార్థులు సత్తా చాటారు. ఆదివారం నగరంలోని జీహెచ్ఎంసి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ లో జాతీయస్థాయి కరాటే ఛాంపియ న్షిప్ పోటీలు నిర్వహించారు.ఈ పోటీల్లో మేడ్చల్ పట్టణానికి చెందిన విద్యార్థులు పథకాలు సాధించారు. బిలో టెన్ ఇయర్స్ కటాస్ విభాగంలో విద్యార్థులు మోతిక, అభిషిక్తా, దావల్య, అనంత్, కామ్య, అభిమన్యు లు గోల్డ్ మెడల్ సాధించినట్లుగా తెలిపారు. అదేవిధంగా అండర్ 14 ఇయర్స్ విభాగంలో అతిన్ గోల్డ్ మెడల్,అండర్ 11 ఇయర్స్ విభాగంలో జి.వరుణ్ తేజ్ గోల్డ్ మెడల్, జోష్ణ సిల్వర్ మెడల్,కార్తికేయ,నమన్ బ్రాంచ్ మెడల్ సాధించినట్లుగా తెలిపారు.వీరందరికి సినీ హీరో ఇంద్రసేన, సీనియర్ కరాటే మాస్టర్ సాయికుమార్ అభినందనలు తెలియజేశారు. గెలుపొందిన విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ ఇచ్చి నవంబర్ లో జరిగే సౌత్ ఏషియన్ పోటీలకు పంపించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

వివక్షలు లేని స్నేహం గొప్పది



లయన్స్ క్లబ్ జోనల్ చైర్మెన్ బి.వినయ్

నవతెలంగాణ-హైదరాబాద్ డెస్క్

వివక్షలు లేని స్నేహం చాలా గొప్పదని నవభారత లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ బి.వినయ్ అన్నారు.ఆగస్టు 4 న అంతర్జాతీ య స్నేహ దినోత్సవం సందర్భంగా ముషీరాబాద్‌లో ప్రభు త్వ బాలికల హాస్టల్లో నవభారత లయన్స్ క్లబ్, డా.హిప్నోకమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జ్యోతి రాజా, శోభా రాణి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. పాటల పోటీ లో గెలుపొందిన వారికి బి.వినయ్, వనిత, జి.కృష్ణవేణి, జ్యోతి రాజా, శోభా రాణి, పి.స్వరూపా రాణి , డా.హిప్నో పద్మా కమలాకర్ లిబట్టలు, 56 మంది బాలికలకు చెప్పులు, పోషకాహారం, పుస్తకా లు, అందజేశారు. ఆయన మాట్లాడుతూ స్నేహాన్ని గుర్తు చేసుకొని, మనసు నిండా సంతోషాన్ని నింపుకొని కృతజ్ఞతను ప్రకటించు కునేందుకు ఓ సందర్భం రానే వచ్చింది. అదే ఫ్రెండ్ షిప్ డే అన్నారు.ఏటా ఆగస్టు మొదటి ఆదివారం నాడు స్నేహితుల దినోత్సవం జరుపుకుంటున్నాం అన్నారు. డా.హిప్నోక మలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ డైరెక్టర్ డా.హిప్నో పద్మా కమలాకర్ అన్నారు. ఆమె మాట్లాడుతూ స్నేహం మానవ సంబంధాల నిజమైన రూపమని తెలిపారు. ఏమైంది అని అడిగేవారు, ఏమి కాదులే అని చెప్పే వారు స్నేహితులన్నారు . కులం, మతం, రంగు, వయస్సు, జాతి తో సంబంధం లేకుండా స్నేహాన్ని జరుపుకోవడం ఈ రోజు ప్రాముఖ్యత అని అన్నారు. స్నేహం అనేది ఇతరుల పట్ల దయ, సద్భావనతో, అవసరం లో ఉన్నవారికి సహాయం చేయడం, అభినంద నలు ఇవ్వడం లేదా కృతజ్ఞతలు తెలియజేయ డం వంటివి చేయాలని కోరారు. అందమైన స్నేహం ఎప్పటికీ అలాగే ఉంటుందని చెప్పారు. మన ప్రతి అడుగులో విశ్వసించగలిగే వ్యక్తే స్నేహితులన్నారు. క్లాసులోనూ, చుట్టుపక్కల ఉన్న వ్యక్తులే స్నేహితులనుకోకూడదన్నారు. మంచి సోదరిగా, సోదరుడిగా, కుమార్తెగా, కొడుకు గా కుటుంబంలోనూ స్నేహ సంబంధాలు ఏర్పరుచుకోవాలని తెలిపారు. ఎన్ని సమస్యలు ఉన్నా ఎప్పటికీ విడిచిపెట్టని వారే నిజమైన స్నేహితులనా తెలిపారు. స్నేహితులనే వారు పెన్సిల్, ఎరేజర్ లా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో నవభారత లయన్స్ క్లబ్ జి.కృష్ణ వేణి, జ్యోతి రాజా, శోభా రాణి , స్వరూపా రాణి, జి.హిమకర్, హాస్టల్ హెడ్ బాపు ప్రియ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో అన్ని వర్గాలకు సమన్యాయం




నవతెలంగాణ-మల్కాజిగిరి

ఎస్సీ వర్గీకరణ సాధించడమే కాదు సాధించిన ఫలాలను ఎస్సీ కులాలలోని అన్ని వర్గాలకు సమానంగా పంచడమే మందకృష్ణ మాదిగ ఉద్యమ లక్ష్యం అని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి తిప్పారపు లక్ష్మణ్ మాదిగ అన్నారు. ఆదివారం మల్కాజిగిరి చౌరస్తాలో మాదిగ సంక్షేమ సంఘం నాయకులు నర్సింగ్ మాదిగ మల్కాజిగిరి వారి ఆధ్వర్యంలో సుప్రీంకోర్టులో వచ్చిన తీర్పును స్వాగతిస్తూ వేడుకలను చేశారు.ఈ కార్యక్రమానికి అతిథులుగా ఎమ్మార్పీఎస్ జాతీయ కోఆర్డినేటర్ తిప్పారపు లక్ష్మణ మాదిగ,ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షులు రామచందర్ మాదిగ,వి హెచ్ పిఎస్ జిల్లా అధ్యక్షులు వినయ్ తదితరులు హాజరయ్యారు. ఇందులో భాగంగా బాణసంచా కాల్చి మిఠాయిలు పంచారు. మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఇంతకుముందు ఉద్యమంలో మరణించిన అమరవీరులకు నివాళులు అర్పిస్తూ మౌనం పాటించారు.అనంతరం నాయకులు మాట్లాడుతూ ఎస్సీ ఉపకులాలు అభివృద్ధి చెందాలని అన్ని వర్గాల అభివృద్ధి చెందేందుకు ఈ వర్గీకరణ అని అన్నారు. దేశానికి ఆగస్టు 15న స్వతంత్రం వస్తే మాదిగలకు ఆగస్టు 1 రిజర్వేషన్ల పైన తీర్పు ద్వారా వచ్చిందన్నారు. ప్రభుత్వాలు జనాభా ప్రాతిపదికన ఎవరు ఎంత ఉంటే వారికి రిజర్వేషన్లు వచ్చినప్పుడు అభివృద్ధి జరుగుతుందని,తీర్పుతోనే సంబరాలు పడకుండా ఈ తీర్పును రాష్ట్ర ప్రభుత్వాలు అమల్లోకి తీసుకువచ్చేలా అన్ని వర్గాలు పనిచేయాలని చెప్పారు.ఢిల్లీ నుంచి మందకృష్ణ మాదిగ వచ్చి ఎలాంటి కార్యాచరణ ఇచ్చిన కార్యాచరణకు అనుగుణంగా అందరం పనిచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వడ్డేపల్లి శివ ఎం ఎస్ పి రాష్ట్ర కార్యదర్శి బైరపాక శివ ఎంఆర్పిఎస్ కార్యదర్శి నాయకులు నర్సింగరావు,కృష్ణ,యాదగిరి, రాజు,రమేష్,ప్రభాకర్,సుదర్శన్ గణేష్, తులసి సురేష్,నర్సింగ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అమావాస్య అన్నదానం

నవతెలంగాణ-కాప్రా



వాసవి మిత్రమండలి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో ఈసీఐఎల్ ఎక్స్ రోడ్డులో అమావాస్య అన్న ప్రసాద వితరణ చేశారు. అనంతరం కుషాయిగూడకు చెందిన పేద వృద్ధురాలు మాలే వరమ్మకు ఈనెల పెన్షన్ రూ.1000 ఇచ్చారు. తదనంతరం స్నేహితుల సమక్షంలో ఘనంగా స్నేహితుల దినోత్సవం జరుపుకున్నారు. నాచారానికి చెందిన పేద ఆర్యవైశ్యుడు కొండా మహేష్ గుప్తాకు వాసవి మిత్ర మండలి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్ కొరకై ఆర్థిక సహాయం చేశారు.

కన్నడ నాట్య రంగం ద్వారా ఎంతో మంది కళాకారులను పరిచయం చేసాం

కన్నడ నాట్యరంగం అధ్యక్షులు కృష్ణమూర్తి

నవతెలంగాణ - ముషీరాబాద్



కన్నడ నాట్య రంగం ద్వారా ఎంతో మంది కళాకారులను పరిచయం చేసాం అని కన్నడ నాట్యరంగం అధ్యక్షులు కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం బాగ్లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అయోధ్య రామ మందిర రాముని విగ్రహం నిర్మించిన శిల్పి కి సన్మానం, సుందరకాండ నృత్యరూపకళ పారాయణం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉడిపి పాణిమార్ మట్ విద్యా దిశ స్వామీజీ, అధ్యక్షులు కృష్ణమూర్తి కార్యదర్శి రామచంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కన్నడ నాటి రంగం ద్వారా ఎంతో మంది కళాకారులను వేదికకు పరిచయం చేశామని తెలిపారు. సుందరకాండలోని నృత్య మండలి ద్వారా కళాకారుల్లో దాగి ఉన్న అపూర్వమైనటువంటి ప్రతిభ వెలికి తీయగలిగామని కన్నడ నాటి రంగం 50 సంవత్సరాలుగా నిర్విరామంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ కళాకారులకు ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు శ్రీధర్ రావు, ఉపాధ్యక్షులు రత్నాకర్ రావు, సుమతి నిరంజన్, బిఆర్ రావు పాల్గొన్నారు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
సోమవారం | ఆగస్టు 05, 2024 | www.navatelangana.com

వృద్ధురాలి మెడలో గొలుసు లాక్కెళ్లిన దొంగ



నవతెలంగాణ-మేడ్చల్

మాయ మాటలు చెప్పి వృద్ధురాలి మెడలో నుంచి రెండున్నర తులాల బంగారు గొలుసును దొంగలు లాక్కెళ్లిన ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని డబిల్ పూర్ గ్రామానికి చెందిన సుంకమ్మ అనే వృద్ధురాలి ఇంటికి వెళ్లిన ఓ వ్యక్తి మీకు డబ్బులు వచ్చాయి సంతకం పెట్టాలంటూ వృద్ధురాలిని మాటలో దింపాడు. అదను చూసి సుంకమ్మ మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. కాగా బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



కుషాయిగూడ కూరగాయల మార్కెట్ హోల్ సేల్ వర్తక సంగం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల పండుగ ఉత్సవాలకు...ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డితో కలిసి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హోల్సేల్ కాంటా ప్రెసిడెంట్ అశోక్ గౌడ్, సాయిబాబా యాదవ్, కీసర సత్తి గౌడ్, దేవేందర్ గౌడ్, గణేష్ ముదిరాజ్, పండాల శివకుమార్ గౌడ్, అశోక్ చారి, అంజి, రఘుగౌడ్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కాప్రా

స్వచ్ఛదనం - పచ్చదనం

- కమిషనర్ ఆమ్రపాలి కాట
- నగర సుందరీకరణ, పరిశుభ్రతను కొనసాగించుటకు ప్రతి ఒక్కరు సహకరించాలి



నవతెలంగాణ-సిటీబ్యూరో

స్వచ్ఛదనం - పచ్చదనం ఈ నెల 5 వ తేదీ నుండి 9 వరకు నిర్వహించనున్న నేపథ్యంలో అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన రోజువారీ కార్యక్రమాలు నిబద్ధతతో చేపట్టాలన్నారు. రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ప్రధాన భూమిక పోషించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా విభాగాల అధికారులు ప్రజలతో మమేకమై కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధుల సూచనలు, భాగస్వామ్యంతో నగరం నిరంతరంగా పరిశుభ్రత పచ్చదనం తో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. నగర అభివృద్ధిలో ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయం, ప్రజలు సహకారం అందించి నప్పుడే ఏ కార్యక్రమం అయిన విజయవంతం అవుతుందని కమిషనర్ ఆమ్రపాలికాట పేర్కొన్నారు.

పభుత్వం నిర్దేశించిన రోజువారీ కార్యక్రమాల వివరాలు..

మొదటి రోజు ఆగష్టు 5న: జీవీపీ, భవన నిర్మాణ వ్యర్థాలు (సి అండ్ డి) మరియు స్వచ్ఛ ఆటో డ్రైవర్లను స్లమ్ ఏరియా అసోసియేషన్, ఆర్ డబ్లు ఏ అసోసియేషన్ లతో అటాచ్మెంట్ చేయడం. జీవీపీల తొలగింపు కోసం హౌస్ హోల్డ్స్, ఆర్ డబ్లు ఏ, స్ట్రీట్ వెండర్స్, కమర్షియల్ ఏరియాలలో స్వచ్ఛ ఆటో డ్రైవర్ల పరిచయ కార్యక్రమం.. పబ్లిక్ ప్లేసెస్, మెయిన్ రోడ్లు, స్లమ్స్, గ్రేవ్ యార్డులు, పార్కులతో పాటు గా రైల్వే ట్రాక్, బస్ స్టాండ్, మార్కెట్ లలో జివిపి ల క్లీనింగ్. మెయిన్ రోడ్లు, అంతర్గత రోడ్లను చెత్త రహితంగా చేయడం. భవన నిర్మాణ వ్యర్థాలను (సి అండ్ డి) అన్ని కాలనీ, కమర్షియల్ ఏరియాలలో క్లీన్ చేయడం. వీక్లీ మార్కెట్లను స్వచ్ఛ ఆటోలకు లింక్ చేసి రాత్రి సమయంలో వ్యర్థాలు తొలగించుట. నగరంలో రోడ్లు, కాలనీలలో అనుమతి లేని ఫ్లెక్సీలను తొలగించుట.

రెండో రోజు ఆగస్టు 6న: దోమల నిర్మూలన కార్యక్రమాలు చేపట్టడం.. హెల్త్, ఫాగింగ్, దోమల బ్రీడింగ్ సోర్సెస్ తొలగింపు, కుక్కల వాక్సినేషన్.. డెంగ్యూ పాజిటివ్ కేసు లను గుర్తించి ఆయా ఇండ్ల చుట్టూ 100 కుటుంబాల వరకు ఏ ఎల్ ఓ ఆపరేషన్ చేయుట.దోమల బ్రీడింగ్ స్థలాలను గుర్తించి ముమ్మరంగా ఏ ఎల్ ఓ కార్యక్రమాలు చేపట్టడం.

మూడవ రోజు ఆగస్టు 7న: వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల పై అవగాహన కల్పించడంతో పాటు చెరువుల సంరక్షణ కార్యక్రమాలు చేపట్టడం.

నాల్గవ రోజు ఆగస్టు 8న: నాలాలలో మురుగు నీరు సాఫీగా వెళ్లేలా చెత్త, చెదారాన్ని తొలగించడం. నీరు నిలిచిన ప్రాంతాలు, గుంతలు పూడ్చివేయడం.

ఐదో రోజు ఆగస్టు 9న: వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించడం. ప్రజలు, ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో జీహెచ్ఎంసీ వ్యాప్తంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటడం. ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలు, పాఠశాలలు, కళాశాలలు, పార్కులు, చెరువు కట్టలు, రోడ్లకు ఇరువైపులా పెద్ద ఎత్తున మొక్కలు నాటడం. ఇంటింటికీ ఉచితంగా మొక్కలు పంపిణీ చేయడం.

దోపిడి ముఠా అరెస్ట్



నవతెలంగాణ-మెహిదీపట్నం

రెండు రోజుల క్రితం విజయనగర కాలనీలో కారును ఆపి, దోపిడీకి పాల్పడిన ముఠాను హుమాయున్ నగర్ పోలీసులు అరెస్టు చేశారు. సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్ హుమాయున్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హబీబ్ నగర్‌లో బట్టల షాపు నడిపే బజార్ ఘాట్‌కు చెందిన మహమ్మద్ ఖురేషి, మల్లెపల్లిలో ఆప్టికల్ దుకాణం నిర్వహించే బజార్ ఘాట్‌కు చెందిన సాహెల్ ఖాన్, హుమాయున్ నగర్‌కు చెందిన కూలీ పని చేసే ప్రశాంత్, కొల్లపురి సాయి, విజయనగర్ కాలనీ క చెందిన ఎలక్ట్రీషియన్ వెయ్యాల రాజశేఖర్, బైక్ మెకానిక్ మహమ్మద్ ఖలీల్, విజయనగర్ కాలనీ పోచమ్మ బస్తీకి చెందిన విద్యార్థి గింక అభిలాష మోహన్, ఒక ముఠాగా ఏర్పడి, ఈనెల మూడవ తేదీన స్విఫ్ట్ కార్‌లో వెళ్తున్న మాసబ్ ట్యాంక్‌కు చెందిన విద్యార్థి శ్రీమంత్ కుమార్(24) ను విజయనగర్ కాలనీలోని మెడ్ ప్లస్ మందుల షాప్ వద్ద అర్ధరాత్రి సమయంలో అడ్డగించారు. శ్రీమంత్ కుమార్‌ను, కారులోని అతని నలుగురు స్నేహితులను కత్తితో బెదిరించి, వారి వద్ద నుంచి రెండు సెల్ ఫోన్లను, ఒక బంగారు గొలుసు, ఒక బంగారు ఉంగరాన్ని దొంగలించి పారిపోయారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న హుమాయున్ నగర్ పోలీసులు దర్యాప్తు చేపట్టి.. నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి ఒక ఐఫోన్‌ను, ఒక బంగారు గొలుసును, ఒక కత్తిని, ఒక టీవీఎస్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ ముఠాను పట్టుకోవడంలో కృషి చేసిన పోలీసులను ఆయన అభినందించారు. ఈ సమావేశంలో ఆసిఫ్ నగర్ ఏసీపీ కృష్ణమోహన్, హుమాయున్ నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిశ్వర్, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ, ఎస్సైలు శ్రీనివాస్ రెడ్డి, వినోద్ కుమార్, అహ్మద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పట్టాలిస్తామని సీఎం ప్రకటించడం హర్షణీయం

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి



నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్రంలో ప్రభుత్వ, భూదాన్ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇండ్ల పట్టాలిస్తామని అసెంబ్లీ సమావేశాల్లో సీఎం ఎ.రేవంత్ రెడ్డి ప్రకటించడం హర్షణీయమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు ప్రభుత్వ, భూదాన భూముల్లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలకు ఇండ్ల పట్టాలివ్వాలని, అలాగే భూ పోరాటాల సందర్భంగా నమోదైన కేసులను ఎత్తివేయాలని కోరారు. గతంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు వినతి పత్రాలు అందజేసిన విషయంపై స్పందించి, సత్వర నిర్ణయం తీసుకుని రాష్ట్ర అసెంబ్లీలో సీఎం ఎ.రేవంత్ రెడ్డి ప్రకటించడంపై ధన్యవాదాలు తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ, భూదాన్ భూముల్లో గుడిసెలు వేసుకుని పేదలు జీవనం గడుపుతున్నారని, రెవెన్యూ అధికారులు, రియల్ ఎస్టేట్ మాఫీయా నిత్యం వారిని వేధింపులకు గురి చేస్తున్నారని దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి రక్షణ కల్పించి, భూ అక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఇళ్ల పట్టాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వకుండా మోసం చేసిందని ఆయన ఆరోపించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వరంగల్ తదితర జిల్లాలలో సీపీఐ నిర్వహించిన భూ పోరాటాల ద్వారా ప్రభుత్వ, భూదాన్ భూముల్లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలకు సామాజిక ఆర్థిక సర్వే (ఎస్ఈఎస్) నిర్వహించి, త్వరితగతిన పట్టాలు ఇచ్చి, పేదల జీవితాలలో వెలుగులు నింపాలని రవీంద్రచారి విజ్ఞప్తి చేశారు.

'రాజకీయ ప్రయోజనాల కోసమే సుప్రీంకోర్టు తీర్పు'

- ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా 21న భారత్ బంద్
- దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు బీజేపీ కేంద్ర సర్కార్ రాజకీయ ప్రయోజనాల కోసమేనని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా ఈ నెల 21న భారత్ బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఆయన తెలిపారు.ఆదివారం హిమాయత్ నగర్ లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిబంధనలకు వ్యతిరేకంగా ఈ తీర్పు ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లల్లో క్రిమిలేయర్‌ను అమలు చేయాలనే కుట్రతో ఈ తీర్పు వెనుక మొత్తం రిజర్వేషన్లను రద్దు చేసే సామాజిక కుట్రలు దాగి ఉన్నాయని ఆరోపించారు. పార్లమెంట్, భారత రాష్ట్రపతి ప్రమేయం లేకుండా ఉదేశ్య పూర్వకంగానే ఆర్టికల్-341కు వ్యతిరేకంగా జరిగిందన్నారు. ఆర్టికల్-14,15,16లను వక్రీకరిస్తూ ఈ కేసులో తీర్పు ఇచ్చారన్నారు.రాష్ట్ర ప్రభుత్వాలు, సుప్రీంకోర్టులకు లేని అధికారాలను ఉపయోగించుకుని ఈ తీర్పును కాంగ్రెస్ సహకారంతో ప్రధాని నరేంద్రమోడీ చెప్పించారని ఆయన ఆరోపించారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ బెంచ్ ఇచ్చిన రాజ్యాంగ వ్యతిరేక తీర్పును మొత్తం యావత్ దేశంలోని ఎస్సీ, ఎస్టీ, దళిత సమాజం మొత్తం వ్యతిరేకిస్తుందని, ఉత్తర భారత్‌లో పెద్ద ఎత్తున తిరుగుబాటు మొదలైంద న్నారు. ప్రధానంగా నిమ్న దళిత జాతులను పొలిటికల్ పవర్‌లోకి రానీయకుండా శాశ్వతంగా శత్రువులుగా మార్చడానికి, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పోరాట స్ఫూర్తిని ధ్వంసం చేయడానికి చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ సామాజిక కుట్ర చేశారని ఆయన తీవ్రంగా ఆరోపించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21వ తేదీన దేశవ్యాప్తంగా 'భారత్ బంద్'కు దళిత బహుజన సంస్థలు, వివిధ రాజకీయ పార్టీలు, సామాజిక ప్రజా సంఘాలు పిలుపు నివ్వడం జరిగిందని, ఈ భారత్ బంద్ ను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మాల మహానాడు జాతీయ కేంద్ర కమిటీ అధ్యక్షులు డాక్టర్ వి.ఎల్.రాజు, రాష్ట్ర అధ్యక్షులు జె.ఎస్.రావు, ఏపీ రాష్ట్ర అధ్యక్షులు బండి ఈశ్వర్, జాతీయ ఉపాధ్యక్షులు జొన్నలగడ్డ భాస్కర్ రావు, దళిత బహుజన పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిలివేరి వసంతరావు, ఏపీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ ఉప్పాడ శ్రీరామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా 8 బీసీ కార్పొరేషన్‌ల ప్రకటన పట్ల హర్షం



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో కొత్తగా 8 బీసీ ఫెడరేషన్ కార్పోరేషన్లను ప్రకటించడం పట్ల తెలంగాణ బీసీ ఫెడరేషన్ కు లాల సమితి రాష్ట్ర అధ్యక్షులు బెల్లాపు దుర్గారావు, ప్రధాన కార్యదర్శి కీర్తి యుగంధర్, భాస్కరుడులు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. బీసీ ఫెడరేషన్ కులాల సమితి అధ్యక్షులు బెల్లాపు దుర్గారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సీఎం రేవంత్ రెడ్డి, డీప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్కలు అసెంబ్లీ బడ్జెట్ ప్రసంగంలో క్యాబినెట్ తీర్మానాన్ని అనుసరించిన నూతనంగా 8 బీసీ కార్పోరేషన్‌లను ప్రకటించడంతో.. పాటు మిగతా11 కార్పోరేషన్లను కంటిన్యూ చేస్తామని చెప్పడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సమితి కోశాధికారి పసుపులేటి కర్ణాకర్, రాష్ట్ర కార్యదర్శి చేర్యాల రాకేష్, ఉపాధ్యక్షులు షేక్ సయ్యద్ భాషా, అహ్మద్ హుస్సేన్, సలహాదారులు కందూరి వెంక ట్రాముడు, మహేంద్ర, మంగిళ్లపల్లి శంకర్, కార్యదర్శులు చేర్యాల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణకు అభినందలుతెలిపిన బీజేపీ నాయకులు

- మందకృష్ణ ముప్పై ఏండ్ల పోరాట ఫలితం ఇది: పెరిక సురేష్



నవతెలంగాణ-అంబర్‌పేట

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ముప్పై ఏండ్లుగా చేసిన నిరంతర పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని బీజేపీ ఓబీసీ మోర్చా సోషల్ మీడియా నేషనల్ మెంబర్ పెరిక సురేష్ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన సంచలనాత్మకమైన తీర్పుగా అభివర్ణించారు. ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు పట్ల పెరిక సురేష్ హర్షం వ్యక్తం చేశారు. మందకృష్ణ పోరాటానికి తమ వంతు సహకారం అందించినట్లు చెప్పారు. 30 ఏళ్ల పోరా టానికి న్యాయం జరిగిందనీ, సుప్రీంకోర్టు తీర్పు న్యాయాన్ని బతికించిందన్నారు. ఈ ప్రక్రియ వేగవంతానికి ప్రధాని చొరవ తీసుకున్నారని సురేష్ తెలిపారు.

అయ్యప్ప స్వాములకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి..



అయ్యప్ప జేఏసీ

నవతెలంగాణ-ధూల్ పేట్

అయ్యప్ప స్వామి మాల ధారణ వేసే భక్తులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని తెలంగాణ అయ్యప్ప జేఏసీ నాయకులు, బాలకృష్ణ నాయిని బుచ్చిరెడ్డి, ప్రేమ్ గాంధీ, క్యాతం రాధాకృష్ణలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం గౌలిపురాలోని అయ్యప్ప స్వామి దేవాలయం ప్రాంగణంలో తెలంగాణ అయ్యప్ప జేఏసీ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాముల, భద్రత, భరోసా బాధ్యత, బాధ్యత అనే అంశంపై అయ్యప్ప స్వాములతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... హజ్ యాత్రకు వెళ్లే వారికి సబ్సిడీ ఏ విధంగా ఇస్తుందో అదే మాదిరిగా శబరి కి వెళ్లే అయ్యప్ప స్వాములకు రాష్ట్ర ప్రభుత్వము రవాణాలో రాయితీ కల్పించాలన్నారు. అయ్యప్ప మాల ధారణ వేసిన వారికి ప్రభుత్వంలోని వివిధ విభాగాలో మాలధరణ వేసిన స్వాములను ఉన్నతాధికారులు వేధింపుల గురి చేస్తున్నారని, ఇది సరైంది కాదని వారు హెచ్చరించారు. శబరిమల వెళ్లే అయ్యప్ప స్వాముల కోసం స్పెషల్ ట్రైన్లు ఈ సారి అదనంగా వేయాలని, అదేవిధంగా ఆర్టీసీ బస్సుల్లో అయ్యప్ప స్వాములకు సబ్సిడీ ఇచ్చే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయాలకు ఎండోమెంట్ శాఖ ఆధ్వర్యంలో వాటి అభివృద్ధి కోసం ప్రత్యేక బడ్జెట్లను కేటాయించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా శబరిమలకు వెళ్లే అయ్యప్ప స్వాములకు టోల్గేట్ రూ. 10వేలు అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నారనీ, వాటిని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలన్నారు. వివిధ నగరాల నుండి శబరిమలైకు పాదయాత్ర ద్వారా వెళ్లే అయ్యప్ప స్వామి భక్తులకు ఆయా దేవాలయాల వద్ద ఎండోమెంట్ ఆధ్వర్యంలో టాయిలెట్లు విశ్రాంతి గదులు భోజన వసతిని, ఏర్పాటు చేయు విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. తెలంగాణ అయ్యప్ప జెఏసి ఆధ్వర్యంలో ప్రతిపాదించిన డిమాండ్ల పరిష్కారం కోసం తమ న్యాయమైన డిమాండ్ల నెరవేర్చడం కోసం త్వరలో 48 గంటల పాటు ధర్నా చౌక్ వద్ద వేలాదిమంది అయ్యప్ప స్వాములతో మహా ధర్నా ను నిర్వహించేందుకు కార్యచరణ రూపొందిస్తున్నామని వారు తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ ధర్మకర్తలు విఎస్ గణేష్ గురుస్వామి, పొట్టేలు సదానందం, బండారి విజయ్ కుమార్,డి యశ్వంత్, మధు కుమార్, గోవర్ధన్ గురుస్వామి కృష్ణ గురుస్వామి లతోపాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున అయ్యప్ప గురు స్వాములు పాల్గొన్నారు.



అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి గాంధీనగర్ శాఖ వారి ఆధ్వర్యంలో నర్మద నర్సింగ్ వద్ద అమావాస్య సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్, వ్యవస్థాపకులు సోమిషెట్టి శ్రీనివాస్, సభ్యులు మురళీధర్ గౌడ్,శోభన్ బాబు,చంద్రశేఖర్, పి.విశ్వనాథం,పి. శ్రీశైలం,పి.శ్రీనివాస్, రవీందర్ రెడ్డి,విజయ్ కుమార్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ ఎన్నికలు నిర్వహించాలి..



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుని ఎన్నికల విషయమై ప్రజాఏక్త పార్టీ కార్యాలయంలో సమావేశమై వైశ్య ప్రముఖులతో చర్చించినట్లు ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తెలుగు విశ్వవిద్యాలయంకు పొట్టి శ్రీరాములు పేరు పెట్టి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం గా 1998లో నామకరణం చేశారన్నారు. ఆయన పేరును మార్చమని ఇటీవల కొన్ని ప్రకటనలు వెలువడ్డాయనీ దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పొట్టి శ్రీరాములు వైశ్యులకు మాత్రమే నాయకుడు కాదని ఆయన జాతీయ నాయకుడని తెలిపారు. వైశ్య మహాసభ అధ్యక్ష ఎన్నికకు భవిష్యత్ కార్యాచరణ ప్రకటించారు అధ్యక్ష ఎన్నికకు ఎన్నికల అధికారిని నియమించి ఎలక్షన్ జరుపుటకు కాల పరిమితి నిర్ణయించి నోటిఫికేషన్ జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైశ్య ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం



- తెలంగాణ అమరుల ఆశయాల సాధన జేఏసీ చైర్మెన్ కటకం మృత్యుంజయ

నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ తొలి దశ, మలిదశ ఉద్యమకారుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేట్లు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ అధికారి ప్రతినిధి, తెలంగాణ అమరుల ఆశయాల సాధన జేఏసీ చైర్మెన్ కటకం మృత్యుంజయ అన్నారు. ఈ మేరకు ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ అమరుల ఆశయాల సాధన జేఏసీ 1969-2014 తొలి దశ, మలిదశ ఉద్యమ సంస్థల సమావేశం జేఏసీ వైస్ ప్రెసిడెంట్ మురళీధర్ దేశపాండే అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కటకం మృత్యుంజయ మాట్లాడుతూ... తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమంలో దాదాపు 2 వేల మంది ఆత్మబలిదానాలు చేసుకున్నారని, వారి కుటుంబాలను, ఉద్యమకారులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడు పట్టించుకోలేదని అన్నారు. అమరవీరులను కనీసం గుర్తించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమకారులను గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు గురించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి న్యాయం చేస్తుందని అన్నారు. ఈ వేదిక ద్వారా అన్ని ఉద్యమ సంస్థలను కలుపుకొని ఓ ప్రణాళిక తయారు చేసుకొని ప్రభుత్వానికి అప్పగించేలేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. వైస్ చైర్మెన్ మురళీధర్ చేశపాండే, నాగా సంపత్, మల్లన్న, నాగార్జున, ఆర్కే సాయికుమార్, సంతోష్ రెడ్డి ,మౌలానా, తదితర నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల చరిత్ర అందరికి తెలియాలి

- దొడ్డి కొమరయ్య సినిమా డైరెక్టర్ మహాలంక సేనాపతి



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ ఉద్యమకారుల చరిత్ర అందరికి తెలియాలి అని పోరాట వీరుడు దొడ్డి కొమరయ్య సినిమాను ప్రారంభించామని డైరెక్టర్ మహాలంక సేనాపతి తెలిపారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి నుంచి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య చరిత్ర సినిమా నిర్మాణానికి సహకరించిన అన్ని కుల సంఘాల రాష్ట్ర అధ్యక్షులకు కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ సభలో సినిమా డైరెక్టర్ మహాలంక సేనాపతి హాజరై మాట్లాడుతూ.. భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరికి విముక్తి కోసం తెలంగాణ ప్రజల స్వేచ్ఛ స్వతంత్రాలకు తన ప్రాణాలను సైతం మార్పించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అని కోనియాడారు. ఆయన ఒక విప్లవ వీరుడని ఆయన జీవిత చరిత్ర ప్రతి ఒక్కరికి తెలియాలని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ చిత్ర నిర్మాణంలో 186 కుల సంఘాల మద్దతుతో దాదాపు కోటి రూపాయల వ్యయంతో నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో తెలంగాణకు సంబంధించిన చిత్ర సినిమాలో అవకాశాల కోసం ఎదురుచూస్తున్న టువంటి కొత్త కళాకారులను ఎన్నుకోవడం జరిగిందని త్వరలోనే చిత్రాన్ని పూర్తిచేసి తెలంగాణ అమరవీరుల జీవిత చరిత్రను ప్రతి ఒక్కరికి తెలిసే విధంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోళ్ల శ్రీనివాస్, డీపీ మల్లయ్య, పరశురాములు, బాణాల మురళి, అశోక్ దాదా తదితర నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు 3 నెలల వేతనాలు వెంటనే ఇవ్వాలి



- సీఐటీయూడిమాండ్

నవతెలంగాణ-మెహిదీపట్నం

సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో రక్షక్ సెక్యూరిటీస్ కాంట్రాక్ట్ సంస్థ క్రింద పనిచేస్తున్న 50 మంది కాంట్రాక్టు కార్మికులకు బకాయి ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ.. నాంపల్లి స్టేషన్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టినారు.

ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు ఎం.వెంకటేష్ మాట్లాడుతూ కార్మికులకు 2024 మే, జూన్, జులై మూడు నెలల జీతాలు ఇప్పటి వరకు ఇవ్వక పోవడం చాలా అన్యాయం అన్నారు. చట్టం ప్రకారం ప్రతి నెల 7వ తేది లోపు కార్మికులకు వేతనాలు ఇవ్వాలని ఉన్నా రైల్వే యాజమాన్యం, రక్షక్ సెక్యూరిటాస్ కాంట్రాక్ట్ సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్నారని విమర్శించారు. మూడు నెలలుగా జీతాలు లేక కార్మికులు ఇండ్ల కిరాయులు కట్టక పోవడం మూలంగా ఇంటి యజమానులు ఇండ్లు ఖాళీ చేయించారని అన్నారు. తినడానికి ఏమీ సరుకులు కొనలేని పరిస్థితి ఉన్నది. పిల్లల స్కూలు ఫీజులు కట్టలేనీ, వైద్యం చేయించుకోలేని పరిస్థితి ఏర్పడ్డదని ఆవేదన వ్యక్తం చేసారు. బకాయి ఉన్న రెండు సంవత్సరాల బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రైల్వే అధికారులు వెంటనే స్పందించి, కార్మిక చట్టాలను ఉల్లంఘించిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని, బకాయి జీతాలు వెంటనే ఇప్పించాలని లేని ఎడల పని బంద్ చేసి సికింద్రాబాద్ లోని రైల్వే జనరల్ మేనేజర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

కె.వి.ఎన్.ఎల్.ప్రసన్నకుమారి... ఉపాధ్యాయి వృత్తి అంటే ప్రేమ. ఆ ప్రేమతోనే పి.జితో పాటు పది డిగ్రీలు చేసినా మూడున్నర దశాబ్దాలుగా ఉపాధ్యాయినిగానే కొనసాగుతున్నారు. అలా అని పిల్లలకు పాఠాలు చెప్పి చేతులు దులుపుకునే టీచర్ మాత్రం కాదు. నిరుపేద పిల్లలు చదువుకునేందుకు వస్తున్న అడ్డంకులను గమనించి వారికి అవసరమైన చేయూతనిస్తున్నారు. వారు ఉన్నత స్థాయికి చేరుకునేలా ప్రోత్సహిస్తున్న ఆమె పరిచయం నేటి మానవిలో...



బీపీ కంట్రోల్ ఎలా?

కొందరు ఉప్పును తగ్గించి తింటారు.. కొందరైతే అసలు ఉప్పే వాడరు. ఏ కొంచెం తిన్నా ఎక్కడ బీపీ పెరిగిపోతుందో అన్న భయంతో తినరు. అయితే.. బీపీ పెరగడానికి ప్రధాన కారణం జీవన శైలి. వేళకు తినకపోవడం, ప్రతీ చిన్న విషయానికి అతిగా రియాక్ట్ కావడం, సరిగా నిద్రపోకపోవడం, అధిక భావోద్వేగాలు బీపీని పెంచుతాయి. ముఖ్యంగా మానసిక ఒత్తిడి బీపీకి దారితీస్తుంది. అలాగే అస్తవ్యస్త తిండి అలవాట్లు, సిగరెట్లు, మద్యం కూడా ఒక కారణం.

ఇలా చేయండి

- ప్రస్తుత పరిస్థితుల్లో 35 ఏళ్ల దాటిన ప్రతీ ఒక్కరూ బీపీని ప్రతీ 3 నెలలకు ఒక సారి చెక్ చేయించుకోవాలి.
- రక్తపోటు అధికంగా ఉంటే డాక్టర్ సహాయం తీసుకుని తగిన చికిత్స తీసుకోవాలి.



- ఒక వేళ బీపీ ఉందని తేలితే జీవన శైలిలో తగిన మార్పులు కచ్చితంగా చేసుకోవాల్సిందే.
- కచ్చితంగా నడక లేదా వ్యాయామం చేయాలి.
- మానసిక ఆందోళనలకు దూరంగా ఉండాలి.
- ధ్యానం చేసి మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి. ఆహారంలో మార్పులు చేసుకోవాలి.
- ఎప్పటికప్పుడు బీపీ ని చెక్ చేసుకుని, రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ లెవెల్స్ పెరగకుండా చూసుకోవాలి.

ఇవి తగ్గించండి

- అధిక ఉప్పు వాడకాన్ని తగ్గించాలి.
- చక్కెర వినియోగాన్ని కూడా తగ్గిస్తే మంచిది.
- సిగరెట్, మద్యపానం అలవాటు ఉంటే మానేస్తే మంచిది.

మనసున్న పంతులమ్మ



ప్రసన్నకుమారి 1968లో హైదరాబాద్‌లో పుట్టారు. తల్లి కలువల సుజాత, తండ్రి లోహితాశ్వరావు. తాతయ్య(అమ్మ తండ్రి) అప్పట్లో షాబాద్ పటేల్ పట్వారిగా పని చేసేవారు. ప్రసన్న తండ్రి గుంటూరు మెడికల్ కాలేజీలో ఉద్యోగం చేసేవారు. దాంతో ప్రసన్న చదువంతా అక్కడే కొనసాగింది. ఆయన నాటకాలు కూడా వేసేవారు. రాజకీయ, సాహిత్య సభలకు కూతుర్ని కూడా తీసుకెళ్లేవారు. చిన్నతనం నుండి కులానికి, మతానికి ఆమె తీవ్ర వ్యతిరేకి. జేకేసీ కాలేజీలో చదివే రోజుల్లో వామపక్ష విద్యార్థి సంఘమైన ఎస్‌ఎఫ్‌ఐ ప్రభావం ఈమెపై ఉండేది.

ఇష్టంగా చదివేవారు

తన చిన్ననాటి స్నేహితురాలైన సరయు తండ్రి సాంబశివరావు పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసేవారు. ఆయన సీపీఎం కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. ప్రసన్నలోని అభ్యుదయ భావాలకు ఈ కుటుంబ ప్రభావం కూడా ఓ కారణం. వీరింటికి వచ్చే ప్రజాశక్తి పత్రికను ఆమె చదువుతుండేవారు. అందులో చక్రవర్తి పేరుతో ప్రజావాణిలో లేఖలు, వ్యాసాలు, కవితలు వస్తుండేవి. వాటిని ఇష్టంగా చదువుతుండేవారు. తర్వాత కాలంలో యాదృచ్ఛికంగా ఆ చక్రవర్తినే ఈమె వివాహం చేసుకొన్నారు. అలాగే కాలేజీలో లెక్చరర్‌గా కత్తి పద్మారావు పాఠాలతో పాటు చెప్పే సామాజిక, రాజకీయ అంశాలు ఆమెను ప్రభావితం చేసేవి. అప్పట్లో యండమూరి, రంగనాయకమ్మ, యద్దనపూడిల నవలలు బాగా చదివేవారు. తల్లి ప్రోత్సాహంతో సంగీతం, వీణ, నృత్యం కూడా నేర్చుకున్నారు. నాటికల్లో కూడా నటించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి వ్యాసరచనల పోటీల్లో ద్వితీయ బహుమతి పొందారు.



కుటుంబానికి అండగా...

డిగ్రీ, డి.సి.పి., డి.పి.యం.(పాలిటెక్నిక్) పూర్తి చేసిన తర్వాత ప్రముఖ విద్యావేత్త మంగాదేవి గుంటూరులో స్థాపించిన శ్రీ వేంకటేశ్వరా బాలకుటీర్‌లో చేరారు. కొంత కాలానికి తండ్రి రిటైర్డ్ అవ్వడంతో వీరి కుటుంబం హైదరాబాద్‌లోని మేనమామ వద్దకు వచ్చి సంతోష్‌నగర్‌లో స్థిరపడింది. తండ్రికి పెన్షన్ కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే వచ్చేది. దాంతో తమ్ముడితో పాటు ఆమె కూడా కాటేదాన్‌లోని బిస్కెట్ ఫ్యాక్టరీలో ఉద్యోగంలో చేరారు. దాంతో ఆమె చదువుకు, ఉద్యోగానికి సంబంధం లేకుండా పోయింది. పైగా అది పాత బస్తీ కావడంతో కర్ఫ్యూలు, మత గొడవలు, బంద్‌లు, బస్సులు ఆగిపోవడం లాంటివి నిత్యం ఉండేవి. దాంతో పాత బస్తీ నుండి కాటేదాన్ వెళ్ళడం ఆమెకు పెద్ద టాస్క్‌గా ఉండేది. అయినా కుటుంబానికి అండగా నిలబడాలని ఆ ఉద్యోగంలో కొనసాగారు. తర్వాత కాలంలో తెలిసిన వారి సహకారంతో ఇంటికి దగ్గరలోని ఇండో ఇంగ్లీష్ హైస్కూల్లో క్లర్క్‌గా చేరారు. అప్పటి వరకు ఉద్యోగం కోసం చేసే ప్రయాణ భారం దగ్గినందుకు ఊపిరి పీల్చుకున్నారు. దాదాపు 19 ఏండ్లు అక్కడే పని చేశారు. 2010లో బాలాపూర్‌లోని సిస్టర్ నివేదిత హైస్కూల్లో చేరారు. అక్కడ ఉద్యోగం చేస్తూనే బి.ఎడ్., ఎమ్మె ఇంగ్లీష్ పూర్తి చేశారు. ప్రస్తుతం అదే పాఠశాలకు ప్రిన్సిపల్‌గా వ్యవహరిస్తున్నారు.

ట్రస్ట్‌కు చైర్‌పర్సన్‌గా

హైదరాబాద్ వచ్చిన తర్వాతనే రచయిత, సమీక్షకులు, వామపక్ష అభిమాని తంగిరాల చక్రవర్తితో ఆమె వివాహం జరిగింది. 'నా జననం సహజం కావొచ్చు. కానీ మరణం చరిత్ర సృష్టించాలి, జీవితం ఆదర్శం కావాలి' అనే భర్త మాటలు ఆమెలో స్ఫూర్తి నింపాయి. స్వప్నించే ఆశయాలు, ఆలోచనలను వాస్తవం చేసే క్రమ శిక్షణ కలిగిన ఈ జంటకు సాయి సుందర్ అనే కొడుకు పుట్టాడు. అతను బి.ఇ. ఇంజనీంగ్ చేసి సాఫ్ట్‌వేర్‌గా స్థిరపడ్డాడు. కోడలు పద్మావతి కూడా గ్రాడ్యుయేట్. తన తండ్రి మరణానంతరం ఆయన పేరుతో తంగిరాల మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటుచేసి పాతికేళ్లుగా అవార్డులను, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న భర్తకు అన్ని విధాలుగా సహకరిస్తున్నారు. ఈ ట్రస్ట్‌కు చైర్‌పర్సన్‌గా ప్రసన్న బాధ్యతలు చూస్తున్నారు. కవితలు, కథలు, వ్యాసాలు రాస్తుంటారు. ఆకాశవాణిలో ప్రసంగాలు కూడా చేశారు. 1999లో 3,4,5,9 తరగతుల విద్యార్థులకు సాంఘిక శాస్త్రంలో అభ్యాస పుస్తకాలు రచించారు. అలాగే తంగిరాల స్మృత్యాంజలి పేరుతో మామగారి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఓ పుస్తకాన్ని ముద్రించారు. అన్వేషణ ఆధ్యాత్మిక అనువాద రచనలు కూడా చేశారు. 2023లో సకలం (కథ, కవిత, వ్యాసరచన, నాటిక, సమీక్ష, ఆత్మకథ) అనే పుస్తకం తీసుకొచ్చారు.

పేద విద్యార్థుల కోసం...

ఉపాధ్యాయురాలిగా పిల్లలకు పాఠాలు చెబితే సరిపోదు. వారి బాగోగులు చూడడం కూడా తన బాధ్యతగా భావించారు ప్రసన్న. అందుకే పేద విద్యార్థులకు తన స్నేహితుల సహకారంతో ఫీజులు కట్టించి చదివిస్తున్నారు. అలాగే పేద విద్యార్థులకు బట్టలు, పుస్తకాలు కూడా అందిస్తున్నారు. అనాథ ఆశ్రమాల్లో ఉండే పిల్లలకు బట్టలతో పాటు ఒకరోజు భోజనం పెట్టి విలువైన పుస్తకాలు వారి లైబ్రేరీలకు అందిస్తుంటారు. అలాగే కారుణ్య సింధు, కరుణశ్రీ సేవా సమితి ఆశ్రయాల్లో పిల్లలకు భోజనం, బట్టలు, పుస్తకాలు ఇచ్చి వారికి వ్యక్తిత్వ వికాస పాఠాలు చెప్పారు. గురు పూజోత్సవం రోజున తన దగ్గర చదువుకున్న విద్యార్థులు ఆమెను గుర్తుపెట్టుకొని దేశ విదేశాల నుండి శుభాకాంక్షలు తెలియజేస్తుంటే మనసుకు ఎంతో తృప్తిగా ఉందంటున్నారు.

- సలీమ



ప్రజలే సింగరేణిని కాపాడుకోవాలి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సింగరేణి సంస్థకే రాష్ట్రంలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను కేటాయించాలని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ డిమాండ్ చేసింది. ప్రభుత్వ రంగంలోని సింగరేణి సంస్థ ప్రయివేటు కంపెనీలతో పోటీ పడాలని కేంద్రం వాదించడం దుర్మార్గమన్నది. దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపింది. బొగ్గు గనుల వేలాన్ని ఆపాలని డిమాండ్ చేసింది. బొగ్గు బ్లాకుల సాధన కోసం సీపీఐ(ఎం) తలపెట్టిన సింగరేణి పరిరక్షణ బస్సు యాత్రకు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు తమ రాజకీయ అనుబంధాలకతీతంగా సింగరేణి పరిరక్షణ ఉద్యమానికి ఐక్యంగా కలిసిరావాలని కోరింది. ప్రజలే సింగరేణిని కాపాడుకోవాలని పిలుపునిచ్చింది. శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌తో పాటు గతంలో ప్రయివేటు సంస్థలకు కేటాయించిన బ్లాకులను తిరిగి సింగరేణికి అప్పగించాలనే డిమాండ్‌పై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శని, ఆదివారాల్లో సీఐటీయూ కౌన్సిల్ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు నాలుగు బొగ్గు బ్లాక్‌లను మోడీ ప్రభుత్వం ప్రయివేటు సంస్థలకు అప్పగించిందన్నారు. ఆ తర్వాత సింగరేణి క్రమంగా బలహీనపడుతూ వస్తున్నదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ప్రమాదకర నిర్ణయం వల్ల సింగరేణి ప్రాంత ప్రజలతో పాటు తెలంగాణ రాష్ట్రం యవత్తూ నష్టపోయే ప్రమాదముందని హెచ్చరించారు. 75 వేల మంది పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగుల నిరంతర శ్రమ, ఉన్నతాధికారుల కృషితో సింగరేణి లాభాల బాటలో ఉందని చెప్పారు. ఈ పదేండ్ల కాలంలో సింగరేణి సుమారు 49వేల కోట్ల రూపాయలను డివిడెంట్ రూపంలో చెల్లించిందనీ, ఏటా రెండు, మూడు వేల కోట్ల రూపాయల లాభాలతో ఉందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి 30 వేల కోట్ల రూపాయలు బకాయి పడి ఉందని తెలిపారు. అలాంటి సింగరేణిని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు మోడీ సర్కారు చూస్తున్నదని విమర్శించారు. సింగరేణి పరిరక్షణ ఉద్యమంలో అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు.

వాయనాడ్ బాధితులకు సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ అండ

కేరళలోని వాయనాడ్ ప్రాంతంలో జరిగిన ప్రకృతి విపత్తులో తీవ్రంగా నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ముందుకొచ్చింది. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తొలివిడత సహాయంగా లక్ష రూపాయల ఆర్థిక సహాయం చేశారు. అందుకు సంబంధించిన చెక్కును సీఐటీయూ అఖిలభారత అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత, కోశాధికారి ఎం.సాయిబాబుకు అందించారు. ఈ నెల నాలుగో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు నిధి సేకరణ క్యాంపెయిన్ చేపట్టాలని కార్మికులకు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు.

ఆరేండ్ల నుంచి ఆరు కి.మీ కట్టలే..!

(మొదటిపేజి తరువాయి)

ఆదేశాలు జారీ చేశారు.

వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్రంలో 175 అసెంబ్లీ స్థానాలు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి తెలంగాణలో 175 అసెంబ్లీ స్థానాలు అవుతాయని, అందులో 135 స్థానాలను మళ్లీ కాంగ్రెస్ కైవసం చేసుకొని అధికారంలోకి వస్తుందని, రేవంత్ రెడ్డే మళ్లీ సీఎం అవుతారని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడానికి కృషి చేస్తున్నామని, అందులో భాగంగానే రూ.31 వేల కోట్లతో రైతు రుణమాఫీ చేసినట్టు తెలిపారు. బాధ్యత కలిగిన ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న కేసీఆర్.. ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు కనీసం అసెంబ్లీకి రాలేదని, ఇదేనా కేసీఆర్ చిత్తశుద్ధి అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు సభను పక్కదారి పట్టించాయని అన్నారు. త్వరలోనే ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, మేడ్చల్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి, బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, ఐఏఎస్ అధికారి హరిచందన తదితరులు పాల్గొన్నారు.

దళిత మహిళపై కర్కశత్వం

(మొదటిపేజి తరువాయి)

తీసుకున్న పోలీసులు.. నిర్దాక్షిణ్యంగా చిత్రహింసలకు గురిచేశారు. నిజం ఒప్పుకోవాలని తన కన్న కొడుకు ముందే తల్లీ కొడుకును దారుణంగా కొట్టారు. ఆ దెబ్బలకు స్పృహ తప్పి పడిపోగా పోలీస్‌స్టేషన్ ఆవరణలోని ఫిర్యాదుదారుని తో బాధితురాలి తలకు, కాళ్లకు జండూబామ్ రాయించారు. ఫిర్యాదుదారుని కారులోనే బాధితుల ను అర్ధరాత్రి ఇంటికి హుటాహుటిన తరలించారు. ప్రస్తుతం దెబ్బలు తిన్న మహిళ తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. పూర్తి వివరాల్లోకి వెళ్తే..షాద్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన నాగేందర్ తన ఇంట్లో బంగారం దొంగతనం జరిగిందని గత నెల 24వ తేదీన షాద్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే కాలనీకి చెందిన సునీత-భీమయ్య దంపతులపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాంతో దొంగతనం ఆరోపణలపై డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రామ్ రెడ్డి, మరో నలుగురు పోలీసు సిబ్బంది సునీత- భీమయ్య దంపతులను మొదట అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత భర్త భీమయ్యను వదిలేసిన పోలీసులు సునీతతోపాటు 13 ఏండ్ల కుమారుడు జగదీష్‌ను స్టేషన్‌లోనే ఉంచుకున్నారు. తల్లి, కొడుకును పోలీసులు తమదైన శైలిలో ఇంటరాగేషన్ చేశారు. డీఐ రాంరెడ్డి సునీతను చిత్రహింసలకు గురిచేశారు. పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చిన రాత్రి తనను బట్టలు విప్పించి బూటు కాళ్లతో తన్ని మరీ కన్న కొడుకు ముందే చితకబాదినట్టు బాధితురాలు తెలిపింది. దొంగతనం ఒప్పుకోకపోవడంతో ఆమె కొడుకు జగదీశ్‌ను కూడా అరికాళ్ళపై రబ్బర్ బెల్ట్‌తో కొట్టారు. దెబ్బలకు తాళలేక సునీత స్పృహ తప్పిపోగా ఆమెను ఇంటికి పంపించారు. అది కూడా ఆమెపై ఫిర్యాదు చేసిన వ్యక్తి కారులోనే పంపించడం గమనార్హం. నాగేందర్ ఇంట్లో బంగారం పోయిందని ఆరోపణలు ఎదుర్కొంటున్న బాధితురాలు సునీత ఇంటి ఎదుట బంగారం దొరికిందని, ఈ దొంగతనం చేసింది సునీతేనని భావించి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. కానీ కేవలం ఆరోపణల నేపథ్యంలో మహిళలపై పోలీసులు అరాచకం సృష్టించారు. అయితే మొత్తం 26 తులాల బంగారం, రూ. రెండు లక్షల నగదు పోయిందని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అందులో తులం బంగారం, రూ.నాలుగు వేలు రికవరీ చేసినట్టు పోలీసులు తెలిపారు. కాగా, మహిళపై పోలీసుల దాడి ఘటనపై విచారణకు ఆదేశించినట్టు శంషాబాద్ డీసీపీ రాజేష్ తెలిపారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తామని చెప్పారు. వాస్తవాలు తేలితే మహిళలపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ తెలిపారు.

బాధితురాలిని పరామర్శించిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ బృందం

పోలీసుల దాడిలో తీవ్రంగా గాయపడి షాద్‌నగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు సునీతను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ బృందం ఆదివారం పరామర్శించింది. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య, ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ ప్రీతం.. ఆమెను పరామర్శించి ఘటనకు గల కారణాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ఉపయోగించడం సిగ్గుచేటని, మహిళ అని చూడకుండా విచక్షణా రహితంగా వ్యవహరించడం హేయమైన చర్య అని అన్నారు. మహిళకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని తెలిపారు.

కేంద్ర బడ్జెట్ దళిత వ్యతిరేకం

(మొదటిపేజి తరువాయి)

ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు."దేశంలోని దళితులు ప్రధానంగా వ్యవసాయ కార్మికులకు గానూ, అసంఘటిత రంగాల్లోనూ ఉపాధి పొందుతున్నారన్నారు. సామాజిక అభివృద్ధికి, దళిత సంక్షేమానికి కేంద్రం ప్రతి యేటా తగిన బడ్జెట్ కేటాయించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కానీ, దశాబ్ద కాలంగా బీజేపీ హయాంలో షెడ్యూల్డ్ కులాల బడ్జెట్ ఖర్చులు తగ్గుముఖం పట్టాయన్నారు. దళిత జనాభా నిష్పత్తికి అనుగుణంగా కేటాయింపులు లేకపోగా, సవరించిన బడ్జెట్‌ల ప్రకారం కేటాయించిన నిధులు సైతం తగ్గుముఖం పడుతున్నాయని విమర్శించారు. "నీటీ ఆయోగ్ సిఫారసులు, దళిత జనాభా ప్రకారం షెడ్యూల్డ్ కులాలకు రావాల్సిన కేటాయింపులు 16.2 ఉండాలని, కానీ గడిచిన పదేండ్ల బడ్జెట్ అంచనాల్లో బడ్జెట్‌లో 11 శాతం దాటలేదని పేర్కొన్నారు. ఎస్సీలకు కేటాయించిన మొత్తం రూ.1,65,493 కోట్లు కాగా, ఇందులో 3.2 శాతం (రూ.46,195 కోట్లు) మాత్రమే నేరుగా ఎస్సీలకు చేరుతోందన్నారు. కేంద్ర బడ్జెట్ 2024-25లో సామాజిక న్యాయం, సాధికారత శాఖ కోసం నివేదించిన మొత్తం కేటాయింపులు రూ. 13,000 కోట్లని, ఇది 2023-24 తో పోలిస్తే రూ.163 కోట్లు పెరిగిందన్నారు. ఈ కేటాయింపులు 2023-24లో సవరించిన అంచనాల్లో రూ.9,853.32 తగ్గించారన్నారు. షెడ్యూల్డ్ కులాల కోసం పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు మొత్తం బడ్జెట్‌లో గణనీయమైన వాటా కేటాయింపు 49 శాతం పొందినప్పటికీ గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం ఎలాంటి మార్పు లేదన్నారు. 2023-24 లో రూ.6,359 కోట్లు కేటాయించగా, అదే ఏడాది సవరించిన అంచనాల్లో రూ.5,400 కోట్ల కేటాయింపు తగ్గిందని తెలిపారు. ఈ దళిత వ్యతిరేక బడ్జెట్ పై దేశవ్యాప్తంగా దళిత హక్కుల కోసం నినదించే సంఘాలు ఆందోళనను నిర్వహించాలని దళిత హక్కుల కోసం సమన్వయ కమిటీ పిలుపునిచ్చిందని తెలిపారు.

ప్రధాన డిమాండ్లు

1. షెడ్యూల్డ్ కులాలను సామాజిక అభివృద్ధిలోకి తీసుకురావడానికి బడ్జెట్‌లో కేటాయింపులను సవరించాలి.
2. ప్రభుత్వ రంగ ప్రయివేటీకరణను ఆపాలి. బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి. దళితులకు ప్రయివేటు రంగాల్లో రిజర్వేషన్ల బిల్లును ఈ పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టాలి.
3. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధికి నిధుల కేటాయింపు, వినియోగాన్ని నిర్ధారించడానికి జాతీయ స్థాయిలో సబ్ ప్లాన్ చట్టాన్ని అమలు చేయాలి.
4. విద్య, ఉపాధి, పారిశ్రామిక రంగాల్లో షెడ్యూల్డ్ కులాల వారి భాగస్వామ్యం, సాధికారతను మెరుగుపరచడానికి తగిన వనరులను అందించాలి.
5. పదోన్నతుల్లో రిజర్వేషన్ల రాజ్యాంగ రక్షణను అనుసరించాలి.
6. దళితులపై అఘాయిత్యాలు జరగకుండా నిరోధించడానికి ఎస్సీ, ఎస్టీ లైంగికదాడి నిరోధక చట్టాన్ని స్ఫూర్తిగా అమలు చేయాలి.

గుజరాత్‌లో న్యాయ్ యాత్ర

(మొదటిపేజి తరువాయి)

ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీలు కూడా యాత్రలో చేరే అవకాశమున్నదని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ యాత్ర మోర్బీలో ప్రారంభమై ఈనెల 22న గాంధీనగర్‌లో ముగుస్తుందని వివరించాయి. గుజరాత్‌లో ఇటీవల జరిగిన దుర్ఘటనల బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ యాత్రను ప్రారంభించనున్నట్టు పార్టీ నాయకుడు ఒకరు తెలిపారు.మోర్బీ వంతెన కూలిపోవడం, రాజ్‌కోట్‌లో టీఆర్పీ గేమ్ జోన్ అగ్నిప్రమాదం, వడోదరలోని హర్ని సరస్సు విషాదంతో సహా గత రెండేండ్లలో రాష్ట్రం, మొత్తం దేశాన్ని కుదిపేసిన విధ్వంసకర సంఘటనల శ్రేణిని వెలుగులోకి తీసుకురావటమే ఈ మార్చ్ లక్ష్యమని గుజరాత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోహిల్ అన్నారు. ఈ విపత్తులు కేవలం ప్రమాదాలు కావనీ, బీజేపీ ప్రభుత్వంలోని వ్యవస్థాగత అవినీతి, నిర్లక్ష్య ధోరణికి ప్రత్యక్ష ఫలితం అని కాంగ్రెస్ ఆరోపించింది. "బీజేపీ దుష్పరిపాలన, అవినీతి కారణంగా నష్టపోయిన వారికి న్యాయం చేయాలనే మా మార్గం ఈ న్యాయ్ పాదయాత్ర. మోర్బీ వంతెన కూలిపోవటం, టీఆర్పీ గేమ్ జోన్‌లో అగ్నిప్రమాదం, హర్ని సరస్సు దుర్ఘటన వంటి విషాద ఘటనలకు దారితీసిన వారి పాలనలో విచ్చలవిడిగా మారిన అవినీతిని బయటపెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని గుజరాత్ శాసనసభ ఉపనేత శైలేష్ పర్మార్ అన్నారు. బీజేపీ పాలనలో స్థానికంగా ప్రబలిన అవినీతిని బహిర్గతం చేయటమే తమ పార్టీ లక్ష్యమని పర్మార్ చెప్పారు. 2022 అక్టోబర్‌లో 135 మంది ప్రాణాలను బలిగొన్న విషాదకరమైన వంతెన కూలిపోయిన ప్రదేశమైన మోర్బీ నుంచి ప్రారంభించి, మార్చ్ రాష్ట్ర రాజధాని గాంధీనగర్‌కు వెళ్తుందని వివరించారు. పాదయాత్ర వివిధ జిల్లాల గుండా సాగుతుండగా జన్ సంవాద్ (పబ్లిక్ డైలాగ్) సమావేశాలను నిర్వహించాలని కాంగ్రెస్ యోచిస్తున్నది. పార్టీ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్, ప్రియాంక సహా పార్టీ సీనియర్ నేతలకు సమాచారం అందించామనీ, యాత్రలో వారు పాల్గొంటారని ఆశిస్తున్నామని గుజరాత్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనీష్ దోషి తెలిపారు.

పెట్టుబడుల కోసం ప్రయత్నించండి

(మొదటిపేజి తరువాయి)

కే తారకరామారావు (కేటీఆర్) శుభాకాంక్షలు తెలిపారు. పెట్టుబడుల ఆకర్షణలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. గడచిన పదేండ్ల తమ ప్రభుత్వ హయాంలో అనేక బహుళజాతి కంపెనీలు, ప్రపంచ దిగ్గజ సంస్థలను హైదరాబాద్‌కి తీసుకు రాగలిగామని పేర్కొన్నారు. ఆయా కంపెనీలకు తెలంగాణ రాష్ట్రంతో ప్రత్యేక అనుబంధం ఏర్పరిచామని తెలిపారు. తాము తెచ్చిన వ్యాపార వాణిజ్య విధానాలు, టీఎస్ ఐపాస్ వంటి అనుమతుల ప్రక్రియ వల్ల కంపెనీలు తమ విస్తరణ ప్రణాళికలో తెలంగాణ రాష్ట్రానికి ప్రాధాన్యత ఇస్తున్నాయని చెప్పారు. గడచిన పదేండ్లలో రాష్ట్రానికి రూ.నాలుగు లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను తెచ్చి, 24 లక్షల మందికి ప్రయివేటు రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించామని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం కూడా అలాంటి కంపెనీలతో మరోసారి చర్చలు నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు వస్తాయని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు. తమ పార్టీ రాజకీయాలకు అతీతంగా తెలంగాణకే తొలి ప్రాధాన్యత ఇస్తుందన్నారు.

వక్ఫ్ ఆస్తులపై కేంద్రం కన్ను

(మొదటిపేజి తరువాయి)

ప్రధాన సవరణ కూడా వీటిలో ఉంది. 'చట్ట సవరణల ప్రకారం ఆస్తులకు సంబంధించి వక్ఫ్ బోర్డు తీసుకునే అన్ని నిర్ణయాల పైన విధిగా పరిశీలన జరుగుతుంది. తనకు చెందినవిగా వక్ఫ్ బోర్డు చెప్పుకునే ఆస్తులపై తప్పనిసరిగా పరిశీలన జరపాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది' అని ఆ వర్గాలు తెలిపాయి.ఈ సవరణలకు సంబంధించిన బిల్లును వచ్చే వారం పార్లమెంటులో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. వక్ఫ్ బోర్డు ప్రస్తుతం 8,70,000 ఆస్తులను పర్యవేక్షిస్తోంది. వీటి విస్తీర్ణం 9,40,000 ఎకరాలు. 1975వ సంవత్సరం నాటి వక్ఫ్ చట్టానికి సవరణల ద్వారా 2013లో అప్పటి యూపీఏ ప్రభుత్వం ఈ బోర్డుల అధికారాలను బలపరిచింది. కాగా సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లోనూ, రాష్ట్ర బోర్డుల్లోనూ మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచాలని సవరణల్లో ప్రతిపాదించారు. ఆస్తులపై హక్కులకు సంబంధించి రాష్ట్ర వక్ఫ్ బోర్డులకు విస్తృత అధికారాలు ఉన్నాయని, అనేక రాష్ట్రాల్లో ఆ ఆస్తుల సర్వేలో జాప్యం జరుగుతోందని కేంద్రం గుర్తించిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఆస్తుల దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకు వాటి పర్యవేక్షణలో జిల్లా మెజిస్ట్రేట్లను భాగస్వాములను చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్‌ల నిర్మాణం వెంటనే ప్రారంభించాలి

అంబేద్కర్ నాలెడ్జ్ కోచింగ్ సెంటర్ల నిర్మాణంలో వేగం పెంచాలి : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఇప్పటికే గుర్తించిన 20 ప్రాంతాల్లో వెంటనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్‌ల నిర్మాణం ప్రారంభించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ఆదివారం డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో విద్యాశాఖ, ఆర్‌అండ్ బీ, ప్రయివేటు నిర్మాణ సంస్థ తదితరులతో ఆయన ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, లేఔట్లు, నిర్మాణ డిజైన్లు, వసతులు, బడ్జెట్ దగ్గర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. మొదటి దశలో ప్రారంభిస్తున్న 20 ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం వచ్చే ఏడాది జూన్ కల్లా పూర్తి కావాలని ఆదేశించారు. గతంలో చేసిన సూచనలు ఏ మేరకు అమలు చేశారో ఫ్రీ కాస్ట్ నిర్మాణ సంస్థ నిర్వాహకులను విచారించారు. ఇప్పటివరకు మొత్తం 37 ప్రాంతాల్లో 49 పాఠశాలల నిర్మాణానికి సంబంధించిన స్థలాల వివరాలు వచ్చినట్టు విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్ర వెంకటేశం వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న అంబేద్కర్ నాలెడ్జ్ కోచింగ్ సెంటర్స్ నిర్మాణం పనులు త్వరితగతిన ప్రారంభించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశం, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరసింహారెడ్డి, మహాత్మ జ్యోతిబాపూలే సెక్రెటరీ సైదులు, ఎస్టీ, ఎస్సీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ సెక్రటరీ సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నవచిత్రం

క్లైమాక్స్‌లో విశ్వంభర



చిరంజీవి

చిరంజీవి మోస్ట్ ఎవైటెడ్ సోషియో-ఫాంటసీ ఎంటర్టైనర్ 'విశ్వంభర'. రాబోయే సంక్రాంతి రిలీజ్‌కి సిద్ధంగా ఉంది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ సహా ప్రొడక్షన్ పనులు జరుగుతున్న ఈ సినిమా షెడ్యూల్ ప్రకారం ముందుకు సాగుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో భారీ స్థాయిలో చిత్రీకరణ జరుపుకుంటున్న 'విశ్వంభర' క్లైమాక్స్‌కు చేరుకుంది. ఈ క్లైమాక్స్ సీక్వెన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా, విజువల్ వండర్‌గా వుండబోతోంది. వశిష్ట క్రియేటివ్ అప్రోచ్‌తో ఫాంటసీ ఎలిమెంట్స్‌ని విజువల్‌గా మహాఅద్భుతంగా ప్రజెంట్ చేస్తున్నారు.

ఈ ఇంటెన్స్ క్లైమాక్స్‌కి ఇండియన్ టాప్ యాక్షన్ కొరియోగ్రాఫర్ అన్ల్ అరసు యాక్షన్ డిజైన్ చేస్తున్నారు. క్లైమాక్స్ ప్రేక్షకుల అంచనాలను మించి ఉంటుంది. క్లైమాక్స్ సీక్వెన్స్ స్కేల్, స్కోప్ చాలా గ్రాండ్‌గా ఉంటాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మాతలు విక్రమ్, వంశీ, ప్రమోద్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో త్రిష కృష్ణన్, ఆషికా రంగనాథ్ కీలక పాత్రలు పోషిస్తుండగా, కునాల్ కపూర్ పవర్ ఫుల్ రోల్‌లో కనిపించనున్నారు.

సంక్రాంతి కానుకగా జనవరి 10న ఈ సినిమా విడుదల కానుంది. ఈ చిత్రానికి రచన,దర్శకత్వం: వశిష్ట, నిర్మాతలు: విక్రమ్, వంశీ, ప్రమోద్, సంగీతం: ఎంఎం కీరవాణి, డీవోపీ: చోటా కె నాయుడు, ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్.

కలర్‌ఫుల్‌గా స్పార్క్.. సాంగ్



మీనాక్షిచౌదరి, విజయ్

విజయ్, వెంకట్ ప్రభుల మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా మూవీ ది గోట్. (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్). ఈ సినిమా మ్యూజిక్ ప్రమోషన్స్ చార్ట్ బస్టర్ నోట్‌లో స్టార్ట్ అయ్యాయి. ఫస్ట్ సింగిల్ 'విజిలేస్కో', సెకండ్ సింగిల్ 'నిన్ను కన్న కనులే' చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. తాజాగా మేకర్స్ 'స్పార్క్..' సాంగ్‌ని రిలీజ్ చేశారు.

యువన్ శంకర్ రాజా ఈ పాటని థంపింగ్ బీట్స్‌తో వైరల్ ట్యూన్‌గా కంపోజ్ చేశారు. రామజోగయ్య శాస్త్రి అందించిన లిరిక్స్ చాలా క్యాచీగా ఉన్నాయి. యువన్ శంకర్ రాజా, వృష బాలు ఎనర్జిటిక్‌గా పాడారు. ఈ సాంగ్‌లో విజయ్ డ్యాన్స్ మూమెంట్స్ మెస్మరైజ్ చేశాయి. విజయ్, మీనాక్షి చౌదరి మాగ్నటిక్ కెమిస్ట్రీని షేర్ చేసుకున్నారు. ఈ సాంగ్ ఇన్‌స్టంట్ హిట్‌గా నిలిచింది. విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో ప్రశాంత్, ప్రభుదేవా, మోహన్, జయరామ్, స్నేహ, లైలా, అజ్మల్ అమీర్, మీనాక్షి చౌదరి తదితరులు నటిస్తున్నారు.

స్నేహితులను గుర్తు చేసే సయ్యారే సయ్యా..



నివేత థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ లీడ్ రోల్స్ లో నటించిన న్యూ ఏజ్ క్లీన్ ఎంటర్‌టైనర్.'35-చిన్న కథ కాదు'.

సురేష్ ప్రొడక్షన్స్, ఎస్ ఒరిజినల్స్, వాల్టెయిర్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రానికి నంద కిషోర్ ఈమాని రైటర్, డైరెక్టర్.

ఆదివారం మేకర్స్ ఫ్రెండ్ షిప్ డే సందర్భంగా ఫస్ట్ సింగిల్ 'సయ్యారే సయ్యా..' పాటని రిలీజ్ చేశారు. ఫ్రెండ్షిప్‌ని సెలబ్రేట్ చేసుకునే ఈ పాటని వివేక్ సాగర్ చాలా లైవ్లీగా కంపోజ్ చేశారు. వినగానే మనసుని హత్తుకునే ఈ ట్యూన్ డిలైట్ ఫుల్‌గా ఉంది. కిట్టు విస్సాప్రగడ రాసిన లిరిక్స్ చిన్ననాటి జ్ఞాపకాలను, స్నేహాలని గుర్తుకు తెస్తోంది. సింగర్ కార్తీక్ ఈ సాంగ్‌ని జాయ్ ఫుల్‌గా పాడారు. ఇన్‌స్టంట్‌గా కనెక్ట్ అయ్యే ఈ సాంగ్ ఫ్రెండ్ షిప్ డేకి పెర్ఫెక్ట్ ట్రీట్. స్కూల్ ఎపిసోడ్స్ స్పెషల్ ఎట్రాక్షన్‌గా క్లీన్ ఎంటర్ టైన్‌మెంట్‌తో అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేందుకు ఈ సినిమా రెడీ అవుతోంది. ఈనెల15న తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో ఒకేసారి విడుదల కానుంది. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: నంద కిషోర్ ఈమాని, నిర్మాతలు: రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి.

వాయనాడ్ బాధితులకు అండగా..



చిరంజీవి, రామ్‌చరణ్



అల్లుఅర్జున్

కేరళలోని వాయనాడ్ బాధితులను ఆదుకునేందుకు తెలుగు చిత్ర సీమ సైతం మేం ఉన్నామంటూ అండగా నిలబడుతోంది. ఇందులో భాగంగాకి చిరంజీవి మరోమారు తన మంచి మనసుని చాటుకున్నారు. ఇప్పుడు కేరళలోని వయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడి వందలాది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. చాలా మంది సాయం కోసం ఎదురు చూస్తున్నారు. కేరళ ప్రభుత్వానికి సినీ ఇండస్ట్రీకి చెందిన పలువురు ప్రముఖులు ఇప్పటికే తమ మద్దతుని తెలియజేసిన సంగతి తెలిసిందే. తాజాగా చిరంజీవి, ఆయన తనయుడు రామ్‌చరణ్ కలిసి వయనాడ్ బాధితుల కోసం కోటి రూపాయల విరాళాన్ని ప్రకటించారు. 'వయనాడ్ జిల్లాలో ప్రాణాలు కోల్పోయిన వారి విషయంలో నా గుండె తరుక్కుపోతుంది. బాధితులు కోలుకోవాలని ప్రార్థిస్తున్నా' అంటూ చిరంజీవి సోషల్ మీడియా వేదికగా సానుభూతిని ప్రకటించారు.

ఇదిలా ఉంటే, హీరో అల్లు అర్జున్ కూడా నేను సైతం.. అంటూ తన మంచి మనసుని మరోమారు చాటుకున్నారు. అల్లు అర్జున్‌కి దేశవ్యాప్తంగా ఎంతో మంది అభిమానులున్నారు. సినిమాలతో పాటు, ఆయన పలు సేవా కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పాల్గొంటారు. వయనాడ్ బాధితులకుయ తన వంతుగా 25 లక్షల రూపాయలని కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా ప్రకటించారు. ఇప్పటికే కమల్‌హాసన్ రూ. 25 లక్షలు, విక్రమ్ రూ.20 లక్షలు, రష్మిక రూ.10 లక్షలు, హీరో సూర్య, ఆయన భార్య జ్యోతిక, సూర్య సోదరుడు కార్తి సంయుక్తంగా రూ.50 లక్షలు, నయనతార, విఘ్నేశ్ శివన్ దంపతులు రూ.20 లక్షలు, మమ్ముట్టి, ఆయన తనయుడు దుల్కర్‌సల్మాన్ రూ.35 లక్షలు, పహాద్ ఫాజిల్ రూ.25 లక్షల విరాళం ప్రకటించారు.

టాలీవుడ్ ప్రతిష్టాత్మక సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ తరపున నిర్మాత సూర్యదేవర నాగవంశీ రూ.5 లక్షల విరాళాన్ని అందించారు.

తాను వ్యవస్థాపకుడిగా ఉన్న విశ్వశాంతి ఫౌండేషన్ ద్వారా రూ.3 కోట్ల విరాళం ఇవ్వడమే కాకుండా స్వయంగా సహాయక చర్యల్లో పాల్గొంటూ మోహన్‌లాల్ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

దసరాకు 6 ఫిల్మ్ ఫేర్ అవార్డులు



నాని నటించిన హై-ఆక్టేన్ మాస్, యాక్షనర్ 'దసరా' ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్‌లో రిమార్కబుల్ ఇంపాక్ట్‌ని చూపింది. శనివారం అత్యంత వైభవంగా జరిగిన 69వ శోభా ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్‌లో ఆరు వేర్వేరు విభాగాలలో ఈ సినిమా అవార్డుల్ని కైవసం చేసుకుంది.

ధరణి క్యారెక్టర్‌లో అదరగొట్టిన నాని ప్రతిష్టాత్మకమైన ఉత్తమ నటుడు అవార్డు అందుకున్నారు. వెన్నెల పాత్రలో అత్యద్భుతమైన నటనకు గానూ కీర్తి సురేష్ ఉత్తమ నటి అవార్డును అందుకుంది.

తొలి డెబ్యూ డైరెక్టర్‌గా శ్రీకాంత్ ఓదెల ఈ అవార్డును సొంతం చేసుకున్నారు. సినిమాటోగ్రాఫర్ సత్యన్ సూర్యన్ సినిమా డైనమిక్ విజువల్స్‌ను అందించడంలో అసాధారణమైన వర్క్‌కి గాను అవార్డు అందుకున్నారు. ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా సినిమా సెట్స్, విజువల్ ఎన్విరాన్మెంట్ రూపొందించడంలో తన అద్భుతమైన పనితీరుతో అవార్డును అందుకున్నారు.

ఎనర్జిటిక్, ఎంగేజింగ్ ధూమ్ ధామ్ పాటకు కొరియోగ్రాఫర్ ప్రేమ్ రక్షిత్ మాస్టర్‌ను అవార్డ్ అందుకున్నారు.

ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ, "ఒకప్పుడు నాకు చాలా అవార్డులు రావాలనే కోరిక ఉండేది. కానీ ఇప్పుడా ఆ కోరిక తగ్గింది. నాకు అవార్డుల కోసం ఇప్పుడు బలమైన కోరిక లేదు. ఇప్పుడు నా కోరికంతా నా దర్శకులు, టెక్నీషియన్లు, నిర్మాతలు, నా సినిమాల్లో పరిచయమైన కొత్త టాలెంట్‌లు, ఇతర ఆర్టిస్టులు అవార్డులు అందుకోవాలనే. అదే నన్ను చాలా ఉత్తేజపరుస్తుంది. శ్రీకాంత్, శౌర్యువ్ అవార్డులు గెలుచుకున్నందుకు నేను స్పెషల్‌గా థ్రిల్ అయ్యాను. ఆ మూమెంట్‌లో నేనూ భాగం కావడం విశేషం. 2023 సంవత్సరం చాలా ప్రత్యేకమైనది. 'దసరా, హాయ్ నాన్న' రెండు బిగ్ బ్లాక్‌బస్టర్‌లు సాధించడం ఆనందంగా ఉంది' అని చెప్పారు. నాని తాజాగా నటించిన 'సరిపోదా శనివారం' ఈనెల 29న ప్రేక్షకుల ముందుకు రానుంది.

దసరాని అద్భుతంగా నిర్మించిన ఎస్ఎల్‌వి సినిమాస్ నిర్మాత సుధాకర్ చెరుకూరి, నాని, శ్రీకాంత్ ఓదెల బ్లాక్‌బస్టర్ కాంబినేషన్‌లో మరొక యూనిక్, హై బడ్జెట్ మూవీ కోసం మరోసారి కొలాబరేషన్‌కి రెడీగా ఉన్నారు.

సింబా రిలీజ్‌కి రెడీ



అనసూయ, జగపతి బాబు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సింబా'. సంపత్ నంది టీం వర్క్స్, రాజ్ దాసరి ప్రొడక్షన్స్ బ్యానర్ల మీద సంపత్ నంది, దాసరి రాజేందర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. సంపత్ నంది అందించిన ఈ కథకు మురళీ మనోహర్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని ఈనెల 9న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో శనివారం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్, ఎమ్మెల్యే విజయ రమణారావు, రాజ్ ఠాకూర్ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

సంపత్ నంది మాట్లాడుతూ, 'అందరికీ కనువిప్పు కలిగేలా, ఎంటర్టైన్ చేసేలా, మంచి సందేశం ఇచ్చేలా ఉంటుంది ఈ సినిమా. మా నిర్మాత రాజేందర్ రెడ్డి సమాజానికి మంచి చేయాలని, ఏదైనా తిరిగి ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ చిత్రం చేశారు' అని అన్నారు. 'ఇది చాలా కొత్త కథ, కొత్త పాయింట్‌తో రాబోతోంది. సంపత్ నంది అద్భుతంగా కథ రాశారు. నేను దర్శకత్వం వహించాను. ఇంత మంచి ప్రాజెక్ట్‌ను రాజేందర్ నిర్మించేందుకు ముందుకు వచ్చారు. ఆయన విజన్‌కు హ్యాట్సాఫ్' అని దర్శకుడు మురళీ మనోహర్ చెప్పారు. నిర్మాత రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, 'వనజీవి రామయ్య కోటికి పైగా మొక్కలు నాటారు. స్కూల్ పుస్తకాల్లో వీరి మీద పాఠాలున్నాయి. వీళ్లని చూసి ఇన్‌స్పైర్ అయి ఈ కథను రాసుకున్నాం. ప్రకృతి లేకపోతే మనం ఉండలేం. ప్రకృతికి కోపం వస్తే ఎలా ఉంటుందో అందరికీ తెలుసు. మా గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టబోతోన్నాం. ఈనెల 22న చిరంజీవిపుట్టిన రోజున కొన్ని వేల మొక్కల్ని ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. మా సినిమా నుంచే లాభాల్ని కూడా మొక్కల రూపంలోనే ఖర్చు పెట్టాలని అనుకుంటున్నాం. ఇప్పటి వరకు ఇలాంటి కాన్సెప్ట్‌తో ఇండియన్ స్క్రీన్ మీద సినిమా రాలేదు' అని అన్నారు.



పారిస్ ఒలింపిక్స్ హాకీ క్వార్టర్‌ఫైనల్. అగ్రజట్టు గ్రేట్ బ్రిటన్‌తో హాకీ ఇండియా అమీతుమీ. హాకీలో రెడ్ కార్డ్ అత్యంత అరుదు. అటువంటిది స్టార్ డిఫెండర్ అమిత్ రోహిదాస్ రెడ్‌కార్డ్‌తో దాదాపుగా మూడు క్వార్టర్ల ఆటకు దూరమయ్యాడు. గోల్స్ వేటలో దూకుడుగా ఆడే బ్రిటన్‌తో పది మందితో కూడిన టీమ్ ఇండియా అప్రతిహాత విజయం సాధించింది. డిఫెన్స్‌లో గత రెండు దశాబ్దాల్లోనే అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన భారత్.. పారిస్ ఒలింపిక్స్ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. ఉత్కంఠభరిత షూటౌట్‌లో బ్రిటన్‌పై 4-2తో విజయం సాధించింది. ఇక్కడ్నుంచి భారత్ కనీసం ఒక్క విజయం సాధించినా.. వరుస ఒలింపిక్స్‌లో పతకం ఖాయమే!.

చక్‌దే ఇండియా!

- ఒలింపిక్ సెమీస్‌లో హాకీ ఇండియా
- క్వార్టర్‌ఫైనల్లో బ్రిటన్‌పై ఘన విజయం
- షూటౌట్‌లో 4-2తో భారత్ జయకేతనం
- పారిస్ 2024 ఒలింపిక్స్

షూటౌట్‌లో ఎవరెలా (బ్రిటన్ 2-4 భారత్)
- ఆల్బరీ జేమ్స్ (1-0) (బ్రిటన్)
- హర్మన్‌ప్రీత్ సింగ్ (1-1)
- వాల్లాస్ జాక్ (2-1) (బ్రిటన్)
- సుఖ్‌జీత్ సింగ్ (2-2)
- విలియమ్సన్ కోనర్ (2-2) (బ్రిటన్)
- లలిత్ కుమార్ (2-3)
- రోపర్ ఫిలిప్ (2-3) (బ్రిటన్)
- రాజ్‌కుమార్ పాల్ (2-4)

నవతెలంగాణ-పారిస్

ఒలింపిక్స్‌లో హాకీ ఇండియా దూసుకెళ్తోంది. మూడేండ్ల కిందట టోక్యో ఒలింపిక్స్ ప్రదర్శనను పునరావృతం చేసింది. ఆదివారం జరిగిన హాకీ క్వార్టర్‌ఫైనల్లో అగ్ర జట్టు గ్రేట్ బ్రిటన్‌పై మెరుపు విజయం సాధించి.. పారిస్ ఒలింపిక్స్ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. నిర్ణీత 60 నిమిషాల ఆటలో గ్రేట్ బ్రిటన్, భారత్‌లు 1-1తో సమవుజ్జీలుగా నిలిచాయి. దీంతో మ్యాచ్ ఫలితాన్ని షూటౌట్‌లో నిర్ణయించారు. ఉత్కంఠగా సాగిన షూటౌట్‌లో భారత్ నుంచి వరుసగా నలుగురు ఆటగాళ్లు గోల్స్ నమోదు చేయగా.. గ్రేట్ బ్రిటన్ నుంచి తొలుత ఇద్దరు గోల్స్ కొట్టారు. ఆ తర్వాత రెండు గోల్ ప్రయత్నాలను దిగ్గజ గోల్ కీపర్ పీఆర్ శ్రీజేష్ సమర్థవంతంగా నిలువరించాడు. దీంతో 4-2తో భారత్ ఘన విజయం సాధించింది. ఆట 17వ నిమిషంలో స్టార్ డిఫెండర్ అమిత్ రోహిదాస్‌కు రెడ్ కార్డ్ ఇవ్వటంతో.. అక్కడ్నుంచి భారత్ పది మంది ఆటగాళ్లతోనే పోటీపడింది. గ్రేట్ బ్రిటన్‌పై గ్రేట్ విజయాన్ని అందుకుంది.

సూపర్ షో

భారత్, గ్రేట్ బ్రిటన్ క్వార్టర్‌ఫైనల్లో.. హాకీ ఇండియా ఫేవరేట్‌గా బరిలోకి దిగింది. టోక్యో ఒలింపిక్స్‌లో బ్రిటన్‌ను చిత్తు చేసిన ఉత్సాహంతో హర్మన్‌ప్రీత్ సేన ఉత్సాహంగా కనిపించింది. ఊహించినట్టుగానే బంతి నియంత్రణలో బ్రిటన్ పైచేయి సాధించింది. 54 శాతం బ్రిటన్ నియంత్రణలో ఉండగా.. భారత్ 46 శాతమే నియంత్రణలో ఉంచుకుంది. ఎదురుదాడికి బ్రిటన్ పెట్టింది పేరు. కానీ భారత డిఫెన్స్ గత 20 ఏండ్లలో ఎరుగని ప్రదర్శనతో కదం తొక్కింది. బ్రిటన్ ఏకంగా 21 సార్లు భారత గోల్‌పోస్ట్‌పై దాడి చేసింది. కానీ గోల్ కీపర్ శ్రీజేష్ గోడ కట్టాడు. భారత్ మాత్రం ఎనిమిది పర్యాయాలు మాత్రమే బ్రిటన్ గోల్ పోస్ట్‌పై దాడి చేసింది. ఈ క్రమంలో రెండు జట్లు చెరో సారి విజయవంతం అయ్యాయి.

ఆట తొలి 15 నిమిషాల్లోనే గోల్ ప్రయత్నాలు జరిగినా.. ఆట సమతూకంగా నిలిచింది. రెండో క్వార్టర్‌లో ఆట ఊహించని మలుపులు తిరిగింది. 17వ నిమిషంలో డిఫెండర్ అమిత్ రోహిదాస్ రెడ్ కార్డ్ శిక్షకు గురయ్యాడు. దీంతో ఆ తర్వాతి నుంచి భారత్ పది మంది ఆటగాళ్లతోనే ఆడింది. 22వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను గుర్జంత్ సింగ్ సద్వినియోగం చేసుకోలేదు. కానీ అదే నిమిషంలో లభించిన మరో పెనాల్టీ కార్నర్‌ను హర్మన్‌ప్రీత్ సింగ్ గోల్‌గా మలిచాడు. దీంతో 22వ నిమిషంలో భారత్ 1-0తో ముందంజ వేసింది. కానీ బ్రిటన్ ఎంతోసేపు వెనుకంజలో నిలువలేదు. 27వ నిమిషంలో మోర్టాన్ లీ ఫీల్డ్ గోల్‌తో స్కోరు సమం చేశాడు. ప్రథమార్థం ఆట ముగిసే సమయానికి భారత్, బ్రిటన్ 1-1తో సమవుజ్జీగా నిలిచాయి.

స్టార్ డిఫెండర్ అమిత్ రోహిదాస్ లేని వేళ సహజంగానే గ్రేట్ బ్రిటన్ ఎదురుదాడిలో పస పెంచింది. ఈ సమయంలో భారత్ ఎటాకింగ్‌ను వదిలేసి పూర్తిగా రక్షణ శ్రేణిపై దృష్టి నిలిపింది. సీనియర్ మిడ్ ఫీల్డర్ మన్‌ప్రీత్ సింగ్ డిఫెన్స్‌లోకి వచ్చాడు. సెంటర్ బ్యాక్‌గా నిలిచాడు. సుమిత్, హర్మన్‌ప్రీత్ సింగ్, జర్మన్‌ప్రీత్ సింగ్‌లు సైతం డిఫెన్స్‌లో చేరాడు. వీళ్లందరి వెనుక.. శ్రీజేష్ గోడలా నిలబడ్డాడు. బ్రిటన్ ఆటగాళ్ల గోల్ ప్రయత్నాలను శ్రీజేష్ గొప్పగా నిలువరించాడు. మిడ్‌ఫీల్డ్‌లో సుమిత్‌ను బ్రిటన్ లక్ష్యంగా చేసుకుంది. అతడి సైడ్ పిచ్‌పై దాడి చేయటం మొదలుపెట్టింది. కానీ సుమిత్ బ్రిటన్ ట్రాప్‌లో పడకుండా.. ప్రతిసారి చక్కగా ప్రతిస్పందించాడు. హార్దిక్ సింగ్, అభిషేక్, సుఖజీత్ సింగ్, లలిత్ కుమార్ ఉపాధ్యాయ్‌లు సైతం డిఫెన్స్‌లో భాగం పంచుకున్నారు.

రెడ్ కార్డ్ వివాదం!

ఫీల్డ్ హాకీలో రెడ్ కార్డ్ అత్యంత అరుదు. హాకీలో ఏ ఆటగాడు సైతం రెడ్ కార్డ్ ఎదుర్కొకుండా గేమ్‌ను డిజైన్ చేశారు. రెండు నిమిషాల సస్పెన్షన్‌కు గ్రీన్ కార్డ్, ఐదు నిమిషాల సస్పెన్షన్‌కు ఎల్లో కార్డ్ జారీ చేస్తారు. మరీ తీవ్ర తప్పిదంగా భావిస్తే పది నిమిషాల సస్పెన్షన్‌కు సైతం ఎల్లో కార్డ్‌ను రిఫరీ వాడతారు. ప్రత్యర్థి ఆటగాడికి గాయపరచాలనే కచ్చితమైన ఉద్దేశంతో ఆడితేనే రెడ్ కార్డ్ చూపిస్తారు. కానీ అమిత్ రోహిదాస్‌కు రిఫరీ రెడ్ కార్డ్ చూపించారు. 17వ నిమిషంలో రోహిదాస్.. బ్రిటన్ ఆటగాడు విలియమ్ కాల్నన్ ముఖం మీదుగా బంతిని కొట్టాడు. దీంతో రిఫరీ అమిత్ రోహిదాస్‌కు రెడ్ కార్డ్ అందించాడు. ఇక ఆ నిమిషం నుంచి భారత్ మైదానంలో పది మందితోనే ఆడింది. అమిత్‌కు రెడ్ కార్డ్ నిర్ణయం విశేష చర్చకు దారితీసింది. కానీ అమిత్ లేకపోవటంతో.. హాకీ ఇండియా రెట్టింపు జాగ్రత్త, డిఫెన్స్‌తో ఆడింది. పది మందితో అద్భుత విజయం అందుకుంది.




అద్భుత ప్రదర్శనతో 60 నిమిషాల ఆటలో గ్రేట్ బ్రిటన్‌ను నిలువరించినా.. అక్కడితో పని పూర్తి కాలేదు.



హీరో.. శ్రీజేష్

గ్రేట్ బ్రిటన్‌తో క్వార్టర్‌ఫైనల్లో భారత డిఫెన్స్ అమోఘం. డిఫెన్స్ నాయకుడు శ్రీజేష్ ఈ విజయంలో హీరో. కెరీర్ చివరి టోర్నమెంట్‌లో ఆడుతున్న శ్రీజేష్.. గోల్ పోస్ట్ ముందు వంద శాతం ప్రదర్శన ఇస్తున్నాడు. మ్యాచ్ షూటౌట్‌లోకి వెళ్లగా.. శ్రీజేష్ భారత్‌ను విజేతగా నిలిపాడు. తొలి రెండు ప్రయత్నాల్లో అల్బరీ జేమ్స్, జాక్‌లు గోల్స్ కొట్టారు. కానీ ఆ తర్వాత వరుసగా విలియమ్సన్ కానర్, రాఫర్ ఫిలిప్‌లను అడ్డుకుని భారత్‌ను విజయ సంబురాల్లో ముంచెత్తాడు. షూటౌట్‌లో భారత్ తరఫున హర్మన్‌ప్రీత్ సింగ్, సుఖజీత్ సింగ్, లలిత్ కుమార్ ఉపాధ్యాయ్, రాజ్‌కుమార్ పాల్‌లు గోల్స్ కొట్టారు.

పోరాడి ఓడిన లక్ష్యసేన్



బ్యాడ్మింటన్‌లో పతక ఆశలు రేపిన యువ షట్లర్ లక్ష్యసేన్ సెమీఫైనల్లో పోరాడి ఓడాడు. టాప్ సీడ్, డిఫెండింగ్ ఒలింపిక్ చాంపియన్ విక్టర్ అక్సెల్సెన్ (డెన్మార్క్)తో సెమీస్ పోరులో లక్ష్యసేన్ వరుస గేముల్లో ఓటమి చెందాడు. 54 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో 20-22, 14-21తో పరాజయం పాలయ్యాడు. ఉత్కంఠగా సాగిన తొలి గేమ్‌లో లక్ష్యసేన్ పట్టు విడువలేదు. ఆఖరు వరకు విక్టర్‌ను వెంటాడాడు. కానీ రెండో గేమ్‌లో చాంపియన్ విక్టర్ తన క్లాస్ చూపించాడు. మెన్స్ సింగిల్స్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. సెమీస్‌లో ఓడినా.. లక్ష్యసేన్ మెడల్ రేసులోనే నిలిచాడు. మరో సెమీఫైనల్లో పరాజయం పాలైన మలేషియా ఆటగాడు జియా లీతో కాంస్య పతక మ్యాచ్‌లో పోటీపడనున్నాడు.

ఇదిలా ఉండగా, బాక్సింగ్‌లో భారత పతక వేటకు తెర పడింది. టోక్యో ఒలింపిక్ మెడలిస్ట్ లవ్లీనా బొర్గొహైన్ క్వార్టర్‌ఫైనల్లో ఓటమి చెందింది. క్వార్టర్‌ఫైనల్లో విజయంతో లవ్లీనా కనీసం కాంస్యం ఖాయం చేసుకునేది. కానీ చైనా బాక్సర్ లి క్వియన్ చేతిలో లవ్లీనా ఓటమి చెందింది.

ఆటలు

శ్రీలంక చిందేసింది

- భారత్‌పై 32 పరుగుల తేడాతో గెలుపు
- వన్డే సిరీస్‌లో 1-0తో ముందంజ



నవతెలంగాణ-కొలంబో : భారత్‌కు షాక్. రెండో వన్డేలో ఆతిథ్య శ్రీలంక సంచలన విజయం సాధించింది. అగ్ర జట్టు భారత్‌ను మరోసారి కట్టడి చేసింది. లెగ్ స్పిన్నర్ జెఫ్రీ వండర్సే (6/33) ఆరు వికెట్లతో విజృంభించగా శ్రీలంక 32 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 241 పరుగుల ఛేదనలో టీమ్ ఇండియా 42.2 ఓవర్లలో 208 పరుగులకే కుప్పకూలింది. శ్రీలంక కెప్టెన్ చరిత్ అసలంక (3/20) సైతం మూడు వికెట్లతో మాయజాలం సృష్టించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 240 పరుగులు చేసింది. అవిష్క ఫెర్నాండో (40, 62 బంతుల్లో 5 ఫోర్లు), కుశాల్ మెండిస్ (30, 42 బంతుల్లో 3 ఫోర్లు) మినహా టాప్ ఆర్డర్‌లో ఎవరూ మెప్పించలేదు. లోయర్ ఆర్డర్‌లో డ్యునిత్ వెల్లలాగె (39), కామిందు మెండిస్ (40) మెరుపు ఇన్నింగ్స్‌లతో శ్రీలంకకు మంచి స్కోరు అందించారు. మూడు వన్డేల సిరీస్‌లో ఆతిథ్య శ్రీలంక 1-0తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది. భారత్, శ్రీలంక తొలి వన్డే టైగా ముగిసిన సంగతి తెలిసిందే. మూడో వన్డే కొలంబోలోనే బుధవారం జరుగనుంది. ఆరు వికెట్లతో చెలరేగిన జెఫ్రీ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

గవర్నర్ల తీరు మారాలి

- చేయకూడని పనులు చేస్తున్నారు
- కొందరు గవర్నర్లపై సుప్రీంలోనూ కేసులు : సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బివి నాగరత్న ఆక్షేపణ



బెంగళూరు : కొన్ని రాష్ట్రాల గవర్నర్లు తీసుకుంటున్న చర్యలు, తీసుకోని చర్యల పట్ల సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ బివి నాగరత్న తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం గవర్నర్లకు నిర్దేశించిన తీరులో వారు వ్యవహరించడం లేదని పేర్కొన్నారు. దేశంలో నేడు కొందరు గవర్నర్లు తాము ఏ చర్యలనైతే చేపట్టరాదో ఆ చర్యలు చేపడుతున్నారు, ఏ చర్యలనైతే తీసుకోవాలో, వాటిని తీసుకోవడం లేదని, ఇది దురదృష్టకరమని ఆమె వ్యాఖ్యానించారు. బెంగళూరులో శనివారం ఎన్ఎల్ఎస్ఐయు-పిఎసిటి సమావేశంలో ఆమె ప్రసంగించారు. రాజకీయ పార్టీలకు, ముఠా రాజకీయాలకు అతీతంగా గవర్నర్ వ్యవహరించాల్సి వుందని జస్టిస్ నాగరత్న హితవు పలికారు. రాష్ట్రాల చట్టసభలు ఆమోదించిన బిల్లులకు ఆమోదం తెలియచేయకుండా గవర్నర్లు తొక్కి పట్టుతూ వ్యవహరిస్తున్న తీరు పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ సుప్రీం కోర్టులో పలు రాష్ట్రాలు పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జస్టిస్ నాగరత్న చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

సమాఖ్య స్ఫూర్తి విస్మరించరాదు ..

సమాఖ్య స్ఫూర్తిని గవర్నర్లు విస్మరించరాదని ఆమె అన్నారు. 'రాష్ట్రాల పరిధిలోని అంశాలు ప్రాధాన్యత లేనివి కావు, లేదా రాష్ట్రాలు పరాధీనంగా, లొంగి వుండాలని భావించడం సరికాదు. రాజ్యాంగబద్ధమైన రాజ నీతిజ్ఞతా స్ఫూర్తి అనేది మంత్రంగా వుండాలి కానీ పక్షపాతం కాదు' అని ఆమె స్పష్టం చేశారు. సౌభ్రాతృత్వం, సోదర భావం అనేది అర్థం కాని అంశంగా మిగిలిపోతోంది. దానిపై చర్చే జరగడం లేదు. బహుశా భారత రాజ్యాంగం ముందు పీఠికలో పేర్కొన్న నాలుగు మూల స్తంభాల్లోని ఒకటైన ఈ సౌభ్రాతృత్వం అసలు ఆచరణలో వుండడం లేదనుకోవచ్చు. దేశ సమైక్యతా భావన ఈ సోదర భావం నుండే రావడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. మన ప్రజాస్వామ్యానికి కీలకం కూడా ఇదేనని అన్నారు.

ప్రాథమిక హక్కుల రక్షణ ప్రభుత్వాల బాధ్యత

ప్రాథమిక హక్కులను సంపదగా భావించి, పరిరక్షించుకోవాలని ప్రభుత్వ సంస్థలకు, పౌర సమాజానికి నాగరత్న విజ్ఞప్తి చేశారు. చట్టం ఏర్పాటు చేసిన ప్రక్రియలను అమలు చేయడం, చట్టబద్ధ పాలనా స్ఫూర్తిని గౌరవించడం, పరస్పరం చర్చలు, సంప్రదింపులతో కూడిన నిర్ణయాక క్రమాన్ని చేపట్టడం ఈ మూడు సూత్రాలను పకడ్బందీగా అమలు చేయడం ద్వారా హక్కుల ఉల్లంఘనలను నివారించవచ్చు. మన రాజకీయ జీవితం రాజ్యాంగంలో పొందుపరిచిన లక్ష్యాల సాధనను నొక్కి చెప్పాలి. పరిణతి చెందిన ప్రజాస్వామ్యంగా మన స్థాయిని సంపాదించుకోవడానికి జరిపిన కఠినమైన పోరాటంలో మన తండ్రులు, తల్లులు లెక్కలేనని త్యాగాలు చేశారు. ప్రతీ తరం ఈ దేశాన్ని నిర్మించింది. ఇంతటి వైవిధ్యభరితమైన సమాజంలో భాగమైన మనం వ్యవస్థాపక విలువలను, సూత్రాలను పరిరక్షించుకోగలుగుతున్నామా లేదా అని ఆత్మపరిశీలన చేసుకోవాల్సి వుంది. మరింత మెరుగైన రేపటి నిర్మాణం కోసం ఇటువంటి ఆత్మపరిశోధన చర్చలకు తావు కల్పిస్తుంది. ఒక దేశంగా మనం చాలా ముందుకు పయనించినా, మన వ్యవస్థాపకుల విలువలను అందుకోవాలంటే మనం మరింత ప్రయాణం చేయాల్సి వుంది' అని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు.

జాతీయ విపత్తుపై మీనమేషాలు

- న్యాయపర అంశాలు పరిశీలిస్తున్నట్లు సురేష్ గోపి వెల్లడి
- వాయనాడులో పర్యటించిన కేంద్ర సహాయ మంత్రి



తిరువనంతపురం : కేరళలోని వాయనాడ్‌లో చోటుచేసుకున్న మహా విపత్తుపై దేశమంతా స్పందిస్తున్నా కేంద్రంలోని బీజేపీ నేతృత్వం ఎన్‌డిఎ ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తోంది. ప్రకృతి ప్రకోపానికి సర్వం కోల్పోయి వేలాది మంది నిరాశ్రయులుగా ఎదురుచూస్తున్నా కేంద్రం కనికరించడం లేదు. ఈ మహా విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఇప్పటికే కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విజ్ఞప్తి చేశారు. అయితే జాతీయ విపత్తుగా ప్రకటించాలంటే న్యాయపర అంశాలను పరిశీలించాల్సివుందని కేరళకు చెందిన బీజేపీ నేత, కేంద్ర పర్యాటకశాఖ సహాయ మంత్రి సురేష్ గోపి చెప్పారు. ప్రమాద ప్రాంతంలో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ కేంద్రం ఏదైనా ఒక ప్రకటన చేసే ముందు అనేక విధి విధానాలకు కట్టుబడి ఉండాల్సివుంటుందన్నారు. వయనాడ్ విపత్తుపై కేరళ ప్రభుత్వం డిమాండ్ చేస్తున్న జాతీయ విపత్తుగా ప్రకటించే అంశంపై న్యాయపర అంశాలను కేంద్రం పరిశీలిస్తోందని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థించాలని సురేష్ గోపి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రమాదంలో నిరాశ్రయులైన కుటుంబాలకు వేగంగా పునరావాసం కల్పించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన తెలిపారు. భారత సైన్యం, ఎన్‌డిఆర్ఎఫ్ అధికారులతో కలిసి ప్రమాద ప్రాంతంలో సురేష్ గోపి పర్యటించారు. ఈ పర్యటన తరువాత కేరళ రాష్ట్ర ప్రజా పనుల శాఖ మంత్రి మహ్మద్ రియాజ్‌తో సురేష్ గోపి సమావేశమయ్యారు.

ఒడిశాలో నిత్య పెండ్లికొడుకు అరెస్టు

- ఐదుగురితో వివాహం..50 మందితో ప్రతిపాదనలు



భువనేశ్వర్ : ఒడిషాలో నిత్య పెండ్లికొడుకును పోలీసులు అరెస్టు చేశారు. 34 ఏండ్ల ఈ వ్యక్తి ఎవరికీ విడాకులు ఇవ్వకుండా ఐదుగురు మహిళలను వివాహం చేసుకున్నాడు. పోలీసు అధికారిగా చెప్పుకుంటూ లక్షల రూపాయులు వారి వద్ద కట్నంగా తీసుకున్నాడు. అంతేకాకుండా మరోవైపు మ్యాట్రిమోనియల్ సైట్‌లో మరో 50 మంది మహిళలతో వివాహ ప్రతిపాదనలు కూడా చేసుకున్నట్లు విచారణ వెల్లడయింది. ఇతని వద్ద నుంచి కారు, మోటార్ సైకిల్, రూ 2.10 లక్షల నగదు, తుపాకీ, మందుగుండు సామాగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జాజ్‌పూర్ జిల్లాకు చెందిన నిందితుడు ప్రస్తుతం భువనేశ్వర్‌లో నివసిస్తున్నాడని పోలీసులు తెలిపారు.

డిజిటల్ విద్య శృతి మించితే చేటే : యునెస్కో

న్యూఢిల్లీ : పాఠశాల స్థాయిలో సాంకేతికతను అందిపుచ్చుకోవడం సానుకూల అంశమే అయినప్పటికీ దాన్ని మితిమీరి వినియోగించడం ప్రమాదకరమని ఐక్యరాజ్యసమితి విద్య, శాస్త్రీయ, సాంస్కృతిక సంస్థ (యునెస్కో) తెలిపింది. ఈ సంస్థకు చెందిన ప్రపంచ విద్యా పర్యవేక్షణ విభాగం గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ (జెమ్).. 'విద్యలో సాంకేతికత' అనే అంశానికి సంబంధించి ఒక నివేదిక విడుదల చేసింది. మొబైల్ డివైజ్‌లతో ఎక్కువ సమయం గడపడం విద్యార్థి దృష్టి మరల్చుతుందని, వారి అభ్యసనపై ప్రతికూల ప్రభావం చూపిస్తుందని జెమ్ తెలిపింది. టెక్నాలజీపైనే తీవ్ర దృష్టి పెట్టడమనేది భారీ మూల్యం చెల్లించుకోవడమేనని, అభ్యసన ప్రక్రియకు అవసరమైనప్పుడు మాత్రమే దాన్ని తరగతుల్లో ఉపయోగించాలని ఐక్యరాజ్యసమితి నివేదిక పేర్కొంది. ఈ క్రమంలోనే దాదాపు 14 దేశాలు పాఠశాలల్లో స్మార్ట్‌ఫోన్ల వినియోగాన్ని నిషేధించాయని తెలిపింది. 'మితిమీరిన సాంకేతికత వినియోగం, విద్యార్థుల పనితీరు మధ్య ప్రతికూల సంబంధాన్ని చూపిస్తుందని ప్రోగ్రామ్ ఫర్ ఇంటర్నేషనల్ స్టూడెంట్



అసెస్‌మెంట్ (పిఐఎస్ఎ) విశ్లేషణలో తేలింది. మొబైల్ డివైజ్‌లతో ఎక్కువ సమయం గడపడం వల్ల అభ్యసన ప్రక్రియలో ప్రతికూల ప్రభావాలు వచ్చినట్లు అనేక దేశాల నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో పాఠశాలల్లో స్మార్ట్‌ఫోన్ల వినియోగంపై ఇప్పటికే 14 దేశాలు నిషేధం విధించాయి' అని జెమ్ తన తాజా నివేదికలో పేర్కొంది. తరగతి గది, ఇంట్లో చిన్నారుల చదువులపై స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు తీవ్ర అంతరాయం కలిగిస్తాయని యునెస్కో అప్రమత్తం చేసింది.

కోర్బా ఎక్స్‌ప్రెస్‌లో ఎసి కోచ్‌లు దగ్ధం

- విశాఖ స్టేషన్‌లో ఘటన
- షార్ట్ సర్క్యూట్ కారణం : అధికారులు

విశాఖపట్నం : విశాఖ రైల్వే స్టేషన్‌లో ఆదివారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. కోర్బా - విశాఖపట్నం (18517) కోర్బా ఎక్స్‌ప్రెస్ ఉదయం 6.20 గంటలకు విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లోని 4వ నెంబర్ ఫ్లాట్ ఫామ్‌నకు చేరుకుంది. ప్రయాణికులు అందరూ దిగి వెళ్లిపోయారు. రైలు ప్లాట్‌ఫామ్‌పైనే ఉంది. ఉదయం 9:30 గంటలకు రైలులోని బి8 ఎసి కోచ్‌లో మంటలు ప్రారంభమై బి6, బి7, ఎం1 కోచ్‌లకు వేగంగా వ్యాపించాయి. ఈ ప్రమాదంలో బి7 కోచ్ పూర్తిగా దగ్ధం కాగా.. బి8, బి6, ఎం1 కోచ్‌లు 70 శాతం కాలిపోయాయి. స్టేషన్‌లో రైలు ఆగి ఉన్న సమయంలో ప్రమాదం సంభవించడంతో ప్రాణ నష్టం తప్పింది. సకాలంలో స్పందించిన విశాఖపట్నం సిటీ పోలీసులు, జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్, అగ్నిమాపక సిబ్బంది నాలుగు ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సంఘటన స్థలానికి విశాఖపట్నం సిటీ జాయింట్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఫకీరప్ప, డిఆర్ఎం సౌరవ్‌ప్రసాద్ చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.



ప్రమాదానికి ఎసి యూనిట్‌లో షార్ట్ సర్క్యూట్ కారణమని ప్రాథమిక విచారణలో అధికారులు తెలిపారు. రైల్వే పోలీసులు (జిఆర్‌పి) కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ప్రమాదం కారణంగా ఇతర రైళ్ల సేవలపై ప్రభావితం కాకుండా అధికారులు చర్యలు చేపట్టారు. కాలిపోయిన కోచ్‌ల స్థానంలో ప్రత్యామ్నాయ కోచ్‌లను ఏర్పాటు చేశారు. విశాఖపట్నం - కడప (17488) ఎక్స్‌ప్రెస్ నిర్దీత సమయానికే విశాఖపట్నం నుంచి బయలుదేరింది.

బడ్జెట్.. పేదవాడికి అందట్లే

- విద్యా, వైద్యం ఉచితంగా అందిస్తేనే ప్రజలకు లబ్ధి
- ఎమ్మెల్యేలు సహనం కోల్పోతున్నారు
- అరవింద్.. పసుపు బోర్డు ఎక్కడ..?: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కేంద్రంలో మోడీ ప్రభుత్వం గానీ, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం గానీ బడ్జెట్‌లో ఈ రంగానికి ఇంత.. అంత.. అంటూ కేటాయింపులు చెప్తున్నారు కానీ అవి పేదవాడికి ఏ మాత్రం అందుతుందో లేదో అని చూడట్లేదు. ప్రభుత్వాలు పేదవానికి నేరుగా లబ్ది చేకూరే పథకాలు ప్రవేశపెట్టాలి. నరేంద్రమోడీ ప్రభుత్వం బడా పారిశ్రామిక వేత్తలకు రూ.30 లక్షల కోట్ల బకాయిలు మాఫీ చేశారు. కానీ పేదలకు మాత్రం చేయటానికి మనసు ఒప్పడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వైద్యం ఉచితంగా అందిస్తే చాలని, అప్పుడే ప్రజలకు లబ్ధి చేకూరుతుందని' సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజకీయ శిక్షణా తరగతులు, ఏఐటీయూసీ అభినందన సభ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం టీఎన్‌జీఓ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కూనంనేని మాట్లాడారు. అసెంబ్లీలో పేదవాని పక్షాన మాట్లాడే గొంతుకలు కరువయ్యాయని అన్నారు. ఎమ్మెల్యేలు అసెంబ్లీలో బూతులు తిట్టుకుంటూ, సహనం కోల్పోయి ఒకరినొకరు నిందించుకోవడం ఎక్కువైందని, ఇలా చేస్తున్న ఎమ్మెల్యేలపై వేటువేయాలని తెలిపారు. సమస్యల మీద గొంతు వినిపిస్తారని ఎమ్మెల్యేలను ప్రజలు అసెంబ్లీకి పంపించారని, వారి స్వలాభం కోసం కాదని గుర్తు చేశారు. పేదవాని తరుపున మాట్లాడేది ఎర్రజెండా పార్టీలేనని అన్నారు. ఎన్ని ప్రభుత్వాలు ఏలినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని అన్నారు. తాను ఎక్కడికి వెళ్ళినా తమ సమస్యలు అసెంబ్లీలో లేవనెత్తాలని అడుగుతున్నారని అన్నారు. అసంఘటిత రంగ కార్మికులను దోపిడీ చేసేందుకు ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు అంటూ వివిధ పేర్లతో ముందుకు వస్తున్నారని ఆరోపించారు. అసంఘటిత రంగం కార్మికులు రెండు కోట్లకు పైగా ఉన్నారని, వారికి కనీస వేతనాలు అందించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపించాలని అన్నారు. నిజామాబాద్‌లో మోడీ ద్వారా హామీ ఇప్పించిన ఎంపీ ధర్మపురి అరవింద్ పసుపు బోర్డు ఎక్కడ పెట్టారో చూపించాలని డిమాండ్ చేశారు.

రెండో సారి గెలిచిన అరవింద్.. పసుపు బోర్డు ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. అసలు పసుపు బోర్డు తెస్తారా లేదా అని ప్రశ్నించారు. కాగా, ముందుగా పార్టీ నాయకులు సాంబశివరావుకు సన్మానం చేశారు. అనంతరం వివిధ సంఘాల ఆధ్వర్యంలో సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్య పద్మ, జిల్లా కార్యదర్శి పి. సుధాకర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు నాయకులు సాయిలు, విఠల్ గౌడ్, చక్రపాణి, వివిధ సంఘాల బాధ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీలో నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూపులు



రేపోమాపో అంటూ సాగదీత

అసంతృప్తిలో 'అధికార పార్టీ' నేతలు

అమరావతి: ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పదవుల కోసం టిడిపి కూటమి నేతలు ఎదురుచూస్తున్నారు. అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడిచినా.. ఇప్పటికీ ఒక్క పోస్టు కూడా భర్తీ కాలేదు. రేపోమాపో అంటూ సాగదీయటంతో కొంతమంది నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నామినేటెడ్ పోస్టుల కోసం చూస్తున్న ఆశావహులు తమ బయోడేటాను పార్టీ కార్యాలయంలోని ప్రోగ్రామ్స్ కమిటీకి అందించాలని టిడిపి అధిష్టానం నెలన్నర క్రితం ఆ పార్టీ నాయకులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రోగ్రామ్స్ కమిటీ నాయకుల నుంచి బయోడేటా, దరఖాస్తులు స్వీకరిస్తోంది. ప్రోగ్రామ్స్ కమిటీకి వచ్చిన బయోడేటాల పరిశీలన కార్యక్రమం టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలోనే జరుగుతోంది. దీంతో ఎవరికి ఏ పదవి వస్తుంది? ఎప్పుడు భర్తీ చేస్తారనే అంశం మిగిలిన నేతలకు తెలియడం లేదు. నామినేటెడ్ పోస్టుల ఖాళీల వివరాలను సాధారణ పరిపాలనశాఖ అన్ని శాఖల నుంచి సమాచారం జులై మొదటి వారంలో తెప్పించుకుంది. రాష్ట్రంలో పోలీస్ శాఖలోని డిఎస్‌పి, సిఐలతోపాటు, ఇతర శాఖల్లో కూడా అధికారుల బదిలీలు జరుగుతున్నాయి. ఈ పోస్టులు ఎమ్మెల్యేల ఇష్ట ప్రకారమే జరుగుతున్నాయని, పదవి లేకపోవడంతో తాము ఏమీ చేయలేకపోతున్నామని శనివారం టిడిపి నేత బుద్దా వెంకన్న బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. బుద్దా వెంకన్న వంటి నేతలు పార్టీలో మరికొందరు ఉన్నారని, అయితే వారు బయటపడటం లేదనే చర్చ టిడిపిలో నడుస్తోంది.

గ్రీవెన్స్‌లో అధికులు ఆశావహులే!

టిడిపి కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు, పార్టీ నేతలు నిర్వహిస్తున్న గ్రీవెన్స్ కార్యక్రమంలో నామినేటెడ్ ఆశావహుల దరఖాస్తులే ఎక్కువగా ఉంటున్నాయనే చర్చ టిడిపిలో జరుగుతోంది. గత ప్రభుత్వంలో ఇబ్బందులు పడ్డ కార్యకర్తలు, ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రజావేదిక పేరుతో ఈ గ్రీవెన్స్ కార్యక్రమం మొదలుపెట్టారు. సమస్యలు చెప్పుకునేందుకు ఎంతమంది వస్తున్నారో అంతే సంఖ్యలో పదవుల కోసమూ వస్తున్నారు. దీంతో గ్రీవెన్స్ కోసం వస్తున్న వారితో పార్టీ కార్యాలయం కిక్కిరిసిపోతుందని నేతలు భావిస్తున్నారు. ప్రతి శనివారం ముఖ్యమంత్రి వచ్చే సమయంలో వస్తున్న ప్రజలను భద్రతా సిబ్బంది నియంత్రించలేకపోతోంది. ముఖ్యమంత్రి కూడా గంటల తరబడి నిలబడే వారి నుంచి వినతులు స్వీకరిస్తున్నారు. నామినేటెడ్ పోస్టుల భర్తీ జరిగితే పార్టీ కార్యాలయానికి వచ్చే నేతలు, ప్రజలు తగ్గుతారని నేతలు భావిస్తున్నారు.

సీనియర్లు చూపు 'నామినేటెడ్' వైపే..

టిడిపిలో సీనియర్ నేతలు సైతం కార్పొరేషన్ ఛైర్మన్ పోస్టులను ఆశిస్తున్నారు. ఎన్నికల సమయంలో పొత్తులో భాగంగా టికెట్లు త్యాగం చేసిన నేతలు, ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతల కోసం సీటు త్యాగం చేసిన నేతలు ఈ విభాగంలో ఉన్నారు. సాధారణంగా వీరు ఎమ్మెల్సీ, రాజ్యసభ వంటి పదవులు ఆశిస్తారు. ఈ రెండు కూడా రెండేళ్ల వరకు భర్తీ అయ్యే అవకాశం లేదు. శాసనమండలిలో వచ్చే ఏడాది కేవలం నాలుగు స్థానాలు మాత్రమే ఖాళీ కానున్నాయి. వీటిల్లో టిడిపి సీనియర్ నేత యనమల రామకృష్ణుడుతోపాటు చిక్కాల రామచంద్రరావు, బిటి నాయుడు, పి అశోక్ బాబు ఉన్నారు. 2027లో భారీ సంఖ్య లో భర్తీ కానున్నాయి. రాజ్యసభ స్థానాలు 2026లో నాలుగు ఖాళీ కానున్నాయి. పదవులు లేకుండా అప్పటి వరకు ఉండటం నేతలు కష్టంగా భావిస్తున్నారు. కావున ముందు కార్పొరేషన్ ఛైర్మన్ పదవి తీసుకుని ఆ తర్వాత ఎమ్మెల్సీ అడగాలని భావిస్తున్నారు.

కూటమిలో పార్టీలకు పంపకాలు ఫార్ములా..!

టిడిపి కూటమిలో నామినేటెడ్ పదవుల పంపకాలు కొలిక్కొచ్చినట్లు సమాచారం. టిడిపి గెలిచిన నియోజకవర్గాల్లో ఆ పార్టీకి 60 శాతం, జనసేనకు 30 శాతం, బిజెపికి 10 శాతం చొప్పున పదవులు పంపకాలు చేయాలని మూడు పార్టీలు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. జనసేన గెలిచిన నియోజకవర్గాల్లో జనసేనకు 60 శాతం, టిడిపికి 30 శాతం, బిజెపికి 10 శాతం చొప్పున, బిజెపి గెలిచిన నియోజకవర్గాల్లో బిజెపికి 60 శాతం, టిడిపికి 30 శాతం, జనసేనకు 10 శాతం పంపకాలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

యుద్ధం అంచుల్లో పశ్చిమాసియా

- ఇరాన్‌ను బరిలోకి లాగుతున్న అమెరికా
- ప్రవాసీయుల భద్రతపై ఆందోళన

వాషింగ్టన్/టెహ్రాన్/ టెల్అవీవ్ : హమాస్, హిజ్బుల్లా నేతల హత్యతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు వేగంగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం అ క్కడ పరిస్థితి ఎప్పుడైనా పేల డానికి సిద్ధంగా ఉన్న అగ్ని పర్వతంలా ఉందని పశ్చిమాసియా వ్యవహారాల నిపుణుడు, ఫుడాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సన్ డెగాంగ్ పేర్కొన్నారు. కాల్పుల విరమణపై ఇప్పటివరకు మిణుకుమిణుకు మంటున్న ఆశలు ఈ పరిణామాల తరువాత పూర్తిగా సన్నగిల్లాయని ఆయన అభిప్రాయపడ్డారు. హమాస్ రాజకీయ విభాగం అధిపతి హనియే హత్య తరువాత హమాస్- ఇజ్రాయిల్ వివాదం ఇరాన్- ఇజ్రాయిల్ మధ్య ఘర్షణకు దారి తీస్తోందని సన్ పేర్కొన్నారు. తమ గడ్డపై హనియేను హత్య గావించినందుకు ఇజ్రాయిల్‌కు తగిన గుణపాఠం చెబుతామని ఇరాన్ ఇప్పటికే ప్రకటించింది. పశ్చిమాసియాపై కోల్పోతున్న తన పట్టును నిలబెట్టుకోవడానికి అమెరికా దీనిని ప్రాంతీయ యుద్ధంగా మార్చాలని చూస్తోందని, ఇరాన్‌ను కవ్వించి ఈ యుద్ధంలోకి లాగడంలో ఆంతర్యం ఇదేనని సన్ అన్నారు. జులై చివరిలో పాలస్తీనాకు చెందిన 14 గ్రూపుల ప్రతినిధులను చైనా తమ దేశానికి ఆహ్వానించి వారి మధ్య సయోధ్య కుదిర్చిన కొద్ది రోజులకే హమాస్, హిజ్బుల్లా నేతల హత్య అమెరికా భౌగోళిక, రాజకీయ వ్యూహంతో సంబంధం లేదనుకోడానికి వీల్లేదని ఆయన అన్నారు. ఇరాన్ పశ్చిమాసియాలోని ఇతర మిత్ర దేశాలను కూడా సంప్రదించి ఇజ్రాయిల్‌కు దీటుగా జవాబిచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. . మరో వైపు అమెరికా అధ్యక్షుడు బైడెన్ నెతన్యాహుకు ఫోన్ చేసి ఇజ్రాయిల్‌కు తన పూర్తి మద్దతు ఉంటుందని చెప్పారు. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, కెనడా ఇతర పశ్చిమ దేశాలతో కూడిన కూటమి ఇరాన్, ఇజ్రాయిల్ ఘర్షణను ప్రాంతీయ యుద్ధంగా మార్చేందుకు తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి. అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ బాలిస్టిక్ క్షిపణులు, డిస్ట్రాయర్లు, క్రూయిజ్ క్షిపణులు, పలు ఫైటర్ స్క్వాడ్రన్‌లు (ఒక్కో స్క్వాడ్రన్‌లో 12 నుంచి 24 ఫైటర్ జెట్ విమానాలు ఉంటాయి), అబ్రహం లింకన్ కారియర్, యుఎస్ఎస్ థియాడర్ రూజ్‌వెల్ట్ వంటి భారీ యుద్ధ విమాన వాహక నౌకలను ఇజ్రాయిల్‌కు తరలించాలని ఆదేశించారు.

ఉద్రిక్తతలు తీవ్రతరమవుతున్న నేపథ్యంలో పశ్చిమాసియా నుంచి, ముఖ్యంగా లెబనాన్ నుంచి తమ దేశానికి చెందిన పౌరులను వెంటనే ఖాళీ చేసి ఏ విమానం దొరికితే ఆ విమానంలో వెనక్కి వచ్చేయాలని బీరుట్‌లోని తమ ఎంబసీల ద్వారా అమెరికా, బ్రిటన్, స్వీడన్, ఫ్రాన్స్, కెనడా, జోర్డాన్ అడ్వయిజరీలు పంపాయి. భారత్ కూడా ఇటువంటి అడ్వయిజరీనే జారీ చేస్తూ, బీరుట్‌లోని ఎంబసీకి టచ్‌లో ఉండాలని కోరింది. ఇప్పటికే పలు విమాన సర్వీసులు మూసివేసినప్పటికీ, కొన్ని కమర్షియల్ విమాన సర్వీసులు నడుస్తున్నందున వాటిలో వచ్చేయాలని ఆ అడ్వయిజరీలో కోరింది. పెరుగుతున్న ఉద్రిక్తతలపై ఈజిప్టు విదేశాంగ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

హనియే హత్యకు ప్రతీకార చర్య గతంలో సిరియాలోని తమ దౌత్యకార్యాలయంపై దాడికి ఇచ్చిన సమాధానం కన్నా అనేక రెట్లు అధికంగా ఉంటుందని పేరు తెలపడానికి ఇష్టపడని ఇరాన్ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. హమాస్ నేతను హత్య చేసి తప్పు చేశాం అని ఇజ్రాయిల్ చింతించేలా తమ ప్రతీకార చర్య ఉంటుందని ఆయన అన్నారు.

సంఘటిత పోరాటంతో సమస్యల పరిష్కారం

- సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వం హయ్యర్ పెన్షన్ సమస్యలను తక్షణం పరిష్కరించాలి : సదస్సులో ఎఐఆర్‌డబ్ల్యుఎఫ్ జాతీయ కార్యదర్శి వివిఎస్ రావు



కర్నూలు : హయ్యర్ పెన్షన్ వాటా రాబట్టుకోవడానికి సంఘటితంగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ జాతీయ కార్యదర్శి, తెలంగాణ ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వివిఎస్ రావు డిమాండ్ చేశారు. ఎంప్లాయిస్ పెన్షన్ పథకం 1995లో సుప్రీంకోర్టు తీర్పు అమలు మేరకు ప్రభుత్వం హయ్యర్ పెన్షన్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. 'సుప్రీంకోర్టు తీర్పు అమలు హయ్యర్ పెన్షన్ సమస్యలు' అనే అంశంపై కర్నూలు కార్మిక కర్షక భవన్లో ఆదివారం రాష్ట్ర ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కోశాధికారి జె దివాకర్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన వివిఎస్ రావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ లక్షలాదిమంది హైయర్ పెన్షన్ పొందడానికి అనేక ఆటంకాలున్నాయని, వీటిని పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇపిఎఫ్ఒ తీవ్రమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని అన్నారు. అస్తవ్యస్త విధానాల కారణంగా కొంతమంది సకాలంలో దరఖాస్తు చేసుకోలేక హయ్యర్ పెన్షన్ అవకాశాన్ని కోల్పోయారని తెలిపారు. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ఉద్యోగుల, కార్మికుల సమస్యల పరిష్కార దిశగా వ్యవహరించడంలేదని అన్నారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ ఇప్పటికే అనేక అంశాలను ఇపిఎఫ్ఒ ప్రాంతీయ కార్యాలయాలు, కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిందన్నారు. హయ్యర్ పెన్షన్ పొందడానికి, న్యాయంగా రావలసిన వాటా రాబట్టుకోవడానికి సంఘటితంగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సదస్సులో రాష్ట్ర ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అయ్యప్పరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాలు హక్కుగా ఉద్యోగ కార్మికుల చెల్లించాల్సింది పోయి, అనేక అడ్డంకులను సృష్టించడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని విజ్ఞప్తి చేశారు. రూ. లక్షల కోట్లు పోగుబడిన పెన్షన్ నిధులను కేంద్ర ప్రభుత్వం దారి మళ్లించి షేర్ మార్కెట్లో పెట్టి వ్యాపారం చేయడం దారుణమన్నారు. ఈ సదస్సులో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి అంజి బాబు, ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా కార్యదర్శి వివిఎస్ రాయుడు, జిల్లా నాయకులు కెసి.శేఖర్, బి.నాగరాజు, ఎ. దేవరాజు, ఎస్.హనుమంత ఆర్‌టిసి రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు జి శ్రీనివాసులు, ఎస్-ఎస్ రావు, ఎస్ సాంసన్, రిటైర్డ్ పేపర్ మిల్లు యూనియన్ నాయకులు రామాంజనేయులు, గ్లాస్ ఫ్యాక్టరీ రిటైర్డ్ యూనియన్ నాయకులు కె సుధాకరప్ప, కర్నూలు, నంద్యాల,అనంతపురం జిల్లా పెన్షనర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేరస్థులకు శిక్షలు తప్పనిసరి కావాలి

- ఆ దిశగా దర్యాప్తును కొనసాగించాలి
- మహిళలు, పిల్లలపై జరిగే నేరాల్లో దోషులపై మరింత కఠిన వైఖరి : అధికారులతో సమీక్షలో డీజీపీ జితేందర్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

రాష్ట్రంలో నేరాలకు పాల్పడేవారికి తప్పనిసరిగా శిక్ష పడేలా చేసే దిశగా దర్యాప్తును కొనసాగించాలని రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ పోలీసు అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా, మహిళలు, బాలికలపై జరిగే నేరాల్లో నిందితులు ఎట్టి పరిస్థితుల్లోనూ శిక్ష నుంచి తప్పించుకోకుండా చూడటం తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడటమేగాక నేరాలను అరికట్టాలంటే దోషులకు శిక్షలు తప్పనిసరిగా పడతాయనే సందేశాన్ని పోలీసు శాఖ నుంచి పంపించాలని ఆయన అన్నారు. వివిధ కేసులను నమోదు చేసే స్థానిక పోలీసులు దర్యాప్తులో 'భరోసా' అధికారులతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయమై దర్యాప్తును సాగిస్తే చక్కటి ఫలితాలను కోర్టుల నుంచి సాధించగలుగుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఈ ఏడాదిలో ఇప్పటి వరకు కోర్టుల నుంచి కొన్ని తీవ్రమైన కేసుల్లో కఠిన కారాగార శిక్షలను దోషులకు పడేలా చేయగలిగామనీ, ఇందుకు దర్యాప్తు విభాగాల సమిష్టి కృషి కారణమని ఆయన చెప్పారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు వివిధ కేసుల్లో 15 మంది నిందితులకు 20 ఏండ్ల కఠిన కారాగార, మరో ఇద్దరికి 25 ఏండ్ల పాటు కారాగార శిక్షతో పాటు మరో 11 మంది నేరస్థులకు యావజ్జీవ కారాగార శిక్షలను సాధించామని ఆయన వివరించారు. మొత్తమ్మీద, దర్యాప్తులో కీలకమైన ఆధారాలను సాధించటానికి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్) సాకారంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా దర్యాప్తు అధికారులు విరివిగా ఉపయోగించుకోవాల్సినవసరమున్నదని ఆయన తెలిపారు. అవసరమైన సందర్భాల్లో అనుభవజ్ఞులైన సీనియర్ పోలీసుల సాకారాన్ని కూడా దర్యాప్తు అధికారులు తీసుకోవటంతో వారి లక్ష్యాలను సులువుగా చేరుకోగలరని ఆయన చెప్పారు.

ఉత్తర కొరియాకు రష్యా ఆపన్న హస్తం

- అవసరమైన సాయమందిస్తామన్న పుతిన్

మాస్కో : భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమవుతున్న ఉత్తర కొరియాకు మద్దతునందిస్తామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హామీనిచ్చారు. గత నెల 27న రికార్డు స్థాయిలో వర్షపాతం కురిసిందని, ఫలితంగా లెక్కలేనంత మంది మరణించారని ప్యాంగాంగ్ ఈ వారం ప్రకటించింది. చైనాకు సమీపాన గల ఉత్తర సరిహద్దు ప్రాంతంలో సంభవించిన వరదలతో ఇళ్ళు, పొలాలు నీటమునిగాయి.. వర్షాలు, వరదలు సృష్టించిన బీభత్సం పట్ల పుతిన్ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. అవసరమైన సాయాన్ని అందించేందుకు ముందుకు వచ్చారు. ఉత్తర కొరియాకు తక్షణమే మానవతా సాయం అందుతుందని పుతిన్ ప్రకటించారు. దానిపై కిమ్ స్పందిస్తూ, నిజమైన మిత్రుని పట్ల ప్రత్యేక భావోద్వేగతను ప్రకటించారు. ఆపన్న హస్తం అందించినందుకు పుతిన్‌కు కృతజ్ఞతలు తెలియచేశారు. ఇప్పటికే అమల్లో వున్న పథకాలు, ప్రణాళికలు పని చేస్తున్నాయని చెప్పారు. సమీప భవిష్యత్తుల్లో సాయం గనక అవసరమైతే తప్పనిసరిగా మాస్కోలోని విశ్వసనీయమైన మిత్రులనే అడుగుతానని చెప్పారు.